www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
ఆదివారం 16 ఫిబ్రవరి 2025
సంపుటి :06 సంచిక : 259 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH

## కులగణన చేస్తే.. రాహుల్ కులం చెబుతారు

- బిజెపి విమర్శలకు పిసిసి చీఫ్ ఎదురుదాడి

హైదరాబాద్,ఫిబ్రవరి15( వెలుతురు ):



ప్రధాని మోడీ బీసీ కాదంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కాకరేపుతున్నాయి. సీఎం రేవంత్ కామెంట్స్‌కు బీజేపీ నేతలు ధీటుగా బదులిస్తున్నారు. మోడీ కులం గురించి మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీది

2 లో..

## దేశానికి రోడ్‌మ్యాప్ కానున్న కులగణన

- ఫిరాయింపులపై కోర్టు ఆదేశాల మేరకు నడుచుకుంటాం
- రాహుల్‌తో సిఎం రేవంత్ భేటీ
- కేబినేట్‌పై చర్చించలేదని వెల్లడి



న్యూఢిల్లీ,ఫిబ్రవరి15( వెలుతురు ):
తెలంగాణలో కులగణన దేశానికి రోడ్ మ్యాప్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీ పర్యటనలో భాగంగా సుమారు గంటసేపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశమైన రేవంత్‌రెడ్డి .. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. భేటీ అనంతరం సీఎం మీడియాతో

2 లో..



## సంత్ సేవాలాల్ మహారాజ్ కు ఘనంగా పుష్పాంజలి ఘటించిన సీఎం రేవంత్ రెడ్డి

(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 15:
బంజారాల ఆరాధ్య దైవం, సంఘ సంస్కర్త శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మహనీయుడికి శని వారం నాడు ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ బంజారా జాతికి ఆధ్యాత్మిక మార్గదర్శిగా సంత్ సేవాలాల్ మహారాజ్ నిలిచారని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. అలాగే సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాల హక్కుల కోసం పోరాడిన మహెూన్నత సంఘసంస్కర్త అని కొనియాడారు. ఈ సందర్భంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా బంజారా సోదరసోదరిమణులకు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలను తెలియజేశారు, ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర కాంగ్రెస్ ముఖ్య నాయకుడు రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు,

# మోదీ కులం, రాహుల్ మతంపై చర్చకు సిద్ధమా?

- మతపరమైన రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం
- ఈ విషయం తెలిసి రాజకీయ లబ్ధి పొందాలనుకుంటున్నారు
- బీసీ జాబితా నుండి ముస్లింలను తొలగించి పంపితే కేంద్రాన్ని ఒప్పిస్తా
- రాజాసింగ్ హిందూ ధర్మం కోసం పోరాడే నాయకుడు
- ధర్మ పోరాటంలో ఎన్నో ఇబ్బందులు పడ్డారు
- రాజాసింగ్ కు అభ్యంతరాలుంటే అంతర్గతంగా మాట్లాడాలి
- మీడియాకు ఎక్కడం సరికాదు
- రూ.12.75 లక్షల వరకు ఐటీ మినహాయింపుపట్ల టీఎన్జీవో నాయకుల హర్షం
- బండి సంజయ్ ను సన్మానించిన టీఎన్జీవో నేతలు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ అంశమే రెఫరెండమా?

బీసీల్లో ముస్లింలను కలిపితే కేంద్రం ఆమోదించే ప్రసక్తే లేదు

కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్....

*కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి మోదీది ఏ కులం? రాహుల్ గాంధీది ఏ మతం అనే అంశాలపై చర్చకు తాము సిద్ధమని, ఇదే అంశాన్ని రెఫరెండంగా భావిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లోకి వెళదామా? అంటూ కాంగ్రెస్ పార్టీకి సవాల్ విసిరారు. కుల గణన తప్పుల తడక, బీసీ జాబితాలో ముస్లింలను కలపడంపట్ల కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత నెలకొందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రధాని కులంపై సీఎం రేవంత్ రెడ్డి అవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. ముస్లింలను బీసీ జాబితాలో కలిపి రిజర్వేషన్ల జాబితాను కేంద్రానికి పంపితే ఆమోదించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.*



హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 15:
"మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం. ముస్లింలను బీసీ జాబితాలో చేర్చి పంపితే ఆమోదించే ప్రసక్తే లేదు. ఈ విషయం తెలిసి కూడా కాంగ్రెస్ డ్రామాలాడుతోంది. ప్రజలకు, బీసీ సంఘాలకు ఈ విషయం తెలుసు"అని వ్యాఖ్యానించారు. శనివారం రోజున హైదరాబాద్ లోని టూరిజం ప్లాజాలో ఎనిమీ ప్రాపర్టీస్ (శత్రు ఆస్తులు)పై కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ పై విధంగా స్పందించారు. ఏమన్నారంటే.... తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీస్ పై సమీక్ష నిర్వహించాం. రంగారెడ్డి, హైదరాబాద్, కొత్తగూడెం, వికారాబాద్ జిల్లాల్లోని ఎనిమీ ప్రాపర్టీస్(శత్రు ఆస్తులు) ఉన్నాయి. చాలా ఆస్తులు ఆక్రమణలు జరిగాయి. వాటిని ఏ విధంగా స్వాధీనం చేసుకోవాలి. నిబంధనలకు అనుగుణంగా పొజిషన్ లో ఉన్న సామాన్య ప్రజలు, రైతులకు ఇచ్చేందుకు ఉన్న అవకాశాలేమిటి? అనే అంశాలపై పూర్తిస్థాయిలో సర్వే, రికార్డ్స్ పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను కోరాము. గతంలో పాకిస్తాన్ తో యుద్ధం సందర్భంగా ఇండియా నుండి పాకిస్తాన్ వెళ్లిన ప్రజలు, ఇక్కడ తమ ఆస్తులను వదిలేసి వెళ్లారు. అట్లాగే పాకిస్తాన్ నుండి ఇండియాకు వచ్చిన వాళ్లు అక్కడ తమ ఆస్తులను వదిలేశారు. అయితే ఆ ఆస్తులు పాకిస్తాన్ ఒప్పందాన్ని ఉల్లంఘించి అమ్మేసుకుంది. ఈ నేపథ్యంలో దేశంలోని ఎనిమీ ప్రాపర్టీస్ ను కూడా అమ్మేసి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాలని నిర్ణయించాం. తెలంగాణలో దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన ఎనిమీ ప్రాపర్టీస్ ఉన్నాయని అంచనా వేస్తున్నాం. మార్చి

2 లో..



## దేశంకు ఆదర్శంగా కుల గణన సర్వే

హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ముఖ్య నేతలతో కలిసి

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 15:
తెలంగాణ ప్రభుత్వం దేశంలో మొట్టమొదటిసారిగా మా నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల హామీ మేరకు భారత్ జూడో పాదయాత్ర సందర్భంగా దేశ వ్యాప్తంగా తిరిగే సందర్భంలో ప్రజల ఆకాంక్షల కనుగుణంగా ఎవరికి ఎంతో వారికంతా రావాలని దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా ,రాష్ట్రంలో అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కుల సర్వే చేస్తామని హామీ ఇచ్చారని అందులో భాగంగానే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ కార్య క్రమాన్ని చేపట్టామని మంత్రి ప్రభాకర్ తెలిపారు,దానిలో

2 లో..



## మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పులకుప్పలుగా మార్చారు

- రహదారుల అభివృద్ధి కేంద్రం వేల కోట్లు
- విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నల్లగొండ, ఫిబ్రవరి15( వెలుతురు ) :
తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు రాష్ట్రం మిగులు బడ్జెట్‌గా ఉందని, ఆ తరువాత అప్పులకుప్పలుగా మార్చారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణకు కేంద్రం నిధులు కేటాయించడం లేదన్నది పూర్తిగా

2 లో..



## సేవాలాల్ మార్గం ఆచరణీయం

- జయంతి వేడుకల్లో సిఎం చంద్రబాబు

అమరావతి,ఫిబ్రవరి15( వెలుతురు ):
సంత్ సేవాలాల్ ఎపిలో పుట్టినా.. ఇతర రాష్ట్రాల్లో ఎక్కువ సేవ చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. మహాత్మగాంధీ కంటే ముందే సంత్ సేవాలాల్ అహింస పాటించారని అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో చంద్రబాబు పాల్గొన్నారు. సంత్ సేవాలాల్ అహింస సిద్ధాంతం

2 లో..



## బడ్జెట్ ప్రతి పాదనల పై సమీక్ష నిర్వహించిన భట్టి

(రాపర్తి భాస్కర్ గౌడ్)
వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 15:
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో శని వారం నాడు రెవిన్యూ, హౌసింగ్, ఐ & పిఆర్ ఉన్నత అధికారులతో 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

3 లో..

## తెలంగాణలో ఎమ్మెల్సీ కోడ్

రేషన్ కార్డుల జారీలో కొంత ఆలస్యం

హైదరాబాద్,ఫిబ్రవరి15 ( వెలుతురు ) :
తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు పక్రియ కొనసాగుతోంది. నూతనంగా దరఖాస్తు చేసే చాన్స్ కూడా

3 లో..

## కెసిఆర్‌పై కక్షతో రైతులకు వేధింపులు

- బనకచర్లపై అడుగులు పడుతున్న అడ్డుకోరా
- గోదావరి జలాలు వృధాగా పోతున్నా పట్టించుకోరా
- ప్రభుత్వంపై ఎమ్మెల్సీ కవిత ఘాటు వ్యాఖ్యలు




ఖమ్మం,ఫిబ్రవరి15( వెలుతురు ):
రాష్ట్రంలో దౌర్భాగ్యమైన పరిస్థితి నెలకొందని... మాజీ సీఎం కేసీఆర్‌పై కక్షతో రైతులను బాధపెడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. శనివారం మీడియాతో ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. గోదావరి జలాలు కళ్ళముందే పోతున్నా పట్టించుకునే దిక్కులేదన్నారు. బనకచర్ల ప్రాజక్ట్ 190 టీఎంసీ కోసం చంద్రబాబు కొట్లాడుతున్నారని..బంకచర్లకు కేంద్రం అనుమతి ఇస్తే మన పరిస్థితి ఏంటని ఆమె ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డికి

2 లో..

## అప్పలు చేస్తే తప్ప సంక్షేమ పథకాలు సాగేలా లేవు

- సేంద్రియ వ్యవసాయానికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం
- రసాయన ఎరువుల వాడకంతో క్యాన్సర్ ముప్ప
- చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీకి ఏర్పాట్లు
- నెల్లూరు పర్యటనలో సిఎం చంద్రబాబు

నెల్లూరు,ఫిబ్రవరి15( వెలుతురు ):
అప్పులు చేస్తేనే సంక్షేమ పథకాలు అమలు చేసే పరిస్థితి వచ్చిందని సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు.. నెల్లూరు జిల్లా కందుకూరులో మాట్లాడిన ఆయన.. రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయింది.. అప్పులు చేస్తేనే కానీ సంక్షేమ పథకాలు అమలు చేసే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.. ఒకప్పుడు వ్యవసాయానికి పంజాబ్ ఎంతో ప్రసిద్ధి చెందింది.. పురుగుమందులు విచ్చలవిడిగా వాడడం వల్ల అక్కడ ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన చెందారు. చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు.. రాబోయే రోజుల్లో క్యాన్సర్ విస్తృతం కానుంది.. ఇప్పటి నుంచే ప్రజలు అప్రమత్తం కావాలని



2 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## దేశానికి రోడ్‌మ్యాప్ కానున్న కులగణన

మాట్లాడారు. కులగణన ద్వారా ప్రజాసంక్షేమానికి బాటలు వేస్తున్నాం అని అన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణలో తెలంగాణ ఒక రోల్ మోడల్. రాహుల్ గాంధీ చెప్పింది నేను కచ్చితంగా చేస్తా. రాష్ట్రంలో కులగణన సమగ్రంగా నిర్వహించాం. ఇందులో వెల్లడైన వివరాల ఆధారంగా భవిష్యత్తులో కమిషన్ గాని కమిటీ గాని వేసి ప్రజలకు ఏ విధంగా సంక్షేమ ఫలాలు చేరువ చేయాలనే దానిపై కసరత్తు చేస్తాం అని వివరించారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటాం అన్నారు. ప్రధాని మోదీని వ్యక్తిగతంగా తాను తిట్టలేదు. మోదీ పుట్టుకతో బీసీ కాదని మాత్రమే చెప్పాను. పుట్టుకతో బీసీ కాదు కాబట్టే బీసీల పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని అన్నాను. నా వ్యాఖ్యలను కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వక్రీకరించారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే జనగణనలో కులగణన కూడా చేయాలి. మంత్రివర్గ విస్తరణపై రాహుల్ గాంధీతో చర్చించలేదు. బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు తెస్తాం అని రేవంత్‌రెడ్డి అన్నారు.అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కావడంతో కేబినెట్ విస్తరణ కోసమేనని ఊహాగానాలు వినిపించాయి. మంత్రి పదవులు ఆశిస్తోన్న ఆశావహులు సైతం అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలోనే కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. తెలంగాణలో చేసిన కుల గణన గురించి రాహుల్ గాంధీకి వివరించానని మాత్రమే తెలిపారు. కేవలం కుల గణన, ఎస్సీ వర్గీకరణపై మాత్రమే రాహుల్ గాంధీతో చర్చించానని.. కేబినెట్ విస్తరణ, పీసీసీ కార్యకర్గ కూర్పుపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టత ఇచ్చారు. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ క్యార్గవర్గంపై చర్చించేందుకే ఈ భేటీ అన్న ఊహాగానాలు రేవంత్ రెడ్డి కొట్టి పారేశారు. కేబినెట్ విస్తరణ అంశం హై కమాండ్ చూసుకుంటుందని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపుల అంశంపైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటామని స్పష్టం చేశారు. కోర్టులు చేసే పనిని కేటీఆర్ చేయాలనుకుంటున్నారని.. ఉప ఎన్నికలు వస్తాయో రావో కేటీఆరే చెప్పేస్తున్నారని మండిపడ్డారు. గతంలో సబితా ఇంద్రారెడ్డి ఏ బీ ఫామ్ మీద గెలిచారు..? ఎవరి మంత్రి వర్గంలో పనిచేశారు..? తలసాని శ్రీనివాస్ 2014లో గెలిచింది ఏ బీ ఫామ్ మీద, మంత్రిగా పనిచేసింది ఎవరి ప్రభుత్వంలో..? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కులగణన, ఎస్సీ వర్గీకరణలో కమిషన్లు ఇచ్చే నివేదికలు చట్టబద్ధం చేస్తామని చెప్పారు. వీటిలో ఎక్కడా రాజకీయ జోక్యం ఉండదన్నారు. రాజకీయ జోక్యం ఉండకూడదు అనే ఉద్దేశ్యంతోనే కమిషన్ ఏర్పాటు చేస్తున్నామని క్లారిటీ ఇచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపుతామని పేర్కొన్నారు.

## కులగణన చేస్తే.. రాహుల్ కులం చెబుతారు

ఏ కులం, ఏ మతమో చెప్పాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. ఈ క్రమంలో బండి సంజయ్ వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు.శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీలు బట్టేబాజ్ మాటలు మాట్లాడ్తున్నారని మండిపడ్డారు. దేశం కోసం తూటాలకు బలై ప్రాణ త్యాగం చేసిన గాంధీ కుటుంబ గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులానికి అతీతంగా రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి దమ్ముంటే.. దేశ వ్యాప్తంగా కులగణన చేసి బీసీల పట్ల కేంద్రానిది స్టాండ్ ఏందో చెప్పండి.. అప్పుడు రాహుల్ గాంధీ కులం గురించి చెబుతారని సవాల్ విసిరారు. రాహుల్ గాంధీ కులం అడగడం ఎందుకు..? బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా కుల గణన చేయిస్తే.. రాహుల్ గాంధీనే ఆయన కులం ఏదో చెప్తారు. రాహుల్ గాంధీనే సర్వేకి వెళ్ళిన వారికి సంతకం పెట్టి మరీ ఆయన కులం, మతం ఏంటో చెప్తారు. దమ్ముంటే దేశవ్యాప్తంగా కుల గణన చేయండి‘ అని బీజేపీ నేతలకు మహేష్ గౌడ్ ఛాలెంజ్ విసిరారు. ప్రధాని మోడీ బీసీ కాదని.. హాట్ కామెంట్స్ చేశారు. మోడీ పుట్టుకతో బీసీ కాదని.. ఆయన సీఎం అయ్యాక మోడీ కులాన్ని బీసీలో కలిపారని సంచలన వ్యాఖ్యలు చేశారు.

### కెసిఆర్‌పై కక్షతో రైతులకు వేధింపులు

కనీసం ఈ ఏడాది కాలంలో త్తటెడు మట్టి పోయలేదన్నారు.రాజకీయాల కోసం, అధికారం కోసం కొట్లాడుకుందాం కానీ రైతుల భవిష్యత్తు ఫణంగా పెట్టవద్దని హితవుపలికారు. రాష్ట్ర విభజన సభయంలో ఏడు మండలాలతో పాటు సీలేరు ప్రాజక్ట్ కోల్పోయామన్నారు. ఏపీలో టీడీపీ , బీజేపీ అలయన్స్ నడుస్తోందన్నారు. కొత్త ప్రాజెక్టుల కోసం అనుమతులు తెచ్చుకుంటున్నారని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల సర్వే పూర్తి చేసి ఫిగర్స్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో పెద్ద కుట్ర జరుగుతోందని విమర్శించారు. 46 శాతం ఉన్న బీసీలకు అదే స్థాయిలో విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు ఇవ్వాలన్నారు. బీసీల విద్య, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్ల కోసం ప్రత్యేక బిల్లులు పెట్టాలన్నారు. మూడు బిల్లులు పెట్టకపోతే కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేనట్టే అని అన్నారు. ‘మీకు నిజాయితీ ఉంటే సిన్సియర్‌గా రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటే మూడు బిల్లులు పెట్టండి. రేవంత్ రెడ్డి తనకు అవసరమైనప్పుడు బీజేపీ నేతలతో మాట్లాడిస్తుంటారని కవిత వెల్లడించారు. ఉదయం ఖమ్మం జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటించారు. ఈ సందర్భంగా ఖమ్మం సబ్ జైల్లో రిమాండ్‌లో ఉన్న లక్కినేని సురేందర్‌ను పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..లక్కినేని సురేందర్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని మండిపడ్డారు. కేసీఆర్‌ను కట్టడి చేయాలని చూస్తున్నారన్నారు. కొందరిని అరెస్ట్ చేస్తే కేసీఆర్‌ను అడ్డుకున్నట్టా అని ప్రశ్నించారు. రైతుబంధు రాలేదు, భీమా రాలేదు, ఫించన్ రాలేదు, ఉద్యోగాలు రాలేదు, అన్నీ దొంగ మాటలే అంటూ విరుచుకుపడ్డారు. 14 నెలల పాలనలో దొంగ హామీలే తప్ప చేసింది లేదన్నారు. ఖచ్చితంగా ప్రశ్నిస్తామని.. పాలించడం చేతకాక అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా తగ్గేదే లేదని స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. కేసులకు భయపడొద్దని.. ప్రజాక్షేత్రంలో పోరాడుతూనే ఉందామని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. ఏ కారణం లేకుండా బీఆర్ఎస్ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న నాయకులను టార్గెట్ చేస్తున్నార కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని మండిపడ్డారు. అక్రమ కేసులతో కేసిఆర్ సైన్యాన్ని కట్టడి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని, కానీ కెసిఆర్ ని, కెసిఆర్ సైన్యాన్ని కట్టడి చేయడం ఎవరికి సాధ్యం కాదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నించకుండా తమను ఆపలేరని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలన్ని, మోసాలన్నీ ప్రజల మనసుల్లోకి వెళ్లిపోయాయని, రైతులు, విద్యార్థులు, మహిళలతో పాటు అన్ని వర్గాలు ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నాయని తెలిపారు. 14 నెలల పాలనలో రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదని అందరికీ తెలిసిపోయిందని, ఆ భయంతోనే ఎవరిని పడితే వాళ్లను కేసులు పెట్టి జైల్లో వేస్తున్నారని చెప్పారు. గ్రామ సభల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకు సురేందర్ పై అక్రమ కేసు నమోదు చేసి జైలు పంపారని, ప్రభుత్వం నడపడం చేతగాక, పథకాలు అందించడం చేతకాక వైఫల్యాలను కప్పిపెట్టుకుంటామంటే కుదరదని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేంత వరకు వెంట పడుతూనే ఉంటామ, అక్రమ కేసులకు తలొగ్గేదే లేదని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని తేల్చిచెప్పారు.

## మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పులకుప్పలుగా మార్చారు

అవాస్తమన్నారు. తెలంగాణకు ఇచ్చిన నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమా అని రేవంత్ ప్రభుత్వానికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. తెలంగాణలో జాతీయ రహదారుల కోసం లక్షా 20వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని అన్నారు. రూ. 80వేల కోట్ల పనులు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. కేంద్రం నుంచి రీజనల్ రింగ్ రోడ్, మెగా టెక్స్ టైల్ పార్క్, రైల్వే కోచ్ తెచ్చామని ఉద్ఘాటించారు. శనివారం నల్గొండలో కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులి సరోత్తమ్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మూడు ఎన్నికల్లోనూ పోటీ చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమే అని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల అకాంక్షల కోసం బీజేపీ పనిచేస్తుందని అన్నారు. రూ. 7వేల కోట్లతో రామగుండంలో యూరియా ఉత్పత్తి చేసే పరిశ్రమ ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భూమి పూజ చేశారని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఎరువులకు సబ్సిడీ ఇస్తూ రైతులను బీజేపీ ఆదుకుంటుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు కేంద్రం ఏం ఇచ్చిందని అడగడం ఫ్యాషన్‌గా మారిందని విమర్శించారు. 2014 మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను పూర్తిగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే దివాలా తీయించామని ఆరోపించారు. 11 ఏళ్లలో రూ.10 లక్షల కోట్లు రెండు పార్టీలు కలిసి అప్పులు చేశాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. అద్భుతమైన తెలంగాణ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని కిషన్‌రెడ్డి విమర్శించారు.

# మోదీ కులం, రాహుల్ మతంపై చర్చకు సిద్ధమా?

నెలాఖరులోపు ఆయా ఆస్తులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించాం.

మనిషి పుట్టిన వెంటనే కులం పేరు పెడతామా? రేవంత్ రెడ్డికి అట్లనే చేశారా? ముఖ్యమంత్రిగా బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ ప్రధానిపై మాట్లాడేటప్పుడు అవాకులు, చవాకులు మాట్లాడతారా? రేవంత్ విజతకే వదిలేస్తున్నా. మోదీ ముమ్మాటికీ బీసీనే. 1994లోనే గుజరాత్ లోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే మోదీ కులాన్ని బీసీ జాబితాలో చేర్చింది. ఈ దేశంలోని వెనుకబడిన వర్గాలు, అగ్రవర్ణ పేదలు, దళిత జాతి మొత్తం మోదీ తొలిసారి ప్రధానమంత్రి కాగానే సంబురాలు చేసుకున్నారు. మోదీ సైతం తన తొలి కేబినెట్ లో 27 మంది బీసీలను మంత్రులుగా చేశారు. అట్లాగే 12 మంది దళితులను, 8 మంది ఎస్టీలను మంత్రులుగా చేశారు. మరి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఎంత మంది బీసీలున్నారు? ఇద్దరు మాత్రమే. మరి కుల గుణన సర్వేలో 46 శాతం మంది బీసీలున్నట్లు మీ ప్రభుత్వం లెక్క తేల్చింది. అంతకుముందు కేసీఆర్ హయాంలో సర్వే చేస్తే 51 శాతం బీసీలున్నట్లు తేల్చారు. ఈ లెక్కన మీ ప్రభుత్వంలో ఎంత మంది మంత్రులుండాలి? మరి మీరు ఎంత మందికి అవకాశం కల్పించారు?

అసలు మోదీ కులం గురించి చర్చించాల్సిన అవసరం ఏముంది? ఆ విషయానికొస్తే... రాహుల్ గాంధీ కులం, మతం, జాతి గురించి చర్చ చేయాలి. ఎందుకంటే రాహుల్ గాంధీ తాత ఫిరోజ్ ఖాన్. ఆయన తల్లి సోనియాగాంధీ క్రిస్టియన్. ఇటలీ దేశస్తురాలు. మరి రాహుల్ ఏ కులమని ప్రోత్సహిస్తున్నారు. రాహుల్ కు ఒక కులం లేదు, మతం లేదు, జాతి లేదు. మరి అట్లా చర్చ చేయాలంటే టెన్ జన్ ఫథ్ నుండే రాహుల్ కులం, మతం గురించి చర్చ చేద్దామా? దీనికి రేవంత్ ఏం సమాధానం చెబుతారు. రేవంత్ తీరు కొరివితో తలగోక్కోవడమంటే ఇదే. రేవంత్ కు దమ్ముంటే... మోదీ బీసీయా కాదా? రాహుల్ గాంధీ కులం, మతంపై ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెఫరెండంగా భావిద్దామా?

నేనడుగుతున్నా 6 గ్యారంటీలపై ప్రజలు నిలదీస్తుంటే వాటిపై చర్చ చేయకుండా, సమాధానం చెప్పకుండా రేవంత్ రెడ్డి డైవర్షన్ పొలిటిక్స్ చేస్తున్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి ఇస్తామన్నరు. తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నరు. ఉద్యోగులను పీఆర్సీని అమలు చేస్తామన్నారు. కానీ ఏమీ చేయలేదు. నిరుద్యోగుల పక్షాన కొట్లాడి జైలుకు పోయింది బీజేపీ. వాళ్లకు అండగా ఉన్నది బీజేపీ. ఇచ్చిన మాట ప్రకారం రోజ్ గార్ మేళా కింద 9.25 లక్షల ఉదయోగాలను భర్తీ చేసింది బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం. మరి మీరు చేసిందేమిటి? 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి 50 వేల మందికి ఉద్యోగాలిచ్చినట్లు చెప్పుకుంటున్నారు. సిగ్గుండాలే.

బీసీ జాబితాలో ముస్లింలను కలిపితే కేంద్రం ఒప్పుకునే ప్రసక్తే లేదు. మతపరమైన రిజర్వేషన్లుకు మేం వ్యతిరేకం. ఈ విషయం తెలిసి కూడా కేంద్రంపై నెట్టి రాజకీయం చేయడానికి రేవంత్ రెడ్డి డ్రామాలాడుతున్నారు. కాంగ్రెస్ కు దమ్ముంటే బీసీ జాబితా నుండి ముస్లింలను తొలగించాలి. అట్లాగే పూర్తిస్థాయిలో కులగణన చేసి బీసీ జనాభా లెక్క తేల్చాలి. ఆ తరువాత కేంద్రానికి పంపితే ఒప్పించి ఆమోదింపజేసే బాధ్యత మేం తీసుకుంటాం. అంతే తప్ప బీసీ జాబితాలో ముస్లింలను కలిపి రిజర్వేషన్లు ఇవ్వాలని కేంద్రానికి పంపితే ఒప్పుకునే ప్రసక్తే లేదు. మత రిజర్వేషన్లను వ్యతిరేకించి తీరుతాం. అది తెలిసి కూడా కేంద్రానికి పంపిస్తాం... ఆమోదించాలని మాట్లాడటం విడ్డూరం. అసలు బీసీ జాబితాలో ముస్లింలను కలపడంవల్ల బీసీలకు దక్కాల్సిన విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో, నిధులు కేటాయింపులతో తీవ్రమైన అన్యాయం జరిగే ప్రమాదముంది. ఇప్పటికే ముస్లింలకు మైనారిటీ కోటాలో లాభం చేకూరుస్తున్నారు. ఈడబ్ల్యూఎస్ కొటాలోనూ లబ్ది పొందుతున్నారు. మళ్లీ బీసీ జాబితాలో కలపడం ఏంది? అట్లా చేస్తే బీసీ స్థానాల్లో ముస్లింలు పోటీ చేసి గెలుస్తారు. అప్పుడు బీసీలకు పూర్తిగా అన్యాయం జరుగుతుంది. ఇగ బీసీలకు చేసిన లాభమేంది? కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారు. ఒకవర్గానికి మేలు చేసేందుకు బీసీలను రాచిరంపాను పెడుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లంతా తమ ఓటును ఆయుధంగా మార్చుకుని కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలని కోరుతున్నా....

కాంగ్రెస్ కులగణన సక్రమమైతే రీ సర్వే ఎందుకు చేస్తున్నారు? తెలంగాణలో 3 కోట్ల 95 లక్షల ఆధార్ కార్డులున్నట్లు నివేదికలున్నయ్. ఆధార్ తీసుకోని వారి శాతం మరో 10 శాతం ఉన్నట్లు చెబుతున్నారు. ఈ లెక్కన తెలంగాణ జనాభా 4 కోట్ల 30 లక్షలు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుల గణన సర్వే చేసి 3 కోట్ల 70 లక్షల జనాభా ఉన్నట్లు తేల్చడమేంది? మిగిలిన 60 లక్షల మంది ప్రజలేమైపోయారు? కాంగ్రెస్ చంపేసిందా? మీకు దమ్ముంటే ఇంటింటికీ వెళ్లి కుల గణన చేయాలి. ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి కేంద్రానికి పంపాలి. అంతే తప్ప హిందూ జనాభా తగ్గించి ముస్లిం జనాభా పెంచి నివేదిక పంపుతామంటే ఊరుకునే ప్రసక్తే లేదు...

(రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ....)

ఒక కులానికే బీజేపీలో పదవులిచ్చారని అనడం కరెక్ట్ కాదు. గత ఎన్నికల్లో బీసీ వ్యక్తిని సీఎం చేస్తామని బీజేపీ ప్రకటించింది. అట్లాగే అంతకుముందు బీసీనైన నాకు రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చారు. బీసీ అయిన లక్ష్మణ్ కు రాజ్యసభ సభ్యత్వం ఇవ్వడం తోపాటు పార్లమెంటరీ బోర్డు పదవి ఇచ్చింది. బీసీని సీఎం చేస్తానని ప్రకటించింది కాబట్టి ఓసీ అయిన కిషన్ రెడ్డికి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చింది. అయినా పార్టీ నియమనిబంధనల ప్రకారం పదవులిస్తారు. ఏదైనా అభ్యంతరాలుంటే పార్టీలో అంతర్గతంగా చర్చించాలి. అంతే రోడ్డుకు ఎక్కడం సరికాదు. రాజాసింగ్ కు ఇబ్బందులుండొచ్చు. బాధ ఉండొచ్చు. ఆయన కమిట్ మెంట్ ఉన్న నాయకుడు. హిందుత్వవాది. చాలా మంచి వ్యక్తి. అనేక రకాలుగా ధర్మం కోసం పోరాడుతూ ఇబ్బంది పడ్డారు. ఆయన మావాడు. ఆయనతో నిన్న మాట్లాడిన. ఇకపైనా మాట్లాడతా. ఎందుకంటే మా పార్టీ నాయకుడు.

# దేశంకు ఆదర్శంగా కుల గణన సర్వే

(మొదటి పేజీ తరువాయి..)

భాగంగా తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పక్షాన లక్ష మంది ఉద్యోగులతో 150 ఇళ్లకు ఒకరు చొప్పున కుల సర్వే జరిగిందని అలాగే మేము 100% సర్వే జరిగింది అని చెప్పలేదని చెప్పారు, 3.1 % అందులో హైదరాబాద్ నగరంలో రెండున్నర లక్షల ఇళ్లు మొత్తం మూడు లక్షల 54 వేల ఇల్లు మిగిలిపోయాయని మంత్రి పొన్నం చెప్పడం జరిగింది, ఒక కోటి 15 లక్షల ఇళ్లకు గాను ఒక కోటి 12 లక్షల ఇళ్లలో సర్వే జరిగిందన్నారు,ఈ సర్వే జరిగిన సందర్భంలో అన్ని రాజకీయ పార్టీలు సర్వే జరగాలని తీర్మానానికి అరకొరా మద్దతు ఇచ్చి సర్వే జరిగిన తర్వాత కూడా శాసనసభలో చర్చకు పెడితే అరకోరా మద్దతు ఇచ్చి వాళ్ల యొక్క నీచ బుద్ధిని చాటుకున్నారని మంత్రి పొన్నం తెలిపారు,రిజర్వేషన్ల ప్రక్రియ కోసం జరుగుతున్న ఈ కులాల సర్వేలో అవమానపరిచే విధంగా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు,ముఖ్యమంత్రి నిన్న కాంగ్రెస్ శ్రేణుల సమావేశంలో మాట్లాడింది భారత ప్రధానమంత్రి పుట్టు బీసీ కాదనీ,1994లో చరణ్ దాసు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మారిందా.ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మార్చుకున్నారా అనే అంశాన్ని పక్కన పెడితే ఒకప్పుడు ఆయన బీసీ కన్వర్ట్ గా మారారనీ ఆయన అన్నారు,కిషన్ రెడ్డి మిగతా కులాల గురించి మాట్లాడుతున్నారు. దేశంలో కిషన్ రెడ్డి, లక్ష్మణ్, రాజేందర్ మిగతా బిజెపి నాయకులను అడుగుతున్నా ప్రధానమంత్రి కులానికి సంబంధించిన ప్రస్తావన తెచ్చి తెలంగాణ బలహీన వర్గాలకు అన్యాయం చేసే ప్రయత్నం మానుకోండి అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు,1994 లో అయ్యాడా 2004 లో ముఖ్యమంత్రి అయిన తరువాత అయ్యాడా అనేది ఐదారు సంవత్సరాల తేడా కావచ్చు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం జరుగుతున్న సర్వేకు మిగిలిన వారికి 16 వ తేది నుండి 28 తేదీ వరకు అవకాశం ఇచ్చామని మంత్రి తెలిపారు, మీకు వీలైతే హైదరాబాదు నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నారు కాబట్టి ఎక్కడైనా మిస్ అయిన వారిని చైతన్యపరిచి తెలంగాణ జనాభా లెక్కల్లో ఉండాలని చెప్పండి కుల సర్వే జనాభా లెక్కల్లో పేర్లు ఇయ్యక సమాచారం ఇవ్వక స్పందించక ఏది పడితే అది మాట్లాడితే మంచిది కాదని తెలిపారు,తెలంగాణ ప్రభుత్వం చేసిన సర్వే ను చట్టబద్ధం చేయడానికి క్యాబినెట్ లో పెట్టి తెలంగాణ జనాభా లెక్కల్లో 56% బీసీలు వచ్చారు వాళ్ళకి 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన దానికనుగుణంగా క్యాబినెట్ తీర్మానం చేయబోతున్నామనీ తెలిపారు,క్యాబినెట్ తీర్మానం తో పాటు శాసనసభలో చట్టం తీసుకొస్తామన్నారు, రాజకీయ విద్య ఉపాధి అవకాశాల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని శాసనసభ వేదికగా చట్టం చేయబోతు న్నామనీ అన్నారు, ఈ అంశానికి మీరు మద్దతు ఇస్తున్నారా వ్యతిరేకమా చెప్పాలని మంత్రి ప్రశ్నించారు,ఈ ప్రతిపాదనను తీసుకుపోయి ఢిల్లీలో ప్రధానమంత్రి ని ఒప్పిస్తారా లేదా అని అడిగారు, ఎక్కడ తెలంగాణ రాష్ట్రంలో శాసనసభలో ఆమోదం పొంది 42 శాతం రిజర్వేషన్లకు రిజర్వేషన్లకు తీర్మానం జరిగి పార్లమెంట్ లో వంద మంది ఎంపీలతో తీర్మానం చేస్తారు అని భయం లో పడ్డారు ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలను వక్రీకరించి మాట్లాడుతున్నారు,ప్రధానమంత్రి పుట్టుక తో బీసీ కాదు కన్వర్టెడ్ బీసీ అని మీరే ఒప్పుకుంటున్నారు, 2001 లో ముఖ్యమంత్రి అయిన తర్వాత కన్వర్టెడ్ బీసీ అని మేము అంటున్నాం.కానీ అంతకుముందే మీ ముఖ్యమంత్రి చేశారని మీరు అంటున్నారు,మీరు పుట్టుకతో బీసీ కాదని ఒప్పుకున్నారు, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు 42 శాతం రిజర్వేషన్లకు కేంద్రం నుండి అన్ని రకాల చట్టపరమైన చర్యలు తీసుకునే కియాశీలక మైన పాత్ర పోషిస్తే బలహీన వర్గాలు మీ పట్ల ఆలోచిస్తాయని మంత్రి పొన్నం అన్నారు,ఇది ఎవరికి వ్యతిరేకం కాదు.సామాజిక భారతదేశం వెనుకబడ్డ వారిని ముందుకు తేవాలి.ముందున్న వారు వెనకబడ్డ వారికి సహకారం ఇవ్వాలి,ఇది ప్రజాస్వామికంగా జరుగుతున్న ప్రభుత్వం.ప్రధాన మంత్రి మొండికేసి సుప్రీంకోర్టు లో అఫిడవిట్ పెట్టి నేను చేయనే చేయను అని కూర్చుంటే ప్రధాన మంత్రి ని విమర్శించాల్సి వస్తుందని మంత్రి పొన్నం తెలిపారు, మీరు నిజంగానే పుట్టుకతో బీసీ అయితే ఇలాంటి మాటలు అనకపోయెవారు ,పుట్టుకతో వచ్చిన వారికి వచ్చిన హక్కు మద్యలో వచ్చిన వారికి a మార్పు ఎందుకు ఉంటుంది. ముందే నీ నాయకత్వం స్పందించి రాష్ట్రం నుండి ప్రతిపాదనలు రాగానే కేంద్రం నుండి సిద్ధంగా ఉన్నామని క్రెడిట్ తీసుకోండి,బీజేపీ కుల సర్వేను వ్యతిరేకించేది మీరే సుప్రీంకోర్టు లో అఫిడవిట్ ఫైల్ చేసేది మీరే ప్రధాన మంత్రి పుట్టుకతో బీసీ కాదు అంటే ఖండించేది మీరే అని పొన్నం ప్రభాకర్ విమర్శించారు,సర్వే తప్పులతడకు అంటారు , మతపరమైన అంశాలు జోడించారు అంటారు.మీరు చేయరు.చేసే వాళ్ళకి అడ్డం పడతారు.దేశ వ్యాప్తంగా చేయండి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు ఎంత ఉన్నారో బయట వాళ్ళు ఎంత ఉన్నారు..వారి ఆర్థిక సామాజిక రాజకీయ పరిస్థితులు తెలుసుకోండి. అంతే తప్ప జరిగిన మాటలు వక్రీకరించి బలహీన వర్గాలకు అన్యాయం చేయకండి అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు, ఈ సమావేశంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు, కులగణన వివరాల నమోదుకు మరో అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు, కులగణనలో పాల్గొనని వారి వివరాల నమోదుకు తెలంగాణ ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు, ఈనెల 16 నుంచి 28 వరకు నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. దీని కోసం టోల్ ఫ్రీ నం. 040-211 11111ను ఏర్పాటు చేశారు. ఫోన్ చేసిన వారి ఇంటికి వెళ్లి ఎన్యుమరేటర్లు వివరాలు నమోదు చేయనున్నారు.ఎంపీడీవో కార్యాలయం, వార్డు ఆఫీసులకు వెళ్లి కూడా వివరాలు నమోదు చేసుకోవచ్చు. కులగణన సర్వేలో 3,56,323 కుటుంబాలు పాల్గొనలేదని అధికారులు పేర్కొన్నారు.

# అప్పులు చేస్తే తప్ప సంక్షేమ పథకాలు సాగేలా లేవు

(మొదటి పేజీ తరువాయి..)

హెచ్చరించారు. ఎరువులు వేయకుండా పాత పద్ధతిలో వ్యవసాయం చేసే విధానాలను ప్రోత్సహిస్తున్నాను.. మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉంది.. ప్రకృతి సేద్యాన్ని మరింత ప్రోత్సహిస్తామని అన్నారు.. చెత్త నుంచి సంపదను సృష్టించే కార్యక్రమాలను చేపడుతున్నాం.. పేపర్లు . బాటిళ్లను రీసైక్లింగ్ చేసే విధానాలను తీసుకువస్తున్నాం.. కందుకూర్‌లో 25 టన్నుల టన్నుల చెత్తను రీ సైక్లింగ్ చేసే పక్రియను ప్రారంభించడం అభినందనీయం అన్నారు.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యతను సర్పంచులు తీసుకోవాలి.. కంపోస్ట్ తయారు చేసేందుకు షెడ్లు కూడా నిర్మించాం.. గ్రామాల్లో చెత్త పేరు కోకుండా సర్పంచులు చూసుకోవాలి.. ఏ సర్పంచ్ బాగా చేస్తే వారిని ప్రోత్సహిస్తాం అని బాబు అన్నారు. మున్సిపాలిటీలలో మునిసిపల్ చైర్మన్ లపై ఆ బాధ్యత ఉంటుంది.. అందరికీ ర్యాంకులు ఇస్తాం.. రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ చేసే వరకూ కార్యక్రమాలను కొనసాగిస్తాం.. 30 ఏళ్ల ముందు నేను డ్రిప్ ఇర్రిగేషన్ పెడితే అందరూ ఎగతాళి చేశారు.. ఇప్పుడు అది సర్వసాధారణమైంది.. గతంలో ఐ.టీ. గురించి మాట్లాడా.. ఇప్పుడు ఏ.ఐ. గురించి మాట్లాడుతున్నా.. గతంలో ఉద్యోగాలు చేయమని చెప్పా.. ఇప్పుడు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని కోరుతున్నాను అన్నారు. ప్రజల ఆహారపు అలవాట్లు మారాయి.. గతంలో అందరూ రాగిసంగటి తినేవారు.. ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు రూపాయల కిలో బియ్యం తీసుకువచ్చారు.. ఇప్పుడు తృణ ధాన్యాలపై ప్రజల ఆసక్తిని చెబుతున్నారు.. రైతులలో కూడా మార్పు రావాలి.. ప్రజల అవసరాలకు అనువైన పంటలను పండించాలని సూచించారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం కింద ఇంటి వద్ద విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు.. పేదరికం లేని సమాజాన్ని సాధించేందుకు అండగా ఉంటా.. పి 4 విధానాన్ని తీసుకువస్తున్నాం.. స్కిల్ డెవలప్మెంట్ పై ప్రత్యేక శ్రద్ధ పెడతాం అన్నారు చంద్రబాబు.. పొదుపు సంఘాలు పెట్టినప్పుడు కొందరు ఎగతాళి చేశారు.. ఆరోజు వేసిన విత్తనం ఈరోజు ఎంత ఎదిగిందో అందరూ చూస్తున్నారు.. గ్రామాల్లో డైరీ పరిశ్రమకు ప్రాధాన్యం ఇవ్వాలి.. ప్రస్తుతం జనాభా పెరగాల్సిన అవసరం ఉంది.. దీనిని బాధ్యతగా తీసుకోవాలి.. కొన్ని దేశాల్లో మనుషుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది.. వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఈ ప్రాంతానికి నీటి సమస్య ఉండేది కాదు.. నదుల అనుసంధానాన్ని కూడా చేస్తాం.. విద్యుత్ చార్జీలు తగ్గించేందుకు సోలార్ ..విండ్ ఎనర్జీని తీసుకువస్తున్నాం.. ప్రపంచంలోనే ఉత్తమ విధానాలను తీసుకువచ్చి అమలు చేస్తాం.. కందుకూరి ప్రాంతంలో 18వందల ఎకరాలను గర్భకండ్రిగ కింద పెట్టారు.. ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తాం.. కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద ఇచ్చిన నిధులను గత ప్రభుత్వం ఖర్చు పెట్టకుండా కాలయాపన చేసింది.. స్వచ్ఛభారత్ కింద ఇచ్చిన నిధులను కూడా పూర్తిగా ఖర్చుపెట్టలేదన్నారు..

### సేవాలాల్ మార్గం ఆచరణీయం

(మొదటి పేజీ తరువాయి..)

బోధించారని తెలియజేశారు. ఈనాడు మనం ఆచరిస్తున్న ఆర్థిక విధానాలు ఆయన అప్పుడే బోధించారని, సంత్ సేవాలాల్ మార్గంలో ప్రయాణిస్తే అందరికి మేలు జరుగుతుందని సిఎం చెప్పారు. అందరి మనోభావాలను కాపాడుతూనే కూటమి సర్కారు పనిచేస్తుందని, పేదలు, ప్రత్యేకంగా గిరిజనులు సేవ చేసిన ఘనత ఎన్టీఆర్‌కు దక్కుతుందని వెల్లడించారు. గిరిజనుల్లోని వెనుకబాటును తగ్గించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, గిరిజన చట్టాలను కూటమి ప్రభుత్వం కాపాడుతుందని పేర్కొన్నారు. వెల్త్, హెల్త్, హ్యాపీ అనే సిద్దాంతాలతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, తండాల నుంచి ఎంతో మందిని రాజకీయంగా ప్రోత్సహించామని చంద్రబాబు స్పష్టం చేశారు.

# హయత్ నగర్ జీ స్కూల్ వద్ద విద్యార్థుల తల్లితండ్రుల ఆందోళన

- జీ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**వెలుతురు, హయత్ నగర్, ఫిబ్రవరి 15:**
రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ లోని పాత జాతీయ రహదారిపై ఉన్న జీ స్కూల్ లో శనివారం నాడు అ పాఠశాల విద్యార్థుల తల్లి దండ్రులు ఆందోళన నిర్వహించారు, విద్యార్థులు తమ స్కూల్ లో ఫీజులను పెంచినందుకు నిరసనగా విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద ధర్నా , నిరసన కార్య క్రమం ను నిర్వహించారు, అయితే పాఠశాల లో ఒక సారిగా విద్యార్థుల స్కూల్ ఫీజులను 30 శాతం పెంచుతూ పాఠశాల యాజమాన్యం నిర్ణయం తీసుకున్న విషయం పై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తు నిరసన చేపట్టారు, ప్రభుత్వం తక్షణమే స్పందించి జీ స్కూల్ యాజమాన్యం పై కఠిన చర్యలకు ఆదేశించాలని డిమాండ్ చేశారు, విద్యార్థుల భవిష్యత్ కోసం తాము కష్టపడి సంపాదించిన డబ్బును ఫీజు కడితే పాఠశాల యాజమాన్యం మాత్రం తమ ఇష్ట ప్రకారం ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు,

# బడ్జెట్ ప్రతి పాదనల పై సమీక్ష నిర్వహించిన భట్టి

(మొదటి పేజీ తరువాయి..)



సమీక్ష నిర్వహించారు, ఈ సమీక్ష సమావేశంలో రాష్ట్ర మంత్రులు రెవిన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మరియు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఏమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మరియు అధికారులు తదితరులు పాల్గొన్నారు,

## రాష్ట్రంలో బిల్డర్స్ కు సంపూర్ణ సహకారం: భట్టి

రాష్ట్రంలో బిల్డర్స్ కు సంపూర్ణ సహకారం అందిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు,బిల్డర్స్ కు స్వర్గధామం హైదరాబాద్ నగరమని భట్టి తెలిపారు,హైదరాబాదును గ్రీన్ సిటీగా మార్చేందుకు పలు విధాన నిర్ణయాలు తీసుకున్నామనీ చెప్పారు. ఆదాయం కంటే హైదరాబాద్ నగర ప్రజల ఆరోగ్యమే మాకు ప్రధానం అని భట్టి విక్రమార్క అన్నారు, హైదరాబాదులో డీజిల్ వాహనాలను దశలవారీగా ఎలక్ట్రికల్ వాహనాలుగా మారుస్తామన్నారు, ప్రపంచ కేంద్రంగా ఫ్యూచర్ సిటీ. ఆ ప్రాంతంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్ణయాలు తీసుకుంటామన్నారు,మూసి పునర్జీవనానికి ముందుకు పోతాం. ఆధునిక దేశాల బాటలో తెలంగాణను నడిపిస్తాం. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేవలం హైదరాబాద్ అభివృద్ధికి పదివేల కోట్లు కేటాయించామని భట్టి విక్రమార్క చెప్పారు,హైదరాబాద్ నోవాటెల్ లో జరిగిన బిల్డర్స్ గ్రీన్ తెలంగాణ సమ్మిట్ సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం లోని ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, బడా బిల్డర్లు , తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఎమ్మెల్సీ కోడ్

కల్పిస్తోంది. దీంతో మీ–సేవా కేంద్రాల దగ్గర భారీగా జనం బారులు తీరుతున్నారు. గత రెండ్రోజుల నుంచి మీ–సేవా సెంటర్ల దగ్గర భారీగా రద్దీ నెలకొంటోంది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా కార్డు రాకపోవడంతో వాళ్లలో చాలా మంది మీ–సేవలో తిరిగి దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే ఈ ప్రక్రియ కొంత ఆలస్యం కానుందని సమాచారం. ప్రస్తుతం తెలంగాణలోని పలు జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ స్థానానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. అటు మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంగనర్లో టీచర్ ఎమ్మెల్సీకి నగారా మోగింది. ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ జరగనుంది. ఎన్నికల కారణంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చింది. దీంతో ఇది ముగిసేవరకు రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ పక్రియ నిలిచిపోనుంది. గ్యాడ్యుయేట్, ఎమ్మెల్సీ ఎలక్షన్ ముగిశాకే నూతన రేషన్ కార్డుల జారీ పక్రియ మొదలవనుందని తెలుస్తోంది. అయితే కార్డుల కోసం దరఖాస్తు పక్రియ మాత్రం కొనసాగుతుందని.. ఇది నిరంతర పక్రియ అని, మీ–సేవా కేంద్రాల్లో అప్లయ్ చేసుకోవాలని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిశీలించి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని అంటున్నారు.

# సికింద్రాబాద్‌లో భారీగా గంజాయి పట్టివేత

**హైదరాబాద్,ఫిబ్రవరి15( వెలుతురు):**
సికింద్రాబాద్‌లో గంజాయి కలకలం రేపుతోంది. 15 కేజీల గంజాయిని ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీమ్ సీజ్ చేశారు. ఒరిస్సా నుండి సికింద్రాబాద్ మీదుగా ఉత్తర్‌ప్రదేశ్‌కు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో టాస్క్‌ఫోర్స్ టీమ్ మాటు వేసి పట్టుకున్నారు. ఉత్తర్?ప్రదేశ్ నుండి ఒరిస్సా వెళ్లి గంజాయి కొనుగోలు చేస్తున్నాడు కేటుగాడు. పోలీసులకు ఏమాత్రం అనుమానం రాకుండా కొనుగోలు చేసిన గంజాయితో ఒరిస్సా నుండి సికింద్రాబాద్ చేరుకుంటున్నాడు. యూపీ నుండి తన స్నేహితుడిని పిలిపించి గంజాయి అప్పగిస్తున్నాడు. తను కాకుండా తన స్నేహితుడితో గంజాయి స్మగ్లింగ్ చేయిస్తున్నాడు. ఈ గ్యాంగ్ యూపీలో గంజాయి విక్రయిస్తుంది. అయితే.. సికింద్రాబాద్‌లో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ టీమ్ ఈ గ్యాంగ్ ఆట కట్టించింది. ఔఆఖా యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. ఇదిలా ఉంటే.. ఐదురోజుల క్రితం సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్స్ పరిధిలో భారీగా గంజాయి పట్టుకున్నారు పోలీసులు. కారులో దాదాపు 10 కిలోల గంజాయిని తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడింది. గంజాయి తరలిస్తున్న ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను అరెస్ట్ చేశారు. అనంతరం పట్టుబడిన గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. నిందితులు ఇద్దరు హైదరాబాద్ లో ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుగా పని చేస్తున్నారు. ఆంధ్ర నుంచి హైదరాబాద్ కి గంజాయి అక్రమరవాణా చేసి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

# మార్చిలోపు శత్రు(ఎనిమీ) ఆస్తుల లెక్క తేల్చండి

- ఆలోపు రికార్డుల పరిశీలన, సర్వే పూర్తి చేయండి
- సెపీ అధికారులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదేశం
- తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీస్ పై కేంద్ర, రాష్ట్ర అధికారులతో కేంద్ర మంత్రి సమీక్ష
- హైదరాబాద్, రంగారెడ్డి, కొత్తగూడెం, వికారాబాద జిల్లాల్లోని శత్రు ఆస్తులపై కోరిన బండి సంజయ్
- ఆస్తుల అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం



తెలంగాణలో కస్టోడియన్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా(సెపీ) సంరక్షణలో ఉన్న శత్రు ఆస్తుల (ఎనిమీ ప్రాపర్టీ)కు సంబంధించి మార్చి నెలాఖరులోపు రికార్డుల పరిశీలన, గ్రౌండ్ సర్వే పూర్తి చేసి లెక్క తేల్చాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు.







**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 15:**
శనివారం రోజున ఉదయం హైదరాబాద్ బేగంపేటలోని హోటల్ టూరిజం ప్లాజాలో రాష్ట్రంలోని హైదరాబాద్, రంగారెడ్డి, కొత్తగూడెం, వికారాబాద్ జిల్లాల్లోని ఎనిమీ ప్రాపర్టీస్ పై కేంద్ర మంత్రి బండి సంజయ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బండి సంజయ్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఎనిమీ ప్రాపర్టీస్ పై సమీక్ష నిర్వహించడం ఇది రెండసారి. గత నవంబర్ లో నిర్వహించిన సమీక్ష పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సెపీ ముంబై విభాగ అధికారులతోపాటు రెవిన్యూ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్ఏ నవీన్ మిట్టల్, హోంశాఖ సహాయ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అంద్ర వంశీ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్, వికారాబాద్ రెవిన్యూ డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ తొలుత రంగారెడ్డి జిల్లాలోని ఎనిమీ ప్రాపర్టీస్ పై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కొత్వాల్ గూడ, మియాపూర్ పరిధిలో ఉన్న వందలాది ఎకరాల ఎనిమి ప్రాపర్టీస్ పై పురోగతి ఏమిటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి సర్వే నెంబర్ల వారీగా పురోగతిని వివరించారు. కొన్ని స్థలాలు అన్యాక్రాంతమయ్యాయని, మరికొన్ని చోట్ల రైతులు ఆక్రమించుకున్నారని తెలిపారు. ఏళ్ల తరబడి పొజిషన్ లో ఉన్న రైతులకు అన్యాయం జరగకుండా, అదే సమయంలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మార్చి నెలాఖరులోపూ సర్వే, రికార్డుల పరిశీలన పూర్తి చేసి నివేదిక అందించాలని కోరారు.

**హైదరాబాద్, కొత్తగూడెం జిల్లాల్లోని ఎనిమీ ప్రాపర్టీస్ పై జాయింట్ ఇన్ స్పెక్షన్ చేసి నివేదించండి...**

అనంతరం హైదరాబాద్ లోని బాకారంలోని 25 వేల 503 గజాల వివాదాస్పదంలో ఎనిమి ప్రాపర్టీస్ వాటా 5578 గజాలు ఉందని, ఈ స్థలంలో 20 కుటుంబాలు పొజిషన్ లో ఉంటూ నివాసాలు, వ్యాపార సముదాయాలు నిర్మించుకున్నాయని తెలిపారు. అట్లాగే బహదూర్ పురాలోని రికాబ్ గంజ్ లో 710-724, 778-784 నెంబర్లలో 3300 గజాల ఎనిమీ ప్రాపర్టీ వివాదంలో ఉందని అధికారులు తెలిపారు. డీఎస్ డియోదీ గాలిబ్ పేరిట స్థలం ఉందని, ఈ స్థలం సర్వే నెంబర్, లొకేషన్ కూడా ట్రేస్ కావడం లేదన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ కేంద్ర సెపీ అధికారులతోపాటు రాష్ట్ర రెవిన్యూ అధికారులు కలిసి జాయింట్ ఇన్స్పెక్షన్ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కొత్తగూడెంలోని పాల్వంచలోని 126/111, 126/112 సర్వే నెంబర్ లోని 40 ఎకరాల వ్యవసాయ ఎనిమీ ప్రాపర్టీని కొందరు రైతులు ఆక్రమించుకున్నారని తెలిపారు. దీనిపై కేంద్ర విభాగమైన కస్టోడియన్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా(సెపీ) అధికారులతో కలిసి జిల్లా రెవిన్యూ అధికారులు ఎంక్వేరీ చేసి సమస్యను పరిష్కరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదేశించారు.

**సెక్షన్ 8ఏ ప్రకారం ఎనిమీ ఆస్తుల వివాదాలను పరిష్కరించండి....**

వికారాబాద్ జిల్లాలోని అల్లంపల్లిలోని 426, 427, 428 సర్వే నెంబర్లలోని 17.22 ఎకరాల ఎనిమీ ప్రాపర్టీ స్ లోని వివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. శుభప్రద పటేల్ నూలి కుటుంబ సభ్యులు ఈ స్థలాన్ని ఆక్రమించుకున్నారని తెలిపారు. ఇందులో 2.18 ఎకరాలు రైల్వే లైన్ కోసం రైల్వే శాఖ తీసుకుందన్నారు. ఈ స్థల వివాదం కోసం రూల్స్ ఏం చెబుతున్నాయని బండి సంజయ్ సెపీ అధికారులను అడిగారు. సెక్షన్ 8 ఏ ప్రకారం ఎనిమీ ప్రాపర్టీ అని తెలియకుండా కొన్న వాళ్లు, వలస యజమానుల కుటుంబ సభ్యులు ఆక్రమించుకున్న స్థలాలతోపాటు, సెపీ, రాష్ట్ర ప్రభుత్వం ఏళ్ల క్రితం లీజుకిచ్చిన భూములకు సంబంధించి రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సెపీ అధికారులు తెలిపారు. తక్షణమే సెక్షన్ 8 ఏ ప్రకారం సమస్యను పరిష్కరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ అధికారులను ఆదేశించారు.

**త్వరలోనే హైదరాబాద్ లో సెపీ అనుబంధ కార్యాలయం ఏర్పాటు...**

తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్నాటక, కేరళలో సెపీ అనుబంధ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం ముంబై ఆఫీస్ నుండి ఆయా రాష్ట్రాల ఎనిమీ ఆస్తులపై పర్యవేక్షిస్తున్నారు. ఇకపై ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలోనే అనుబంధ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. అందులో భాగంగా హైదరాబాద్ లో సెపీ కార్యాలయ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

**ఎనిమీ ప్రాపర్టీస్ అంటే ఏమిటంటే....?**

1962లో చైనీస్ దండయాత్ర, 1965 నుండి 1971 వరకు నిర్వహించిన ఇండో–పాక్ యుద్ధం అనంతరం భారత్ నుండి వెళ్లిపోయి పాకిస్తాన్, చైనాలో స్థిరపడి ఆయా దేశాల పౌరసత్వం తీసుకున్న వ్యక్తులకు సంబంధించి భారత్ లో ఉన్న ఆస్తులను శత్రు(ఎనిమీ ప్రాపర్టీ) ఆస్తులుగా ప్రభుత్వం గుర్తించింది. వీటి సంరక్షణ బాధ్యతలను కస్టోడియన్ ప్రాపర్టీ ఆఫ్ ఇండియా(సెపీ)కు అప్పగించింది. తెలంగాణ, ఏపీతోపాటు దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాల్లో, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో దాదాపు 13 వేల వరకు శత్రు ఆస్తులున్నట్లు కేంద్రం వద్ద రికార్డులున్నాయి. వీటి మార్కెట్ విలువ వేల కోట్లు ఉన్నట్లు గుర్తించింది. ఎనిమీ ప్రాపర్టీ చట్టంలోని సెక్షన్ 8(ఏ) ప్రకారం ఈ ఆస్తులను విక్రియంచే అధికారం కేంద్రానికి ఉంది. అయితే నాటి నుండి నేటి వరకు ఈ ఆస్తులు చాలా చోట్ల అన్యాక్రాంతమయ్యాయి. మరికొన్ని ఆస్తులకు సంబంధించి న్యాయ వివాదాలు నడుస్తున్నాయి. ఆ ఆస్తుల వివాదాల పరిష్కారంపై కేంద్ర మంత్ర బండి సంజయ్ సమీక్ష నిర్వహించారు.

# సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి లో మంత్రి సీతక్క

## గిరిజన నాయకులు బలరాం నాయక్, ఇతర ముఖ్య నేతలు

(రాపర్తి భాస్కర్ గౌడ్)
**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 15:**
గిరిజన అభివృద్ధి కోసం పాటుపడుతున్న సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపాలని మంత్రి సీతక్క అన్నారు, సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి కార్య క్రమంలో మంత్రి పాల్గొన్ని మంత్రి సీతక్క మాట్లాడారు, సేవాలాల్ ఆశయాలైన శాంతి, సమానత్వం, అహింస స్ఫూర్తిగా ఈ ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు,బంజారా భాషకు గుర్తింపు కోసం కృషి చేసి, తండాల అభివృద్ధిని వేగవంతం చేస్తామని మంత్రి సీతక్క అన్నారు, మూలాలు పోతే అస్తిత్వం దెబ్బతింటుంది.హక్కుల గురించి మాట్లాడే అవకాశం ఉండదని ఆమె పేర్కొన్నారు,మూలాలను మరవకుండా, భవిష్యత్ తరాలకు సేవాలాల్ స్ఫూర్తిని అందించుదామని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్ ముఖ్య గిరిజన నాయకులు, భారీ సంఖ్యలో బంజారా మహిళా పాల్గొన్నారు, ఈ సందర్భంగా మంత్రి సీతక్క గిరిజన మహిళ లలతో కలిసి నృత్యం చేశారు,







# సంపాదకీయం..

## పంటల ఉత్పత్తి.. ఎగుమతులపై కార్యాచరణ కావాలి !

భారతదేశంలో వాణిజ్యపంటలకు కొదువ లేదు. మనదేశ ప్రజలకు అవసరమైన అన్ని రకాల వాణిజ్య పంటలతో పాటు, ఉప్పులు,పప్పులు పండుతాయి. నూనెగింజలు పండుతాయి. అందులో పసుపు, మిర్చి, పత్తి, ధనియాలు, అల్లం, వెల్లుల్లి, వేరుశనగ, నువ్వులు, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో పాలు రకరకాల వరిధాన్యం కూడా పండుతుంది. మన నేలలో ఈ పంటలకు అనువుగా ఉన్నాయి. నేలలకు అనువుగా మనకు నదులు, సరస్సులు ఉన్నాయి. క ష్టపడి పండించేందుకు అన్నదాతులు సిద్దంగా ఉన్నారు. లేనిదల్లా ప్రోత్సాహం ఒక్కటే. అయినా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా తిందామంటే తిండిదొరకని ఎన్నో కుటుంబాలను చూస్తున్నాం. దేశంలో పండుతున్న పంటను ప్రోత్సహించి, ప్రజలకు తిండిగింజల కొరత లేకుండా చేయడం ఒక ఎత్తు. వాణిజ్యపరంగా ఉత్పత్తి చేసేలా ప్రోత్సహించి విదేశాలకు ఎగుమతులు చేయడం మరో ఎత్తు. ఇలా ఒక్క వ్యవసాయంతోనే మన దేశ దరిద్రం తీరుతుంది. భూములు, వనరులు, మానవ వనరులు ఉన్నా ఉపయోగించే నైపుణ్యం ప్రభుత్వాలకు ఉండడం లేదు. అందుకే దేశీయంగా పంటలను ప్రోత్సహించడం లేదు. గిట్టుబాటు ధరలు కల్పించడం లేదు. దీనికితోడు అసవరమున్నా లేకున్నా అన్నీ దిగుమతి చేసుకునేం దుకు అలవాటు పడ్డాం. ఈ క్రమంలో దేశీంగా పసుపు, మిర్చి, పత్తి పంటలు విపరీతంగా పండుతున్నా ధరలు లేక రైతులు దిగాలు పడుతున్నారు. ప్రజలేమో ధరలు పెట్టి కొనలేక బాధపడుతున్నారు. ఈ వ్యత్యాసాన్ని గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. పసుపు రెండు వేల సంవత్సరాలుగా ఒక అద్భుత ఔషధంగా, సౌందర్య సాధనంగా, వంటలలో ముఖ్యమైన దినుసుగా, వస్త్రాలపై అద్దకంగా ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా హిందువులు తమ నిత్యజీవితంలో ఏ శుభకార్యమైనా పసుపుతోనే ప్రారంభిస్తారు. భారతదేశంలో పసుపు లేని ఇల్లు ఉండదని చెప్పడంలో అతిశయోక్తి లేదు. పసుపుతో పాటు మిర్చి, అల్లం వెల్లుల్లి కూడా వాణిజ్యస్థాయిలో పండించే సత్తా మన రైతులకు ఉంది. అలాంటి పసుపుకు బోర్డు కోసం రైతులు ఏళ్లుగా పోరాడాల్సి వచ్చింది. రైతు తలచుకుంటే పంట పండించడమే కాదు, పంటకి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించే బోర్డు ఎలా సాధించుకోవాలో కూడా తెలుసు. పసుపు బోర్డు సాధించి చూపించిన నిజామాబాద్ రైతులు దేశవ్యాప్తంగా ఎంతోమంది రైతులకు ఆదర్శంగా నిలిచారు. పసుపు బోర్డు కోసం 2006లో మొదలైన పోరాటం 2 దశాబ్దాలుగా అలుపెరగకుండా సాగింది. ఇకపోతే పంజాబ్, హర్యానా రైతులు కూడా పంటల గిట్టుబాటు ధరల కోసం ఏళ్లుగా పోరాడుతున్నారు. వారి వెనక రాజకీయ కోణాలు ఉన్నాయన్న విషయాన్ని పక్కన పెట్టి వారితో చర్చించి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రకటించడం లేదు. ఇకపోతే తెలంగాణలో పసుసు బోర్డు ఏర్పాటయ్యింది కనుక ఇక వారి కష్టాలు గట్టెక్కాల్సిన అవసరం ఉంది. పసుపు బోర్డును నిజామాబాద్‌లో ఏర్పాటు చేసుకోవడం ఓ రకంగా రైతుల విజయానికి నాంది అనుకోవాలి. పసుపు బోర్డు సాధనలో వారు చూపిన తెగువ ఎనలేనిది. 2019 లోకసభ ఎన్నికల్లో 178 మంది పసుపు రైతులు నిజామాబాద్ ఎంపీ గా పోటీచేయడానికి నామినేషన్ వేయడం. వీరికోసం ఏకంగా ఒక్కో బూత్‌లో 12 ఈవీఎం మిషన్లు వాడాల్సి రావండ వంటివన్నీ జాతీయస్థాయిలో సమస్యను చాటాయి. వీరు దాదాపు లక్ష ఓట్లు పొందడం ఆ ప్రాంతంలో పసుపు బోర్డు డిమాండ్ ఎంత బలంగా ఉందో అనడానికి నిదర్శనంగగా నిలిచింది. అంతే కాకుండా వారణాశిలో 30 మంది పసుపు రైతులు నామినేషన్ వేసి మోదీపై పోటీకి దిగారు. 2014 లోక్ సభ ఎన్నికల్లో కూడా దాదాపు 27 మంది రైతులు పోటీచేశారు. పొలాల్లో పంటలు పండించడమే కాదు, రాజకీయ చతురత కూడా ప్రదర్శించగలమని రైతన్నలు నిరూపించారు. అయితే రైతులు పోరాటాలుచేస్తే తప్ప సమస్యలు గుర్తించకుండా ప్రభుత్వాలు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నాయి. ఇదే తరహాలో మిర్చి బోర్టు ఏర్పాటు చేయాలన్న డిమాండ్ కూడా ఉంది. నిజానికి రైతుల ఆకాంక్షల మేరకు బోర్టులు ఏర్పాటు చేయడో లేదా...పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా ప్రోత్సహించడం, ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయడం ప్రభుత్వాల విధి. ఒక బోర్డుల ఏర్పటును పరిశీలిస్తే...కాఫీ ఉత్పత్తులు పెంచడానికి 1942లో బెంగళూరు కేంద్రంగా కాఫీ బోర్డును స్థాపించారు. రబ్బరులో శాస్త్రీయ, సాంకేతిక, ఆర్థిక పరిశోధనలు, మార్కెటింగ్‌ను ప్రోత్సహించడానికి 1947లో కేరళలోని కొట్టాయంలో రబ్బర్ బోర్డును స్థాపించారు.టీ ఉత్పత్తి, ఎగుమతులు పెంచడానికి 1954లో కోల్‌కత్తాలో టీ బోర్డును స్థాపించారు. టొబాకో ఎగుమతులు పెంచడానికి1976 లో ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరులో టొబాకో బోర్డు స్థాపించారు. కొబ్బరి ఉత్పాదకత పెరుగుదల, ఉత్పత్తుల వైవిధ్యీకరణపై దృష్టి సారించి దేశంలో కొబ్బరి ఉత్పత్తి, వినియోగం కోసం సమగ్ర అభివృద్ధి కోసం కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డును 1981లో కేరళలోని కొచ్చిన్ లో స్థాపించారు. ఇలా పంటల దిగుబడిని పెంచి, రైతులకు లాభాలు చేకూర్చడంతో పాటు, ఎగుమతుల ద్వారా ఆదాయం పెంచడం లక్ష్యంగా ఆయా బోర్డులను పెంచారు. అలాగే ఆయ పంటల ఉత్పత్తులపైనా ఇప్పుడు దృష్టి సారించాల్సి ఉంది. రైతులకు లాభం చేకూర్చేలా ఎగుమతులకు అనుకూల పరిస్థితులు సృష్టించడం, పంట నాణ్యతను మెరుగుపర్చడం, కొత్త వంగడాల అభివృద్ధి కోసం పరిశోధనలు నిర్వహించి సలహాలు అందించడం, పంట విస్తీర్ణాన్ని పెంచడం, అధిక దిగుబడుల కోసం కృషి చేయడం అవసరం. పసుపు సాగు, ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌ను ప్రోత్సహించడం,పసుపు రైతుల ఆదాయాన్ని పెంచడంతోపాటు పసుపు ఔషధ ప్రయోజనాలపై అవగాహన పెంచడం కోసం తాజాగా పసుపు బోర్డు ఏర్పాటు అయ్యింది. ఈ బోర్డు ద్వారా రైతులకు పసుపు తవ్వకం, ఆరబెట్టడం, ఉడకబెట్టడం, డ్రై చేయడం, పాలిష్ చేయడానికి అవసరమైన యంత్రాలను రాయితీపై అందించడం జరుగుతుంది. పసుపు పంట విత్తిన తరువాత అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడం, నాణ్యత, దిగుబడి పెంచేలా రైతులకు సహకారం అందిస్తుంది. ఇక పసుపు పంట మార్కెటింవిగ్ కోసం అంతర్జాతీయ కంపెనీలను తీసుకువచ్చే బాధ్యత సైతం బోర్డు తీసుకుంటుంది. పసుపు పండిస్తున్న 20 రాష్ట్రాల రైతులకు ప్రత్యేక లాభం చేకూర నున్నది. అయితే పంట ఏదైనా దేశీయంగా చవకగా లభించి, ఎగుమతుల ద్వారా రైతులకు ఆర్జన చేసి పెట్టేలా పంటల విధానాన్ని ప్రభుత్వాలు అనుసరించాలి. అప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్త బలోపేతం కావడంతో పాటు, దేశ ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడగలదు.

# పసుపు ఎగుమతుల ద్వారా విదేశీ మారకం

- ప్రపంచ పసుపు ఉత్పత్తిలో 70శాతం భారత్‌దే
- మరిన్ని ప్రోత్సాహకాలు అందిస్తే దూసుకెళ్లడం ఖాయం



**నిజామాబాద్,ఫిబ్రవరి15( వెలుతురు ):**

నిజామబాద్ కేంద్రంగా పసుపు బోర్డుల ఏర్పాటైనందున ఇక పసుపును అంతర్జాతీయంగా ఉత్పత్తి చేసి, ఎగుమతులు చేసేలా ప్రోత్సహించాల్సి ఉంది. ఇందుకు బోర్డు కార్యాచరణ కు దిగాలి. పసుపు బోర్డుకి సంబంధించిన ఈ విజయగాథ నిజామాబాద్ రైతుల పోరాట పటిమను, కృషిని, పట్టుదలని ప్రతిబింబిస్తోంది. దేశవ్యాప్తంగా ఇతర రైతులకు కూడా ఇది ఒక ఆదర్శంగా నిలిచింది. నిజామాబాద్‌తో పాటు జగిత్యాల, ఆదిలాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో కూడా పసుపు విరివిగా పండుతుంది. ఎపిలోని కొన్ని ప్రాంతాల్లో కూడా పసుపు పండుతుంది. మన పసుపు ఎక్కువగా బంగ్లాదేశ్, యూఏఈ, అమెరికా, మలేషియాకి ఎగుమతి అవుతున్నది. కాగా, వ్యవసాయ విభాగానికి అందించే సబ్సిడీలు నేరుగా రైతులకు చేరాల్సిన అవసరం ఉంది. రైతులు, వ్యవసాయ పరిశ్రమల మధ్య లాభాలను సమానంగా పంచుకోవాలి. రైతులు వ్యవసాయానికి ఖర్చుచేసే ప్రతి రూపాయి దేశ ఆర్థిక వ్యవస్థను బలపరుస్తుంది. గత సంవత్సరం, 2023-24, భారతదేశంలో 3.05 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో 10.74 లక్షల టన్నుల ఉత్పత్తితో పసుపు సాగు చేయబడింది. ప్రపంచ పసుపు ఉత్పత్తిలో 70శాతంనకు పైగా భారతదేశం పండిస్తోంది. మన దేశంలో 30 రకాల పసుపు ఉత్పత్తి అవుతోంది. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పసుపు ఉత్పత్తిదారు, వినియోగదారు, ఎగుమతిదారు. ప్రపంచ వాణిజ్యంలో భారతదేశం 62శాతం కంటే ఎక్కువ వాటాను కలిగి ఉంది. 2023-24లో, 226.5 మిలియన్ డాలర్ల విలువైన 1.62 లక్షల టన్నుల పసుపు ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. భారతదేశం నుంచి పసుపు ఎగుమతులు 2030 నాటికి బిలియన్ డాలర్లకు పెరుగుతాయని అంచనా. ఇకపోతే పసుపుబోర్డుకు ముందు స్పైసెస్ బోర్డు అన్నారు. నిజానికి దీనిని 1987 కేరళలోని కొచ్చిన్ లో 52 సుగంధ ద్రవ్యాలు, మసాలా ఉత్పత్తుల ఎగుమతిని ప్రోత్సహించడానికి, అభివృద్ధి చేయడానికి స్థాపించారు. పసుపు కూడా స్పైసెస్ బోర్డు పర్యవేక్షణలో ఉండేది. కానీ అంత ప్రాధాన్యం ఉండేది కాదు. కాబట్టి ప్రత్యేక బోర్డు సాధనకు 2019 లోక్ సభ ఎన్నికల్లో బాండ్ పేపర్ రాసి ఇచ్చిన బీజేపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ ను గెలిపించి, పసుపు రైతుల గళం ఢిల్లీలో వినిపించాలనుకున్నారు. 2020లో కేంద్రం నిజామాబాద్‌లో స్పైసెస్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం, ఎక్సటెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఈ సెంటర్ 'ట్రేడ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ ఫర్ ఎక్స్‌పోర్ట్ స్కీమ్'ని అమలుపరుస్తూ పసుపు సాగుకు మౌలిక వసతులు కల్పిస్తూ ఎగుమతులకు పెంపొందించడానికి దోహదపడింది. కానీ, పసుపు రైతులు ప్రత్యేక బోర్డు కావాలని పట్టుబట్టారు. రైతుల అలుపెరగని పోరాటాన్ని గుర్తించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలమూరు ప్రజాగర్జన సభలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఆ తర్వాత సంక్రాంతి పండుగ సందర్భంగా నిజామాబాద్ కేంద్రంగా పసుపు బోర్డు ప్రారంభోత్సవం చేశారు. ఇది ఓ విజయమైతే...రైతులు పంటలను పండించి, ఆదాయం పొందితే అంతకుమించిన విజయం ఉండదు.

# మిర్చి పంటకు దక్కని కనీస మద్దతు ధర

- మార్కెట్‌ను పంట ముంచెత్తినా కానరాని కొనుగోళ్లు
- పెట్టుబుడుల రాక అన్నదాతల ఆందోళన




**గుంటూరు,ఫిబ్రవరి15( వెలుతురు) :**


గుంటూరు సహా ఖమ్మం, వరంగల్ జిల్లాలు మిర్చిపంటకు పెట్టింది పేరు. ఇక్కడ అతర్జాతీయ నాణ్యతలకు అనుగుణంగా మిర్చి పండుతోంది. అయితే ఏటా రైతులు మిర్చి బస్తాలను వేసుకుని మార్కెట్ యార్డుల్లో పస్తులు ఉంటున్నా ధరలు దక్కడం లేదు. ఈ క్రమంలో మిర్చిబోర్డు కూడా ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం పరిశీలించాలి. ఇప్పటికే పంటలు రాక మొదలయ్యింది. వరంగల్ ఎనుమాముల, ఖమ్మంయార్డులతో పాటు, గుంటూరు మిర్చియార్డుల్లో నిల్వలు గుట్టలుగా కనిపిస్తున్నాయి. గిట్టుబాటు ధర రాక, ఇళ్లల్లో నిల్వ చేసుకునేందుకు అవకాశం లేక ఈ ఏడాది మిర్చి రైతులు అల్లాడుతున్నారు. ఎకరాకు లక్షన్నర రూపాయల నుంచి రెండు లక్షల రూపాయల వరకు పెట్టుబడి అవుతోంది. 15 క్వింటాలు కూడా దిగుబడి రావడం లేదు. గిట్టుబాటు ధర లభించకపోవడం లేదు. దీంతో, తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది ఫిబ్రవరిలో క్వింటాలుకు రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు ధర పలికింది. ప్రస్తుత ఏడాది రూ.9 వేలకు నుంచి రూ.13 వేల మించి ధర లభించడం లేదు. గత వారం రోజుల్లో క్వింటాలుకు రూ.3 వేలు తగ్గింది. అయినా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయి. వాణిజ్య పంటల్లో పొగాకు, తేయాకు, పసుపు తదితర పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటిస్తోంది. మిర్చికి మాత్రం ప్రకటించడం లేదు. దీంతో, వ్యాపారుల దాయాదక్షిణ్యాలపై రైతులు ఆధారపడాల్సి వస్తోంది. 2018 నుంచి 2023 వరకు ధరలు మెరుగ్గా ఉన్నాయి. గత ఐదేళ్లలో సగటు ధర రూ.18 వేలకు తగ్గలేదు. గరిష్టంగా రూ.27 వేల వరకూ పలికింది. గతేడాది నుంచి ధరల తగ్గుదల ప్రారంభమైంది. మిర్చి ధరలో ఎంత భారీ వ్యత్సాసం ఎందుకు వచ్చిందో ప్రభుత్వం అధ్యయనం చేయాలి. సీజన్ మొదట్లోనే ధర తగ్గితే చివరికి ఎంత పతనం అవుతుందోనని ఆందోళనగా ఉంది. నష్టాలను భరించలేము. గిట్టుబాటు ధర కల్పించాలి.గతేడాది కనీస ధర రూ.12 వేల గరిష్ట ధర రూ.20 వేల వరకు వచ్చింది. ప్రస్తుత ఏడాది కనీస ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.13 వేలు మాత్రమే వస్తోంది. తేమ శాతం, తాలు సాకులు చూపి ధరను రూ.7 వేలకు కూడా తగ్గించేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఎగుమతులు లేవని చెబుతున్న వ్యాపారులు రోజుకు లక్ష టిక్కిలు వచ్చినా కొనేస్తున్నారని, తాము పండించిన సరుకు అంతా ఎటుపోతుందోనని ప్రశ్నిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో రిటైల్ ధర కిలో రూ.200 నుంచి రూ.220 వరకు పలుకుతుండడాన్ని వారు గుర్తు చేస్తున్నారు. వారం రోజులుగా యార్డుకు సగటున రోజు 90 వేల నుంచి లక్ష టిక్కిల వరకు సరుకు వస్తోంది. ధరల తగ్గుదలపై రైతులు జిల్లాలోని ప్రజాప్రతినిధులపై రైతులు ఒత్తిడి తేగా, స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం తమ ఆర్థిక పరిస్థితి బాగా లేదని రైతులను ఆదుకోవాలని సిఎం చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల టిడిపి ఎంపిలు, ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ నాయకులు లావు శ్రీకృష్ణదేవ రాయలు ఢిల్లీలోని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహన్‌ను కలిశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాలని కేంద్రం ప్రతిపాదించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని, మొత్తం కేంద్రమే భరించాలని ఎంపిలు కోరారు. ఈ అంశంపై ఇంతవరకూ కేంద్రం నుంచి స్పందన లేదు. తక్షణం క్వింటాలుకు రూ.12 వేలు తగ్గకుండా మార్కెట్ ఇంటర్ వెన్షన్ పథకం కింద సాయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. కేంద్రం ఇంతవరకు సానుకూలంగా స్పందించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.15 వేలు ప్రకటించాలని వారు కోరుతున్నారు.

# మరోమారు వార్తల్లోకి శీష్‌మహల్

- పునరుద్ధరనలో నిధుల దుర్వినియోగం
- ఆప్ అవినీతిప విచారణకు ఆదేశాలు

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి15( వెలుతురు ):**

ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజీవ్రాల్‌ను కష్టాలు వెంటాడు తున్నాయి. ఇప్పటికే ఢిల్లీలో అధికారం కోల్పోయి.. నిరాశలో ఉన్న కేజీవ్రాల్‌కు కేంద్రం షాకిచ్చింది. 'శీష్ మహల్' అక్రమాలపై దర్యాప్తునకు కేంద్రం ఆదేశించింది. బంగ్లా పునరుద్ధరణ పనుల్లో అక్రమాలు జరిగాయాంటూ బీజేపీ ఎమ్మెల్యే విజేంద్ర గుప్తా లెఫ్టినెంట్ గవర్నర్ వీకే.సక్సేనాకు ఫిర్యాదు చేశారు. ఎల్జీ ఆదేశాలతో ఫిబ్రవరి 13న కేంద్ర ప్రజా పనుల శాఖ నివేదిక సమర్పించింది. తాజాగా పునరుద్ధరణలో జరిగిన అవకతవకలపై దర్యాప్తు చేయాలంటూ కేంద్రం ఆదేశించింది. ప్రభుత్వ ఖజానాను విలాసవంతమైన వస్తువులకు ఖర్చు చేశారని బీజేపీ ఆరోపించింది. ఈ నేపథ్యంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ దర్యాప్తుకు ఆదేశించింది. దాదాపు 8 ఎకరాల విస్తీర్ణంలో 6 ఫ్లాగ్‌స్టాఫ్ బంగ్లాను పునరుద్ధరణకు ఆప్ ప్రభుత్వం భవన నిబంధనలను ఉల్లంఘించిందనే ఆరోపణలపై విచారించి సమగ్ర నివేదిక తయారుచేయాలని కేంద్రం సీపీడబ్ల్యూడీని ఆదేశించింది. అధికారిక నివాసానికి పొరుగునున్న నాలుగు ప్రభుత్వ ఆస్తులను చట్టవిరుద్ధంగా విలీనం చేసి విలాసవంతమైన శీష్‌మహల్ ను విస్తరించారని దిల్లీ భాజపా అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా ఆరోపించారు. ఆ ఆస్తుల విలీనాన్ని రద్దు చేయాలని కోరుతూ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు లేఖ రాశారు. దేశ రాజధానిలో భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాక నూతన ముఖ్యమంత్రి శీష్‌మహల్‌లో ఉండబోరని పేర్కొన్నారు. దిల్లీలోని 6 ఫ్లాగ్ స్టాఫ్ రోడ్‌లో ఉన్న ప్రభుత్వ బంగ్లాను అరవింద్ కేజీవ్రాల్ సీఎంగా ఉన్న సమయంలో అధికారిక నివాసంగా వినియోగించారు. ఈ బంగ్లాను 'శీష్ మహల్ గా భాజపా అభివర్ణిస్తోంది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఆయన 7-స్టార్ రిసార్ట్‌గా మార్చుకున్నారని విమర్శించింది. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఆప్ మోసాలకు ఆ మహల్ ఓ ఉదాహరణ అంటూ భాజపా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది. నాలుగు కోట్ల మందికి ఇళ్లు కట్టించామని, కానీ.. తానేమీ అద్దాల మేడ కట్టుకోలేదని ప్రధాని మోదీ దుయ్యబట్టిన సంగతి తెలిసిందే. ఆప్ ప్రభుత్వంపై వచ్చిన ఈ అవినీతి ఆరోపణలు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని దెబ్బతీశాయి. భాజపాకు విజయాన్ని కట్టబెట్టాయి. అందుకే విమర్శలకు తావులేకుండా ఆ బంగ్లాకు దూరంగా ఉండాలని భాజపా యోచిస్తున్నట్లు సమాచారం. ఈ బంగ్లాలో 2015 నుంచి 2024 వరకు కేజ్రీవాల్ నివాసం ఉన్నారు. ఆ సమయంలో బంగ్లా పునర్ నిర్మాణ పనుల్లో ప్రభుత్వ ఖజానాను వృథా చేశారని బీజేపీ ఆరోపించింది. మొత్తానికి ఆప్ అధికారాన్ని కూడా కోల్పోయింది. ఇక 27 ఏళ్ల తర్వాత బీజేపీ అధికారాన్ని చేజిక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఆప్ హయాంలో జరిగిన అవకతవకలపై కేంద్రం దృష్టి సారించింది. ఢిల్లీలో మొత్తం 70 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. బీజేపీ 48, ఆప్ 22 స్థానాలు గెలుచుకుంది. ఇక ముఖ్యమంత్రి పేరును ఇంకా ప్రకటించలేదు. ఇందుకోసం అధిష్టానం తీవ్ర కసరత్తు చేస్తోంది. మహిళలకు ఛాన్స్ ఉండొచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇంకోవైపు కేజీవ్రాల్‌ను ఓడించిన పర్వేష్ వర్మకు ముఖ్యమంత్రిగా అవకాశం ఉండే ఛాన్సుందని వార్తలు వినిపిస్తున్నాయి.



## కూకట్ పల్లి నియోజకవర్గం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ నూతన కార్యవర్గం నియామకం...



**కూకట్ పల్లి ఫిబ్రవరి 15 వెలుతురు:**
తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(143) కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాన్ని మారుతి సాగర్ లు ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా నిమ్మల శ్రీనివాస్ ,ప్రధాన కార్యదర్శిగా కోహీర్ నాగరాజు యాదవ్, కోశాధికారిగా సదా మహేష్ లను నియమిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. నియామక ఉత్తర్వులను రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.మారుతి సాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్కే దయాసాగర్ లు త్వరలో మిగతా పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. జర్నలిస్టు సంక్షేమ కోసం గత పది సంవత్సరాలుగా టీయూడబ్ల్యూజే 143 ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వివరించారు. కూకట్ పల్లిలో అర్హులైన జర్నలిస్టులందరికీ సంక్షేమ కార్యక్రమాలు అందేలా, వారి సమస్యల పరిష్కారానికి మన యూనియన్ తరపున కృషి చేయాలని కోరారు.

## బోర్ వెల్ పనులను పరిశీలించిన కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు



**కూకట్ పల్లి ఫిబ్రవరి 15 వెలుతురు:**
శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లో గల పటేల్ కుంట పార్క్ లో జరిగే అభివృద్ధి పనులలో భాగంగా పార్క్ లో నీటి వసతులు సంబంధించి బోర్ వేస్తున్న పనులను సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ సభ్యులుతో కలిసి డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వీలైనంత త్వరలో పనులను పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, చెన్నారావు ,రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మైత్రి సివిల్ కన్స్ట్రక్షన్ లిజనింగ్ వర్క్స్ ఆఫీసును ప్రారంభించిన అరికెపూడి గాంధీ..



**కూకట్ పల్లి ఫిబ్రవరి 15 వెలుతురు:**
ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ లో దాసరి రాహుల్ ప్రదీప్, బుల్లెట్ రవి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మైత్రి కన్స్ట్రక్షన్స్ లిజనింగ్ వర్క్స్ ఆఫీస్ ను శనివారం స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. వారిరువురిని మైత్రి కన్స్ట్రక్షన్ యాజమాన్యం శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులుగా సమాజ శ్రేయస్సు కై పనిచేస్తూ మరొక అడుగు ముందుకు వేస్తూ కన్స్ట్రక్షన్స్ లిజనింగ్ వర్క్స్ ఆఫీసును ప్రారంభించి, సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో కన్స్ట్రక్షన్స్ లోన్లు ఇప్పించి మరింత ముందుకు సాగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఎల్లమ్మబండ ప్రాంతాన్ని ఎంచుకొని ఇలాంటి ఆఫీసు ఓపెన్ చేయడం సంతోషకరమని, ఆఫీస్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శ్రేయోభిలాషి తెల్ల హరికృష్ణ ఆల్విన్ కాలనీ డివిజన్ కి సంబంధించిన వివిధ రాజకీయ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, బస్తీ వాసులు, మహిళా నాయకురాలు, మిత్రులు శ్రేయోభిలాషులు, జర్నలిస్టు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్లా పూర్ లో కవితకు ఘన స్వాగతం పలికిన పూజారి

**వెలుతురు, అబ్దుల్లా పూర్ మెట్, ఫిబ్రవరి 15:**




జాగృతి సంస్థ జాతీయ అధ్యక్షురాలు శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత కు రంగారెడ్డి జిల్లా అబ్దుల్లా పూర్ మెట్ మండల కేంద్రంలో ఘన స్వాగతం పలికిన మండల బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు పూజారి చక్రవర్తి గౌడ్ తో సహా పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు, ఎంఎల్ సి కవిత ఖమ్మం పర్యటన లో పాల్గొనేందుకు వెళుతున్న సందర్భంగా ఆమె కు అబ్దుల్లాపూర్ మెట్ మండల పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు కలిసి కవితకు ఘన స్వాగతం పలికి ఆమెకు జ్ఞాపికను అందజేశారు, అనంతరం కవిత ఖమ్మం జిల్లా పర్యటన కు బయలుదేరి వెళ్లారు,

# బంజారా జాతికి ఆధ్యాత్మిక మార్గదర్శి శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్...

## టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం...



**కూకట్ పల్లి ఫిబ్రవరి 15 వెలుతురు:**
బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింస సిద్ధాంతానికి పునాదులు వేసిన ఆదర్శమూర్తి శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ అని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి సందర్భంగా రాఘవేంద్ర నగర్ లో సేవాలాల్ జయంతి ఉత్సవంలో శంకర్ నాయక్ ఆహ్వానం మేరకు టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, మూసాపేట్ డివిజన్ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ లు జయంతి వేడుకలలో పాల్గొని సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ప్రతి బంజారాలు జగదాంబ మాతను ఎలాంటి ప్రతిఫలమూ ఆశించకుండా పూజించాలనీ, మత్తు, దూమపానాలు శాపాలు వంటివని అయన బోధించారన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ ప్రజల కోసం చేసిన ఉద్యమాలలో ధర్మ ప్రచారం, ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడులను అరికట్టడం వంటివి చేసారని, సన్మార్గంలో తన జాతిని నడిపించి భారత్ లోని దాదాపు 11 కోట్ల మంది బంజారాలకు ఆరాధ్య దైవంగా నిలిచారన్నారు. సంచార జాతివారైన వీరు రజాకార్లతో పోరాడారని, నవాబులు వారి ధైర్య సాహసాలకు మెచ్చి భూములను ఇనాములుగా ఇచ్చారని చరిత్ర చెబుతుందన్నారు. సమాజం అభివృద్ధి చెందాలంటే కష్టపడి పనిచేయాలని, లక్ష్య సాధనకు నిరంతరం ప్రయత్నించాలని సందేశం ఇచ్చారన్నారు. సహాయ గుణం విరివిగా కలవారని, ధైర్యసాహసాలకు ప్రతీక అని, సేవాలాల్ మహారాజ్ ప్రవచనాలు కేవలం బంజారా సమాజానికే కాకుండా, సమాజంలోని ప్రతి ఒక్కరికి మార్గదర్శకంగా నిలిచాయి అన్నారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజపుత్, కైలా, అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆదర్శప్రాయుడు..

- సేవాలాల్ మహారాజును స్ఫూర్తిగా తీసుకొని బంజారాలను ముందుకు సాగాలి..
- బంజారాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది
- కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి




**కూకట్ పల్లి ఫిబ్రవరి 15 వెలుతురు:**
శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ ఆదర్శప్రాయుడని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతిని పురస్కరించుకొని శనివారం కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలోని రమ్య గ్రౌండ్స్ లో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శేరి సతీష్ రెడ్డి హాజరై శ్రీ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దైవం హిందూధర్మం గొప్పతనం బంజారాలకు తెలియజేయడానికి జన్మించిన మహానుభావునిగా భావిస్తారని, సేవాలాల్ మహరాజ్ జయంతి పురస్కరించుకుని ఫిబ్రవరి 15న సెలవు దినంగా తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 2024లో ప్రకటించిందని గుర్తు చేశారు. సమస్త జీవకోటికి మాతృరూపం (తల్లిగా) వెలిసిన అమ్మభవాని గురించి అమ్మను పూజించాలని, కాని ఫలితం ఆశించవద్దని బంజారా లకు బోధించారని, సంత్ సేవాలాల్ మహరాజ్, హింస పాపమని, మత్తు, ధూమ పానం శాపం అని హితవు పలికి బంజారా జాతికే కాదు యావత్తు ఇతర కులాలకు ఆదర్శ మూర్తిగా నిలిచారన్నారు. సేవాలాల్ మహరాజ్ ఆనాడు బంజారా జాతి పరువు ప్రతిష్టల గురించి ముందుగానే ఊహించి అహింస సిద్ధాంతానికి పునాది వేసి ఆచరించి చూపారు. ఆ తరుణంలో బంజారాలు ఆనాడు రాజుల కాలం నుంచి బ్రిటిష్ కాలం వరకు ఆయా రాజ్యాలకు అవసరమైన యుద్ధ సామాగ్రిని చేరవేస్తూ సంచార జీవనం సాగిస్తూ ఉండేవారని ఆ క్రమంలో బ్రిటిష్, ముస్లీం పాలకుల మత ప్రచారం ద్వారా బంజారా సమాజం అనేక ఇబ్బందులకు గురి అయ్యిందన్నారు. ఈ పరిస్థితులలో బంజారా జాతిని సన్మార్గంలో నడిపించేందుకు సేవాలాల్ మహారాజ్ అవతరించారు. సేవాలాల్ మహరాజ్ బోధనల ద్వారా బంజారా జాతి పురోగమిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బి సంజీవరావు, మేకల మైకల్, రేష్మ, ఏం సి మెంబర్ పనింద్ర, గిరిజన సంఘ నాయకులు రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్ నాయక్, ధర్మ నాయక్, జిల్లా నాయకులు చిరంజీవి, శివ నాయక్, భాష, శివ, శ్రీను, రాజు ముదిరాజ్, శ్రీధర్ చారి, రామకృష్ణారెడ్డి, నితిన్ గౌడ్, నజీర్ బాయ్, అక్బర్ బాయ్, గిరి నాయుడు, గిరిజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్లా పూర్ మెట్ లో ఘనంగా జరిగిన ధర్మభిక్షం జయంతి



**వెలుతురు, అబ్దుల్లా పూర్ మెట్, ఫిబ్రవరి 15:**
రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్ మండల కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల యోధుడు, మాజీ ఎంపీ ధర్మ బిక్షం 103 జయంతి ని శనివారం నాడు సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు , ఈ సందర్భంగా ధర్మ భిక్షం విగ్రహానికి పూలమాల వేసి జోహార్లు అర్పించిన సిపిఐ పార్టీ జాతీయ నాయకులు మాజీ ఎమ్మెల్యే పల్ల వెంకట్ రెడ్డి అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసిన వ్యక్తి ధర్మ భిక్షం అన్నారు, నల్గొండ ఎంపీ ఆయన జిల్లాలోని ఫ్లోరిన్ నిర్మూలనకు కృషి చేశారని, తాడిత పీడిత ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు, ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి , ముత్యాల యాది రెడ్డి, హరి సింగ్,ఏఐటీయూసీ సీనియర్ నాయకులు ఊజ్జిని రత్నాకర్,సిపిఐ అను బంధ ఏఐటియుసి నాయకులు, మహిళా సమైక్య నాయకురాలు , పార్టీ మండల నాయకులు , కార్యకర్తలు ,తదితరులు పాల్గొన్నారు,

## నూతన దంపతులను ఆశీర్వదించిన జాజుల



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 15:**
సాక్షి ఎడిటోరియల్ ఎడిటర్ వర్దెల్లి చంద్రకళ,మురళి గార్ల కుమారుడు వైష్ణవి,నితీష్ ల వివాహం తుర్క యాంజాల్ లోని పరిణయ కన్వెన్షన్ లో జరిగిన వివాహ వేడుకల్లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శీనన్న కన్వీనర్ బాలగోని బాలరాజ్ గీత వృత్తిదారుల సంఘం కన్వీనర్ ఐలి వెంకన్న గౌడ్ తో కలిసి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు.


## కామ్రేడ్ ధర్మబిక్షం బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలు మరువలేనివి.

- జాజుల లింగంగౌడ్



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 15:**
తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, స్వాతంత్ర్య సమర యోధుడు కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం 103వ జయంతి సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పూలమాలలతో ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపిగా, ఆయన సమాజానికి చేసిన సేవలు వెలకట్టలేనివని విద్యార్థి దశ నుంచే రాజకీయాలలో పాల్గొని విద్యార్థులందరిని ఏకం చేసి నిజాం నవాబు జన్మదిన వేడుకలు బహిష్కరించి అందరి దృష్టిని ఆకర్షించారని అన్నారు.కమ్యూనిస్టు నాయకునిగా సబ్బండ వర్గాలు, పీడిత ప్రజల హక్కుల కోసం ఆయన ఎన్నో పోరాటాలు,త్యాగాలు చేశారని అన్నారు. తన జీవితాంతం బడుగు బలహీన వర్గాల కోసం నిలిచి విలువలు కలిగిన నాయకుడుగా ధర్మభిక్షం అందించిన స్ఫూర్తి నేటి తరాలకూ అనుసరణీయమని జాజుల అన్నారు.ఈ ఈ కార్యక్రమంలో కల్లుగీత వృత్తిదారుల కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్,బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్, రావులకొలు నరేష్, పానుగంటి విజయ్, బొంగు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వీలైనంత త్వరగ పనులు పూర్తి చెయ్యాలి



**హైదరాబాద్ వెలుతురు ఫిబ్రవరి 15:**
శనివారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ లోని బాగ్గిఖానా లో నడుస్తున్న శివరాజ్ మరియు వాటర్ వర్క్స్ సంబంధించినా ఇన్స్పెక్షన్‌ని హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఇన్స్పెక్షన్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు కాంట్రాక్టర్లకు ఎంత త్వరగా అయితే అంత తొందరగా ఈ పనిని పూర్తి చేసి చేయాలని ఆదేశించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్ అశోక్, ప్రభాకర్, జయరాజ్ నదీమ్ అలీ మరియు బస్తివాసులు పాల్గొన్నారు

# తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు కల్వకుంట్ల కవితకు టిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం

## ఘనంగా స్వాగతం పలికిన రామన్నపేట మండల టిఆర్ఎస్ నాయకులు





**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 15**
మండలంలోని టిఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ శాసన సభ్యులు చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో చిట్యాల పట్టణ కేంద్రంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు కల్వకుంట్ల కవిత ఖమ్మం పర్యటనకు వెళ్తుండగా, కనకదుర్గ గుడి వద్ద ఆపి శాలువతో, సత్కరించి పుష్పగుంచం అందించి, స్వాగతం తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం. మాజీ ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి బలరాం. మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లు బందెల రాములు. కంభంపాటి శ్రీనివాస్. మాజీ ఎంపీటీసీలు సాల్వేర్ అశోక్. వేమవరం సుధీర్ బాబు. గోరిగే నరసింహ, పున్న వెంకటేశం, మాజీ సర్పంచ్ కోళ్ల స్వామి. జిల్లా నాయకులు బద్దుల రమేష్. ఎస్కె చాంద నాయకులు కునూరు ముత్తయ్య, జాడ సంతోష్, మిర్యాల మల్లేశం, దాసరి శ్రవణ్ రెడ్డి, బొడ్డు అల్లయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు బండ శ్రీనివాస్ రెడ్డి. గర్దాస్ విక్రమ్, జెట్టి సైదులు, బుర్ర శ్రీశైలం, గుండు రమేష్, నక్క నరేందర్, వంగాల యాదయ్య, ఎడ్ల రామచంద్రారెడ్డి, కన్నెబోయిన వెంకటేష్ బొడ్డుపల్లి రాజు గర్దాస్ కరుణాకర్ మేడి రాజు, వంగాల సంపత్, స్వామి బాబు, గట్టు శేఖర్, గుండాల మల్లేశం, కుక్క సాయి, నరసింహ తదితరులు పాల్గొనడం జరిగింది.

# గీతపనివారల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మగాని ధర్మబిక్షం 103 జయంతి వేడుకలు



**బొమ్మగాని ధర్మ బిక్షం గౌడ్ సిపిఐ మాజీ నల్గొండ ఎంపి**

**సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు**

**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 15**
పట్టణ కేంద్రంలోని గౌడ సంఘం వద్ద సిపిఐ పార్టీ మాజీ యంపీ, గౌడజాతి ఆణిముత్యం ,గీతపనివారల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మగాని ధర్మబిక్షం 103వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నర్సింహ్మా, గీత పని వారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్ లు హాజరై ధర్మబిక్షం ఫోటోకు పూల మాల వేసి మాట్లాడుతూ, ధర్మ బిక్షం సిపిఐ పార్టీలో పనిచేస్తూనే గౌడులు పడుతున్న భాధలు చూసి, వారికి వృత్తి పరంగా జరుగుతున్న అన్యాయాన్ని ,తాటిచెట్లు ఎక్కుతున్నా కూడా గౌడన్నల బ్రతుకులు మారడం లేదని, వృత్తి పన్నుకే సగం కంటె ఎక్కువ డబ్బులు కట్ట వలసి వస్తోందని గుర్తించి, గీతపనివారల సంఘాన్ని ఏర్పాటు చేసి గీత పనివారలందరినీ ఏకం చేసి గీతపనివారల హక్కులు ఏమి ఉండాలో గుర్తించారు. గీత పనివారలు 16ఏండ్ల నుండే తాటి చెట్లు ఎక్కుతూ కండరాలు, ఎముకలు పటుత్వాన్ని కోల్పోయి 40-50 ఏండ్లకే ఎటు చేతగాని వారు అవుతారని, గుర్తించి 50ఏండ్లకే ఫించను ఇవ్వాలనే డిమాండును వ్యక్తం చేసి సాధించారు. అదేవిధంగా గీతపనివారలు తాటిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు వికలాంగులైనా, చనిపోయినా కూడా అతనిపై ఆధారపడ్డ భార్యాపిల్లలు ఏ ఆసరా లేకుండా ఉంటారనే ఉద్దేశ్యంతో ఎక్స్ గ్రేసియో ను కూడా అప్పటి ప్రభుత్వాలతో కొట్లాడి, వివరించి సాధించారు. భవిష్యత్తులో భూముల విలువలు పెరిగి భూమి యజమానులు తాటిచెట్లు ఎక్కనిస్తరో, ఎక్కనియ్యరో అనే ఉద్దేశ్యంతో 560 జీవో ను సాధించి ప్రతీ సొసైటీకి 5 ఎకరాల భూమిని తాటిచెట్ల వనం పెంపకానికి ఇవ్వాలని ఆనాడే భవిష్యత్తు అవసరాన్ని గుర్తించిన మహా మేధావి ధర్మబిక్షం గారని తెలియజేసారు. ఆనాడు ధర్మబిక్షం నిజాయితీతో , చిత్తశుద్ధితో, ముందుచూపుతో ప్రజల కోసం, గీతపనివారల కోసం సాధించిన విజయాలే గానీ, ఇంత వరకు ఏ ఇతర సంఘం గానీ, గౌడ సంఘం అని చెప్పుకుంటున్న ఏ సంఘం కానీ సాధించిధేమి లేదని అన్నారు.బిక్షం స్ఫూర్తితో భవిష్యత్తులో గీతపనివారలకు, గౌడ యువకులకు కావలసిన వాటా కోసం ఉద్యమాల ద్వారా సాధించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. నివాళులు అర్పించినవారిలో గీతపనివారల సీనీయర్ నాయకులు బాలగోని మల్లయ్య, గీతపనివారల మండల అధ్యక్షులు గంగాపురం వెంకటయ్య, వీరమళ్ళ వెంకటయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, చెరుకు శివరాజ్,పల్లె మల్లేషం, రచ్చ యాదగిరి, కళ్లెం యాదగిరి తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీల గెలుపు రాజకీయాలకు మలుపు

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో పూల రవీందర్ కి బీసీల మద్దతు**

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి.**



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు ఫిబ్రవరి 15:**
ప్రస్తుతం జరిగే నల్గొండ ఖమ్మం వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి అయిన పూల రవీందర్ కి బీసీ ఉపాధ్యాయ ఉద్యోగ అంతా మద్దతు పలికి ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సంస్థాన్ నారాయణపూర్ లోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంఘాల నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నికలను వ్యాపారంగా మయంగా మార్చి బీసీ,ఎస్సీ,ఎస్టీలను మైనార్టీలను అన్ని ఎన్నికల్లో అగ్రకుల నేతలే గెలుస్తున్నారని ఓట్లు బీసీలవి 5 శాతం లేని అగ్రకులాల ఎలా గెలుస్తాయని ఈ ఎన్నికల్లో బీసీల ఐక్యతను చాటిచెప్పుతూ అగ్రకుల ఆధిపత్య రాజకీయాలకు తేలదించాలని బీసీలకు ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీలో 43 మంది రెడ్డి ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ ఎన్నికల్లో మరొక రెడ్డిని గెలిపించి 44 మందిని చేయడం సరికాదు. 60 శాతం ఉన్న బీసీలు కేవలం 19 మంది మాత్రమే ఉండాలని బీసీలను గెలిపించి చట్టసభల్లో బీసీల వానిని వినిపించేలా బీసీ సమాజం ఆలోచించాలని ఆయన అన్నారు.ఉపాధ్యాయ సంఘాలు మొత్తం అగ్రకుల అభ్యర్థులను ఈ ఎన్నికల్లో నిలబడ్డారని బిసి తరపున ఒకే ఒక్క అభ్యర్థి పూల రవీందర్ ఎన్నికల బరిలో నిలిచారు. పూల రవీందర్ గెలిపించడం ద్వారా బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని కోరారు.ఎమ్మెల్సీ ఎన్నికలు వ్యక్తుల మధ్య జరగడంలేదని బడుగుల ఆత్మగౌరవానికి అధిపతి కులాల రాజకీయ అధికారానికి మధ్యన జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో బీసీ అభ్యర్థిని గెలిపిస్తే వచ్చే 2028 రాష్ట్ర రాజకీయాల చిత్రపటమే మారుతుంది. బిసి అభ్యర్థి పూల రవీందర్ గెలవడం ద్వారా తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు రాజకీయ అధికారం సిద్ధిస్తుందని భవిష్యత్తులో బీసీ నేత ముఖ్యమంత్రి అవుతాడు అని తెలిపారు.త్వరలోనే నల్గొండ ఖమ్మం వరంగల్ ఉమ్మడి జిల్లా పర్యటించి బీసీ అభ్యర్థికి గెలుపు కోసం కృషి చేస్తానని ఆయన ప్రకటించారు.ఈ కార్యక్రమంలో బిసి యువజన సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు వీరమల్ల కార్తీక్ , బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి విజయ్ , బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు వెంకటేష్ గౌడ్, నీళ్ల లింగస్వామి, బీసీ యువజన సంఘం నారాయణపూర్ మండల ఉపాధ్యక్షులు కొల్లూరు నవీన్, జాజుల భాస్కర్, యాదగిరి, ప్రవీణ్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఏడీఈ సతీశ్‌రెడ్డి ఆదాయం వందకోట్లపైనే

**హైదరాబాద్,ఫిబ్రవరి15( వెలుతురు ):**
హైదరాబాద్ గచ్చిబౌలిలో విద్యుత్ శాఖ ఏడీఈ సతీశ్‌రెడ్డి ఆదాయం వందకోట్లుగా ఉంటుందని అంచనా వేశారు. రూ.50వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. దీంతో ఆయన నివాసంతోపాటు వివిధ ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో 22



ఎకరాల వ్యవసాయ భూమి, ఓపెన్ ప్లాట్లు, విల్లా, భవనాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ స్థిరాస్తుల మార్కెట్ విలువ రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏడీఈ నివాసంలో స్థిరాస్తి పత్రాలు, బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. సోదాల అనంతరం సతీశ్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించారు. కస్టడీకి తీసుకొని విచారిస్తే మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశముందని భావిస్తున్నారు.

# ఉర్సు ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ చేసిన లింగస్వామి



**వెలుతురు,సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి 15:**
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని రాచకొండలో ఈనెల 24వ తేదీ నుంచి జరగనున్న రాచకొండ ఉర్సు ఉత్సాహాలు కర పత్రాల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు, ఈ ఉర్సు కార్యక్రమం రాచకొండ గుట్టల్లో ఘనం గా ప్రారంభం కానున్నాయి,ఈ ఉర్స్ ఉత్సవాల గంధం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నారాయణపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఉప్పల లింగస్వామి పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఉర్సు ఉత్సవ కమిటీ నాయకులు ఫయాజ్, సోహెల్, ఇమ్రాన్, మైనార్టీ నాయకులు రహీం షరీఫ్, ఇలియాస్ లు లింగస్వామి ని సన్మానించారు,ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మందుగుల బాలకృష్ణ, పిఎసిఎస్ డైరెక్టర్ ఉప్పల కృష్ణ, చిలువేరు అంజయ్య, జక్కలి యాదయ్య యాదవ్, సురుకంటి జనార్దన్ రెడ్డి, రాచకొండ రమేష్ బాబు, చిలుకూరు శ్రీనివాస్, బద్దుల యాదగిరి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పక్షం రిపోర్టర్ ఎండీ గౌస్ గుండెపోటుతో మృతి.

- నివాళులర్పించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**రామన్నపేట వెలుతురు న్యూస్ ఫిబ్రవరి 15**
మండల ప్రజాపక్షం రిపోర్టర్ ఎండి గౌస్ గుండెపోటుతో మరణించగా వారి మృతదేహం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా ఆదుకుంటామని, హామీ ఇచ్చిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవ జాతర వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**సంస్థాన్ నారాయణపురం మండలం వెలుతురు ఫిబ్రవరి 15:**
సంస్థాన్ నారాయణపురంలో మండల కేంద్రంలోని కుమ్మరి ( శాలివాహన) వీధి శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం మహా శివ రాత్రి సందర్భంగా ఉత్సవాలు జరుగును. ఈ నెల 24 నుండి 27 వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల జాతర వాల్ పోస్టర్లు మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఆవిష్కరించారు.పోస్టర్ల ప్రచురణకర్త రాపర్తి సురేష్ గౌడ్,గ్రామ మాజీ సర్పంచ్ శికిలమెట్ల శ్రీహరి,మాజీ ఎంపిటిసి కవిత విద్యాసాగర్,దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి చిలువేరు సాయిబాబా,కమిటీ సభ్యులు,గ్రామ ప్రజలు,కుల పెద్దలు బొడ్డుపల్లి గాలయ్య, చిలువేరు ముత్యాలు, చిలువేరు శంకర్, చిలువేరు శ్రీనివాస్ ,తెలంగాణ భిక్షం,రాచకొండ గిరి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నల్గొండ రైల్వే స్టేషల్ జిల్లా హెడ్ కోటర్ లో రైల్వే ఎంప్లాయిస్ కు హెల్త్ యూనిట్ ఏర్పాటు చేయాలని వినతి



**నల్లగొండ వెలుతురు ఫిబ్రవరి 15:**
కేంద్రం మంత్రి కిషన్ రెడ్డి నల్గొండ కి విచ్చేసిన సందర్బంగా జిల్లా భారతీయ మజ్జూర్ సంఘ్ ( బీ ఎం యస్) అధ్యక్షుడు కురిమిళ్ల యాదగిరి కలిసి కార్మికుల సమస్యలను శనివారం విన్నవించారు. నల్గొండ రైల్వే స్టేషల్ జిల్లా హెడ్ కోటర్ లో రైల్వే ఎంప్లాయిస్ కు హెల్త్ యూనిట్ ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య కార్మిక్ సంఘ్ కలిసి వినతి ఇచ్చారు. విష్ణు పురం టూ పగిడిపల్లి గుంటూరు డివిజన్ లో నుండి సికింద్రాబాద్ డివిజన్ లో కలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బీఎం యస్ మెడికల్ రేపరిజెంటేటివ్ అండ్ సేల్స్ అసోసియేషన్ క్యాలెండర్ ను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఎంఎస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాజీవ్, రైల్వే ఎంప్లాయిస్ దక్షణ మధ్య రైల్వే కార్మిక్ నల్గొండ బ్రాంచ్ అధ్యక్షుడు కంకణాల మోహన్ రెడ్డి, ఆర్గనైజషన్ సెక్రటరీ వెంకటేష్, ట్రెజరర్ శివ శంకర్, స్పోర్ట్స్ ఇంచార్జ్ విరస్వామి, ఐటీ సెల్ ఇంచార్జి వెంకన్న, శ్రీనివాస్, బీఎం ఎస్ మెడికల్ రిప్రాజెంటేటివ్ అండ్ సేల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగదీష్, సెక్రెటరీ వెంకట్, పోస్టల్ బీ ఎం యస్ ఎంప్లాయిస్ పాల్గొన్నారు

# సైన్స్ ఫెయిర్ వల్ల సృజనాత్మక ఆలోచన శక్తి పెరుగుతుంది

- పాఠశాల కరస్పాండెంట్ నరేష్ కుమార్ చారి



**వెలుతురు నారాయణఖేడ్ ఫిబ్రవరి 15 :**
నారాయణఖేడ్ సైన్స్ ఫెయిర్ వల్ల సృజనాత్మక ఆలోచన శక్తి పెరుగుతుంది అని విద్యార్థులకు కొత్త కొత్త ఆలోచనలు పుట్టుకోస్తాయని నెక్సస్ పాఠశాల కరస్పాండెంట్ నరేష్ కుమార్ చారి బి కిషన్ అన్నారు. శనివారం పట్టణంలోని నెక్సస్ టెక్నో స్కూల్ లో సైన్స్ ఫెయిర్ విద్యార్థులకు కలిసి నిర్వహించారు. విద్యార్థులకు తల్లిదండ్రులు మరియు ఇతరులు సైన్స్ ఫెయిర్ లో విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల సైన్స్ పరికరాలు చూసి ఆనందించీ అభినందించారు. అనంతరం కళాశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ సైన్స్ అనేది విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రపు ప్రయోగాలు, పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలు ప్రదర్శించే ఒక మంచి వేదిక. ఇది విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనాత్మక ఆలోచన విధానం, సమస్యల పరిష్కార నైపుణ్యాలు పెంపొందించేందుకు సహాయపడుతుంది. ముఖ్యంగా విద్యార్థులకు సైన్స్ ఫెయిర్ వల్ల ఉపయోగాలు, సృజనాత్మక ఆలోచన శక్తి పెరుగుతుంది.

**విజ్ఞాన శాస్త్రంపై ఆసక్తి పెరుగుతుంది..**

క్రిటికల్ థింకింగ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ పెరుగుతాయి ప్రతిభను ప్రపంచానికి చాటుకునే అవకాశం లభిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మల్కాపూర్ లో ప్రారంభమైన శివ పంచాయతనం శ్రీ దుర్గా మల్లేశ్వర విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం



**వెలుతురు మాల్కాపూర్, తూప్రాన్, ఫిబ్రవరి, 15:**
తూప్రాన్ మండలం మల్కాపూర్ లో నూతనంగా అమిరిశెట్టి సతీష్ కుమార్, వీణ లు నిర్మించిన శివ పంచాయతనం, శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు శనివారం ఉదయం 8 గంటలకు శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురువంధనం, వేధస్వస్తి, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య, ప్రాషణ, ఋత్విగ్వరణం, యాగశాల ప్రవేశం, ఆఖండదీప స్థాపన, వాస్తు పూజ, నవగ్రహ సహిత సర్వతిభద్ర మండపారాధన, ప్రధాన కలశ స్థాపన , సాయంత్రం 5 గంటలకు అంకురార్పణ, అగ్ని ప్రతిష్టాపన, మూల మంత్ర జపములు, జలాదివాసం, ప్రదోష కాల పూజలు, హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమం అమీరిశెట్టి సతీష్ కుమార్, వీణ పుణ్య దంపతులు ఆధ్వర్యంలో ఘనంగా పూజలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో మల్కాపూర్ గ్రామ ప్రజలు పుర ప్రముఖులు, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి యూత్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలు

- **బెల్లంపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ.**



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 15**
మంచిర్యాల గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ క్రీడా మైదానం వేదికగా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ ఈ మారయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యూత్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో బెల్లంపల్లి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు పథకాలు సాధించారని పాఠశాల డైరెక్టర్ ఈ. రవి ప్రసాద్, ప్రిన్సిపల్ యం. రాజా రమేష్ లు తెలియజేశారు. ఇందులో భాగంగా అండర్-14 విభాగంలో కే. దీక్ష (ఏడవ తరగతి) త్రయాత్లోన్ లో సిల్వర్ మెడల్స్ ను, అండర్ - 16 విభాగంలో ఓ. రుచిత (9వ తరగతి) లాంగ్ జంప్ లో గోల్డ్ మెడల్ ను , 400 మీటర్స్ పరుగు పందెంలో బ్రాంజ్ మెడల్ ను, ఎం. సింధుజ (9వ తరగతి) జావలిన్ త్రోలో బ్రాంజ్ మెడల్ ను, ఓ. నిత్య శ్రీ (9వ తరగతి) షాట్ పుట్ లో గోల్డ్ మెడల్ ను సాధించారని తెలియజేశారు. ఈనెల 18వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీ క్రీడా మైదానంలో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి యూత్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలలో పాల్గొననున్నారని తెలిపారు. అలాగే మెడల్స్ సాధించిన క్రీడాకారులను మరియు వ్యాయామ ఉపాధ్యాయులు వి. మల్లేష్ యాదవ్, యస్. సంతోష్ యాదవ్ అభినందించారు.

# బొమ్మగాని ధర్మభిక్షం పోరాటం, త్యాగం మరువలేనిది

- కొయ్యడ సృజన్ కుమార్



**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 15:**

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షం త్యాగం మరువలేదని గీతపనివారల సంఘం జిల్లా నిర్మాణ భాద్యులు కొయ్యడ సృజన్ కుమార్ అన్నారు. శనివారం రోజున ధర్మభిక్షం 103 వ జయంతిని పురస్కరించుకొని స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్ లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సృజన్ కుమార్ మాట్లాడుతూ ధర్మభిక్షం గారు నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పేద బడుగు బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం నిస్వార్ధంగా ఉద్యమించిన మహా నాయకుడని అన్నారు. నిజాం రాజరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఇచ్చిన తెలంగాణ సాయుధ పోరాట పిలుపును అందుకొని సాయుధ పోరాటంలో ప్రత్యేక్షంగా పాల్గొని వందలాది గ్రామాలను విముక్తి చేయడంలో క్రియాశీలక పాత్ర పోషించారని, దున్నే వాడికి భూమి కావాలని వేలాది ఎకరాలను పేదలకు భూములు పంచారని,స్వార్థం లేకుండా నిస్వార్ధంగా తుది శ్వాస విడిచే వరకు ఎర్ర జెండా నిడన ప్రజా పోరాటాలు నిర్వహించారని,నల్లగొండ నుండి పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికయ్యారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గీత కార్మికులు ఎదురుకొంటున్న సమస్యల పరిష్కారం కోసం గీత పనివారల సంఘం ఏర్పాటు చేసి అన్ని గ్రామాల్లో కమిటీలు వేసి సమగ్ర కల్లు గీత విధానం కోసం, కార్మికుల శ్రేయస్సు కోసం,ప్రమాద వశత్తు చెట్టు పైనుండి పడి మరణించిన గీత కార్మికులకు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని అనేక పోరాటాలు చేసి అనేక విజయాలు సాధించడంలో ముందున్నారని, గౌడ జాతికి ధర్మభిక్షం ఆదర్శప్రాయుడని కొనియాడారు. ధర్మభిక్షం గారి ఆశయాల సాధన కోసం హక్కుల రక్షణ కోసం పోరాటలు చేయాలని సృజన్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి,



జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపెల్లి రాజు గౌడ్, బోయిని తిరుపతి, కిన్నెర మల్లమ్మ, బోనగిరి మహేందర్ నాయకులు సాంబయ్య, అంజిరెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రి ఏరియాలో చేరికలతో బలపడుతున్న సిఐటియు

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 15**
గత కొంతకాలంగా ఏరియాలో ప్రతిపక్షంగా సిఐటియు చేస్తున్న ఆందోళనలను గమనించిన పలువురు సివిల్ పిట్ సెక్రటరీ రాజ్ కుమార్ నాయకత్వంలో కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో యూనియన్ లో చేరిన ఫిట్టర్ కె.శ్రీనివాస్, పంపు ఆపరేటర్లు సత్తయ్య, మహేందర్ వాల్వ్ ఆపరేటర్ బి.కుమారస్వామి, శంకర్ లతో పాటు రాజశేఖర్ రెడ్డి ప్రవీణ్, సాంబశివుడులను సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి కండువాలు కప్పి సాధారణంగా ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలిచిన సంఘాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను స్ట్రక్చర్ సమావేశాల ద్వారా మాట్లాడి పరిష్కరించాల్సి ఉండగా ఎన్నికల కోడ్ ఉన్నదని ఇప్పుడు దాటవేస్తున్నారని కోడ్ లేని సమయంలో ఎందుకు మాట్లాడి పరిష్కరించలేదని అన్నారు. సివిల్ కార్మికుల సిబ్బంది కొరతను తగ్గించాలని మరియు వారి డిసిగ్నేషన్కు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని, మహిళలను డిపార్ట్మెంట్లో వాడుకుంటామని చెప్తున్నారని దానివలన వీరి ఆక్టింగ్ ప్యానెల్ కు ఇబ్బంది రాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు S.వెంకట స్వామి, అల్లి.రాజేందర్ ఉపాధ్యక్షులు రామగిరి.రామస్వామి సీనియర్ నాయకులు అలవల.సంజీవ్, ఆర్గనైజర్లు సంకె.వెంకటేష్, D.సురేష్, K.శ్రీనివాస్, నాగరాజు మరియు కాంటాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు దూలం.శ్రీనివాస్ తో పాటు సివిల్ కార్మికులందరూ ఉన్నారు.





## పీపుల్స్ ఫర్ పీపుల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో

# విద్యార్థులకు స్టడీ మెటీరియల్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 15**
మంచిర్యాల జిల్లా భీమిలి మండలంలోని విగామ పాఠశాలలోసుప్రజ పీపుల్ ఫర్ పీపుల్ సంస్థ ఆద్వర్యంలో శనివారం వీగామా ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్ నో సంస్థ నిర్వాహకులు ఉపాధ్యాయులతో కలిసి అందించారు సంస్థ అధ్యక్షులు జనగామ అభిలాష్ ప్రధాన కార్యదర్శి కాంంటేవాడ నగేష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు సహకారాన్ని అందించి మంచి మార్కులు సాధించడం కోసం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని మెటీరియల్ అందించడం వల్ల పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు సులభంగా పరీక్షలు రాయడానికి అవకాశం ఉంటుందని అలాంటి మెటీరియల్ను అందించ డం జరిగిందనిమరియు ఇప్పటివరకు వివిధ మండలా ల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులకు 60 వేల రూపాయల విలువ గల స్టడీ మెటీరియల్ అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కులగనలలో నమోదు కాని కుటుంబాలు తిరిగి నమోదు చేయాలని కార్యదర్శులకు ఎంపీడీవో ఆదేశం

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 15**
మంచిర్యాల జిల్లాలోని భిమిని మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో గంగా మోహన్ కార్యదర్శులకు సూచించారు కులగణన సర్వేలో లో నమోదు కాని అందుబాటులో లేని కుటుంబాల వివరాలను తిరిగి నమోదు చేసే కార్యక్రమంలో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 16వ తేదీ నుంచి 28వ తేదీ లోపు వారి వివరాలు నమోదు చేసుకోనుటకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని ఇట్టి విషయాన్ని మీ గ్రామపంచాయతీలలో టాంటాం ద్వారా అదేవిధంగా సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయించి కార్యాలయానికి వచ్చి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలియపరచాలని మరో మార్గం టోల్ ఫ్రీ నెంబరు మరియు వెబ్సైట్ ద్వారా కూడా వారి వివరాలు నమోదు చేసుకోవచ్చును.పై మూడు మార్గాల ద్వారా మాత్రమే సర్వే చేయించుకోవాల్సిందిగా గ్రామపంచాయతీలలో పబ్లిసిటీ చేయవలసిందిగా ఆదేశించడం జరిగిందని కార్యదర్శులు ఏ విషయాన్ని తమ గ్రామపంచాయతీలో సమాచారం అందించాలని ఎంపీడీవో అన్నారు

# ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందని వైద్యసేవలు

- **నిలిచిపోయిన కాన్పులు**
- **ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలు**

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 15**
మంచిర్యాల జిల్లాలోని భీమిలి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు పేదలకు అందని పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. విధులకు హాజరు కావలసిన వైద్యాధికారి దీర్ఘకాలిక సెలవులు వెళ్లినట్లు సిబ్బంది చెబుతున్నారు. ఇదిలా ఉండగా డ్యూటీలో ఉన్న సిబ్బంది విధులకు వచ్చి వెళ్తున్నారు తప్ప ప్రజలకు మాత్రం వైద్య సేవలు మృగ్యమయ్యాయి. ఈ ఆస్పత్రిలో గతంలో ఏడాదిలో 20 నుంచి 25 కాన్పులు జరిగేవి కానీ గత సంవత్సరం నుండి ఇక్కడ ఎలాంటి కాన్పులు జరిగిన దాఖలాలు లేవు మీటింగ్లు పెట్టుకోవడం తప్ప ఆసుపత్రిలో వైద్య సేవలు ప్రజలకు అందడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి ఆసుపత్రికి వచ్చిన రోగులకు మందులు ఇచ్చి ఏఎన్ఎంలు పంపిస్తున్నారు తప్ప వైద్యుడు దీర్ఘకాలిక సెలవులు ఉండడం ఇన్చార్జ్ వైద్యుని నియమించడంతో రెండు ఆసుపత్రిలో విధులు నిర్వహించలేక రెండు రోజులు భీమిని రెండు రోజులు సొంత పీహెచ్సీలో పని



చేస్తూ చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు దీంతో విష జ్వరాల ప్రబలినప్పుడు గ్రామాల్లో ప్రైవేటు వైద్యులు ఆర్ఎంపీలు ఇష్టారీతిన వైద్యం చేస్తూ ప్రజలను పిండుకు తింటున్నారు ఉన్నతాధికారులు జిల్లా వైద్యాధికారి దృష్టి సారించకపోవడంతో వైద్య సిబ్బంది ఆడింది ఆట పాడింది పాటగా ఆసుపత్రిలో నడుస్తోంది గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సబ్ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం మాత్రం సక్రమంగా విధులు నిర్వహిస్తూ వైద్య సేవలు గ్రామాల్లో అందిస్తున్నారు ఆరోగ్య కేంద్రంలో మాత్రం ఎలాంటి సేవలు అందడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారి ఉన్నతాధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పై దృష్టి సారించి ప్రసూతులు మరియు ఇతర వైద్య సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉండగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ మండలంలో అమలుకు నోచుకోని పరిస్థితి ఇక్కడ నెలకొంది ఆయుష్మాన్ భారత్ లో డిజిటల్ సర్వే చేసి ప్రతి ఇంట్లో వాళ్ళ పేర్లను డిజిటలైజేషన్ చేయాల్సి ఉండగా అధికారులు ఎవరూ ఇప్పటికీ డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించకపోవడంతో ఆయుష్మాన్ భారత్ అమలు కాని పరిస్థితి నెలకొంది అధికారులకు పేద ప్రజల ఆరోగ్యంపై ఎంత శ్రద్ధ ఉందో దీన్నిబట్టి మనం అర్థం చేసుకోవచ్చు వైద్యశాఖఅధికారులు కానీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు వారికే తెలియాలి ఇలాంటి మంచి పథకాలను అమలుపరచడం ద్వారా పేదలకు ఎంతో న్యాయం చేకూరుతుంది కానీ అధికారులు ఏ మాత్రం శ్రద్ధ వహించకపోవడంతో పేద ప్రజలు వ్యాధుల బారిన పడ్డప్పుడు లక్షల రూపాయలు ప్రైవేట్ ఆస్పత్రులకు సమర్పించుకొని ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు ఇప్పటికైనా ఆయుష్మాన్ భారత్ పై శ్రద్ధ చూపి, వైద్యశాఖ దీన్ని అమలయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు

## నేటి నుండే ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 15**

ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గతంలో అర్హత కలిగి ఉండి దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 16 నుండి 28వ తేదీ వరకు మరొకసారి అవకాశం కల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల నుండి 3 పద్ధతులలో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. మొదటి పద్ధతిలో టోల్ ఫ్రీ నం.040-21111111 నంబర్లో కుటుంబ పెద్ద ఉదయం 9 గం౹౹ల నుండి సాయంత్రం 5 గం౹౹ల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్ వివరాలను పరిశీలించి ప్రాథమిక తనిఖీ నిర్వహించడం జరుగుతుందని, ఒకవేళ వివరాలు లేనట్లయితే పై అధికారులకు దరఖాస్తు పంపించడం జరుగుతుందని తెలిపారు. 2వ పద్ధతిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవచ్చని, 3వ పద్ధతిలో ఆన్లైన్లో https://seeepcsurvey.cgg.gov.in వెబ్సైట్ ద్వారా సర్వే ఫారాన్ని డౌన్లోడ్ చేసుకొని, పూరించి సమీపంలోని ప్రజాపాలన సేవా కేంద్రాలలో సమర్పించవచ్చని తెలిపారు. సంబంధిత అధికారులు రోజు వారిగా దరఖాస్తుల ప్రక్రియ పరిశీలించడం జరుగుతుందని, జిల్లా అదనపు కలెక్టర్ జిల్లా స్థాయిలో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. మున్సిపాలిటీలు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాలలో అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## గుట్టలో స్వర్ణగోపుర మహాకుంభ సంప్రోక్షన

- 19 నుంచి 23 వరకు ఐదురోజుల పాటు ప్రతిష్ఠ



**యాదగిరిగుట్ట,ఫిబ్రవరి15( వెలుతురు ):**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వర్ణ దివ్యవిమాన గోపుర మహాకుంభ సంప్రోక్షణకు సన్నాహాలు మొదలయ్యాయి. ఈ నెల 19 నుండి 23 వరకు ఐదు రోజుల పాటు స్వర్ణ దివ్యవిమాన గోపుర మహాకుంభాభిషేక ప్రతిష్టా మహోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా 'పంచకుండాత్మక సుదర్శన నృసింహ మహాయాగం' నిర్వహించడానికి కొండపైన ప్రధానాలయ ఈశాన్య దిశలో యాగశాల ఏర్పాటు చేశారు. ఇక ఈ నెల 23న స్వర్ణమయమైన దివ్యవిమాన గోపురానికి పవిత్ర నదీ జలాలతో మహాకుంభాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం దివ్యవిమాన గోపురంపై ఉన్న సుదర్శన నారసింహచక్రానికి సంప్రోక్షణ పూజలు చేసి స్వర్ణ విమానగోపురాన్ని స్వామివారికి అంకితం చేయనున్నారు. 23న నిర్వహించే మహాకుంభ సంప్రోక్షణకు సీఎం రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు హాజరుకానున్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించే పంచకుండాత్మక మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో సామాన్య భక్తులు సైతం పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు ఈవో తెలిపారు.

## తుదిదశకు చేరుకున్న మహాకుంభమేళా

- రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రాక
- కుంభమేళాను మరి కొన్నిరోజులు పొడిగించాలన్న అఖిలేశ్

**ప్రయాగ్‌రాజ్,ఫిబ్రవరి15( వెలుతురు ):**

మహాకుంభమేళా తుదిదశకు చేరుకుంటోంది. రోజురోజుకూ భక్తులు భారీగా తరలివచ్చి పుణ్యస్నానాలు చేస్తున్నారు. ఇప్పటికే 50 కోట్లమందికి పైగా గంగానదిలో పుణ్యస్నాన మాచరించినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. మరో పదిరోజుల్లో ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ముగియనుండగా.. భక్తుల తాకిడి మాత్రం తగ్గడం లేదు. ప్రయాగ్ రాజ్ వస్తున్న వారితో రోడ్లు కిక్కిరిసి పోతున్నాయి. రైళ్లు కిటకిటలాడుతున్నాయి. ఇటీవల రికార్డు స్థాయిలో 350 కి.మీ. మేర వాహనాలు బారులు తీరిన విషయం తెలిసిందే. జనాలు భారీగా రావడంతో ప్రయాగ్‌రాజ్ సంగమ్ రైల్వేస్టేషన్‌ను మూసివేయాల్సిన పరిస్థితి ఎదురైంది. ఈ నేపథ్యంలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వానికి ఓ విజ్ఞప్తి చేశారు. గతంలో కుంభమేళాను 75 రోజులు నిర్వహించిన సందర్భాలున్నాయి. కానీ ఇప్పుడు ఆ గడువు తక్కువగా ఉంది. ప్రస్తుతం ప్రతి ఒక్కరు మహాకుంభమేళాకు వెళ్లాలని అనుకుంటున్నారు. కానీ వెళ్లలేకపోతున్నారు. ప్రభుత్వం ఈ గడువు పెంచాలని యాదవ్ సూచించారు. ప్రతి 12 ఏళ్లకు ఓసారి నిర్వహించే ఈ మహా కుంభమేళా జనవరి 13న మొదలు కాగా.. ఫిబ్రవరి 26 వరకు కొనసాగనుంది. మొత్తం 40 నుంచి 45 కోట్ల మంది రావచ్చని తొలుత అంచనా వేశారు. కానీ, అంచనాలకు మించి భక్తులు ప్రయాగ్‌రాజ్‌కు వస్తున్నారు. ప్రపంచం నలుమూలల నుంచి నిత్యం సరాసరి కోటిన్నర మంది వస్తుండటం గమనార్హం. జనవరి 29న మౌని అమావాస్య రోజే దాదాపు 8 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్‌కు వచ్చినట్లు యూపీ ప్రభుత్వం పేర్కొంది. భక్తుల సంఖ్య 50 కోట్లు దాటడంపై స్పందించిన యూపీ ప్రభుత్వం.. భారత్, చైనా మినహా అన్ని దేశాల జనాభాను ఈ సంఖ్య దాటేసిందని పేర్కొంది. ఇక్కడ స్నానాలు చేసిన వారి సంఖ్య అమెరికా, రష్యా, ఇండోనేసియా, బ్రెజిల్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ దేశాల జనాభా కంటే ఎక్కువని తెలిపింది.

## నేడే గాంధారి ఖిల్లా మైసమ్మ మహా జాతర






**గాంధారి మైసమ్మ మహా జాతరను ఆదివారం ఉదయం నుంచి జరపనున్నట్లు ఆదివాసి గిరిజన పూజారులు తెలిపారు. ఈ మహా జాతరకు లక్షల సంఖ్యలో భక్తులు హాజరవడంతో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు.**

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి బండి ప్రవీణ్ కుమార్ ఫిబ్రవరి 15**

వివరాల్లోకి వెళితే........

గాంధారి ఖిల్లా, మంచిర్యాల జిల్లా, మందమర్రి మండలంలోని బొక్కలగుట్ట గ్రామానికి దగ్గరలోని కొండమీద ఉన్న కోట. గోండు గిరిజన జాతి కోసం చివరి వరకు పోరాటం చేసిన రాజ్ గోండ్ లు ఈ కోటను నిర్మించారు.దట్టమైన అటవీ ప్రాంతంలో నిర్మించబడిన ఈ ఖిల్లాకు 400 సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ ఖిల్లాలో వున్న మైసమ్మ దేవతను ఆ ప్రాంతాల ప్రజలు, గిరిజనులు భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ప్రతి ఏడాది జరిగే ఉత్సవాల్లో దున్నపోతును సైతం బలిస్తారు. ఇలా గిరిజనుల ఇష్టదైవంగా ఉన్న ఈ ప్రాంతానికి పర్యాటకులు సైతం ఇక్కడకు వస్తుంటారు. గోండు, గిరిజన శిల్పులు ఈ గాంధారి ఖిల్లాను ఒక గుట్టలోనే చెక్కారని చెబుతారు. ఇక్కడ గాంధారి మైసమ్మ ఆలయం కూడా ఉంది.



ఈ కోటను 12 వ శతాబ్దంలో వరంగల్ కాకతీయ రాజుల కాలంలో గోండు రాజులు నిర్మించారు. 1200 సం" కి ముందు ప్రారంభమై 16వ శతాబ్దం వరకు కోట నిర్మాణం కొనసాగిందని పురావస్తు పరిశోధన ప్రకారం తెలుస్తోంది. ఈ కోటను రాష్ట్ర కేంద్రంగా చేసుకున్న గోండు రాజులు పాలన సాగించారని, కొంతకాలం వడ్డె రాజులు, రెడ్డిరాజులు కూడా పరిపాలించారని చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది.

ఇక్కడ జరిగే గాంధారి మైసమ్మ జాతరలో మైసమ్మ పటం కొలుపు అనేది ప్రధాన ఘట్టం. అర్ధరాత్రి దాటిన తర్వాత పద్మనాయక పూజారి, ఝాట్టీలు కోటలోని ప్రధాన దర్వాజా ఎడమ పట్టీకి చెక్కి ఉన్న విగ్రహం ముందట మైసమ్మ ఆకారంలో పసుపు కుంకుమలతో పట్నం గీసి దాని గాజులు, గంధం, నిమ్మకాయలతో అలంకరించి పూజలు చేస్తారు. గాంధారి కోటలోని అడవి ఔషధ మొక్కలకు ముఖ్యమైన వనరుగా ఉంది. పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు ఔషధ మొక్కలను సేకరించి సమీప పట్టణాల్లో విక్రయిస్తుంటారు. ఈ మొక్కలను గుర్తించడానికి, హెర్బేరియం నమూనాలను తయారు చేయడానికి విద్యార్థులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తుంటారు. ఔషధ మొక్కలకు ఈ ప్రాముఖ్యత దృష్ట్యా, కోట ప్రాంతంలోని అడవిని ఔషధ మొక్కల సంరక్షణ ప్రకటించాలన్న కేంద్రం సూచనమేరకు, తెలంగాణకు హరితహారంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం 134 హెక్టార్ల విస్తీర్ణాన్ని గాంధారి వనంగా మార్చింది. 40 ఎకరాల స్థలంలో జింకల పార్కు, హెర్బల్ గార్డెన్, నవగ్రహ వనం, రాశివనం, పిల్లల పార్కు మొదలైనవి ఏర్పాటుచేసింది. అయితే ఈ జాతరలో భారీ బందోబస్తు నడుమ సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తుంటారు. మున్సిపల్ పరిశుద్ధ కార్మికులు భారీగా ఇప్పటికే చేరుకొని పరిసరాలను శుభ్రపరిచారు.

## ప్రపంచ దేశాలతో నేడు భారతదేశం పోటీపడుతుంది...

- స్వదేశీ పరిజ్ఞానం, ఆలోచనలతో ముందుకెళుతూ వికసిత్ భారత్ వైపు అడుగులు వేస్తుంది....
- దేశం ఆర్థికంగా పురోగతి సాధించాలంటే స్వదేశీ వస్తువులను కొనాలి...
- సామాజిక, సమరత వేదిక తెలంగాణ ప్రాంత సంయోజక్ అప్పాల ప్రసాద్ జి....







**కరీంనగర్ వెలుతురు ఫిబ్రవరి 15:**

భారతదేశం పై ఎన్నో దేశాలు దాడులు చేసి , మన సంస్కృతిని నాశనం చేసిన నిలదొక్కుకుని, నేడు ప్రపంచ దేశాల తో అన్నింట పోటీ పడుతుందని , స్వదేశీ పరిజ్ఞానం, ఆలోచనలతో ముందుకెళ్తూ వికసిత్ భారత్ వైపు అడుగులు వేస్తుందని సామాజిక , సమరసత వేదిక తెలంగాణ ప్రాంత సంయోజక్ అప్పాల ప్రసాద్ జి అన్నారు. స్వదేశీ మేళా ప్రోగ్రాంలో భాగంగా శనివారం రోజున అంబేద్కర్ స్టేడియంలో ఇంటర్ విద్యార్థులతో నిర్వహించిన సెమినార్ కార్యక్రమానికి అప్పాల ప్రసాద్ జి ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. ముఖ్యంగా జపాన్ దేశంపై అనుబాంబు దాడి జరిగినప్పుడు దేశం పూర్తిగా నాశనం అయిపోయిందని అందరూ అనుకున్న , కొద్ది సంవత్సరాల లోనే ఆ దేశం అన్ని రంగాల్లో అమెరికాతో పోటీ పడే స్థితికి వచ్చిందన్నారు. 250 ఏళ్లు భారతదేశ సంస్కృతిని, సంపదను దోచుకున్నారన్నారని, అయినా అన్నింటినీ తట్టుకొని నిలబడిందని, ఇది భారత దేశగొప్పతనమన్నారు. ప్రజల ఆలోచన విధానాల్లో మార్పు రావాలని , మన సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించుకుంటూ,కాపాడుకోవాలని, భారతదేశంలో పుట్టినందుకు ప్రతి ఒక్కరూ గర్వపడాలన్నారు. స్వదేశీ అంటే విదేశానికి వ్యతిరేకం కాదన్నారు. ముఖ్యంగా మన దేశంలో తయారైన వస్తువులను మనమే కొనాలని, మన డబ్బు మన దేశంలోనే ఉండేలా చూసుకోవాలన్నారు. 1947 స్వాతంత్ర అనంతరం వేద దేశంగా ఉన్న భారతదేశం అమెరికా ఇచ్చే గోధుమలు తినే పరిస్థితుల్లో ఉండేదని , నేడు 75 సంవత్సరాల తర్వాత ఆర్థిక అభివృద్ధి సాధించి 102 దేశాలకు అన్నం పెడుతుందన్నారు.1947 లో ప్రపంచంలో 168 ఆర్థిక ర్యాంకింగ్ తో ఉన్న దేశం నేడు 5 వ స్థానంతో దూసుకుపోతుందన్నారు. దేశం ఇంకా ఆర్థికంగా బలోపేతం కావాలంటే స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా దేశ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాలలో స్వాలంబన సాధించేందుకు స్వదేశీ జాగారణ్ మంచ్ స్వచ్ఛందంగా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమన్నారు. మన సంస్కృతి , వారసత్వాన్ని రాబోయే తరాలకు అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. ఇవాళ ప్రపంచీకరణ ప్రభావంతో బౌల జాతి సంస్థల తుఫాన్ లో చిక్కుకొని చిన్నచిన్న పని వారు, కులవృత్తులు, వివిధ వృత్తులు , మన పటిష్ట ఆర్థిక కేంద్రాలకు మూల స్తంభాలైన వారసంతల వంటివెన్నో విలవిల్లాడుతూ కొట్టుకుపోతున్న పరిస్థితుల్లో గత మూడు దశాబ్దాలుగా దేశంలోని ఆర్థిక రంగాలన్నింటిలోనూ, మన ఆర్థిక ప్రయోజనాలను రక్షించడానికి, మన ఆర్థిక వ్యవస్థ పై విదేశీ శక్తుల ప్రభావాలకు వ్యతిరేకంగా స్వదేశీ జాగరణ మంచ్ పోరాడుతుందన్నారు.. ఆ దిశలోనే స్వదేశీ భావజాల వ్యాప్తికి , సదస్సులు , సమావేశాలు, కార్యక్రమాలతో పాటు స్వదేశీ మేళాలు నిర్వహిస్తూ మళ్లీ మనదైన సాంస్కృతిక సామాజిక ఆర్థిక రంగాల పునర్ వైభవం కోసం కృషి చేస్తుందన్నారు. స్వదేశీ మేళాలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను ప్రతి ఒక్కరు సందర్శించాలని, ఇక్కడి వస్తువులను కొనుగోలు చేసి వారికి ప్రోత్సాహం ఇవ్వాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. సభాధ్యక్షులు, స్వదేశీ మేళా కో కన్వీనర్ కళ్లెం వాసు దేవ రెడ్డి మాట్లాడుతూ భారతదేశం పరం వైభవ స్థితికి చేరుకోవడానికి ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ చేయాలన్నారు. ముఖ్యంగా దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని, జీవితంలో రాణిచ్చే రంగాన్ని ఎన్నుకొని భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. అవసరానికి మించి సోషల్ మీడియాను వినియోగించవద్దన్నారు. ఇట్టి కార్యక్రమంలో స్వదేశీ జాగరణ మంచ్ కన్వీనర్ ముక్కహరీష్ బాబు, ముత్యాల జగన్ రెడ్డి , వసంత్ వ్యాలీ స్కూల్ కరస్పాండెంట్ ఇనుకొండ బుచ్చిరెడ్డి, సప్తగిరి హై స్కూల్ చైర్మన్ నగేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కూతురుతో చనువుగా ఉంటున్నందుకు కక్ష

### యువకుడిని హత్య చేసిన బాలిక తండ్రి

**సంగారెడ్డి,ఫిబ్రవరి15( వెలుతురు ):**

తన కూతురిని ప్రేమిస్తున్నాడని ఓ యువకుడిని బాలిక తండ్రి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. మెగ్యానాయక్ తండాలో 9 తరగతి చదువుతున్న ఓ బాలికతో దశరథ్(26) చనువుగా ఉంటున్నట్లు బాలిక తండ్రి గోపాల్ అతడిపై కక్ష పెంచుకున్నాడు. తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్న గోపాల్.. తన కూతురుతో సన్నిహితంగా ఉంటున్న దశరథ్‌ను అంతమొందించాలనుకున్నాడు. ఈ క్రమంలోనే దశరథ్‌ను హత్య చేసిన బాలిక తండ్రి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. నిజాంపేట మండల శివారు అటవీప్రాంతంలో యువకుడి మృతదేహాన్ని తగలబెట్టినట్టు సమాచారం. అనంతరం నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన గోపాల్ లొంగిపోయాడు. దశరథ్ కుటుంబ సభ్యులు మృతదేహం కోసం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు.



రంగంలోకి దిగిన పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. నిందితుడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడు దశరథ్‌కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తన భర్త నాలుగు రోజులుగా కనిపించడం లేదంటూ మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. దశరథ్ ను హత్య చేసినట్లు గోపాల్ అంగీకరించడంతో పోలీసులు.. మృతదేహం కోసం వెతుకుతున్నారు.

# రుషికొండ కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు

- అధికారుల తీరుపై మండిపడ్డ మంత్రి పయ్యావుల



**అమరావతి,ఫిబ్రవరి15( వెలుతురు ):**
రుషికొండ ప్యాలెస్ కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు వ్యవహారంపై ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లులు ఎందుకు చెల్లించారంటూ ఆర్థిక శాఖ ఉన్నతాధికారులపై మండిపడ్డారు. దీనిపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అదే సంస్థ చేపట్టిన వేరే పనులకు బిల్లులు చెల్లించినట్లు అధికారులు వివరణ ఇచ్చారు. వేరే బిల్లులైనా సరే.. ఎందుకు చెల్లించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో దీని గురించి చెప్పినా.. వినకుంటే ఎలా అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ కాంట్రాక్టర్‌కు ఏయే పనులకు బిల్లులు చెల్లించారో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. చెల్లింపుల కోసం ఎవరైనా సిఫార్సు చేశారా? సొంత నిర్ణయమా? అంటూ ప్రశ్నించారు. ఆ కాంట్రాక్టర్ చేపట్టిన ఏ పనులకైనా ఇకపై చెల్లింపులు చేయొద్దని మంత్రి స్పష్టం చేశారు. సీఎం లేదా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రుషికొండపై జగన్ సర్కార్ చేపట్టిన నిర్మాణాలపై ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. గత ప్రభుత్వం రుషికొండ ప్యాలెస్ నిర్మాణాలు చేపట్టడంతో మరోసారి ఇది హాట్ టాపిక్ అయ్యింది. అయితే రుషికొండ ప్యాలెస్ నిర్మాణ కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు వ్యవహరంపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ (ఖజాజీలబ్గీ÷జీ ఐ।బరజీల) సీరియస్ అయ్యారు. రుషికొండ ప్యాలెస్ కాంట్రాక్టర్‌కు ఎందుకు బిల్లులు చెల్లించారని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులపై పయ్యావుల మండిపడ్డారు. రుషికొండ ప్యాలెస్ కాంట్రాక్టర్‌కు బిల్లులు ఎందుకు చెల్లించారో వివరణ ఇవ్వాలని మంత్రి పయ్యావుల ఆదేశాలు జారీ చేశారు. రుషికొండ ప్యాలెస్ నిర్మాణ పనుల బిల్లులను చెల్లించలేదని అధికారులు వెల్లడించారు. ఇకపై ఆ కాంట్రాక్టర్ చేపట్టిన ఎలాంటి పనులకైనా సరే బిల్లులు చెల్లించవద్దని మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు లేదా తన దృష్టికి తీసుకు రాకుండా బిల్లుల చెల్లింపులు జరిపితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# యాసిడ్ దాడి దుర్మార్గుడ గణేశ్ అరెస్ట్

- పక్కా ప్రణాళికతోనే దాడి చేశాడన్న ఎస్పీ



**మదనపల్లె,ఫిబ్రవరి15( వెలుతురు ) :**



అన్నమయ్య జిల్లాలోని గుర్రంకొండలో యువతిపై ప్రేమోన్మాది యాసిడ్ దాటి ఘటనలో ప్రేమోన్మాది గణేష్‌ను పోలిసులు అరెస్ట్ చేశారు. నిందితుడు గణేష్ ను మీడియా ముందు ప్రవేశ పెట్టిన జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు వివరాలు వెల్లడించారు. ఘటన జరిగిన 24 గంటల్లోనే నిందితుడు గణేష్ ను అరెస్టు చేశామని.. పక్కా పథకం ప్రకారమే గౌతమిపై గణేష్ దాడికి పాల్పడ్డినట్లు తెలిపారు. దాడి చేయాలని ఉద్దేశంతోనే ముందు రోజే బాత్ రూమ్‌లు శుభ్రం చేసే యాసిడ్ బాటిల్ కొనుగోలు చేశాడు.. ఇక, మరుసటి రోజు తెల్లవారుజామునే బాధితురాలి ఇంటికి వెళ్లి.. ఒంటరిగా ఉన్న సమయం కోచి వేచిచూశాడని.. ఆ తర్వాత కత్తితో దాడి చేసి తర్వాత తన వెంట తెచ్చుకున్న యాసిడ్ ను గౌతమి నోట్లో పోసి, తాగించేందుకు ప్రయత్నించాడన్నారు. అసమయంలో గౌతమి కొంతవరకు ధైర్యంగా ప్రతిఘటించిందన్నారు..ఇక, గణేష్, గౌతమి ఇద్దరూ డిగ్రీలో స్నేహితులని వెల్లడించారు జిల్లా ఎస్పీ.. అయితే, తనను ప్రేమించాలంటూ తన వెంట పడుతోన్న గణేష్‌ను తొలినుంచి సదరు యువతి దూరం పెడుతూ వచ్చింది.. ప్రేమించాలని ఒత్తిడి తెచ్చినా.. నిరాకరించింది.. అయితే గౌతమికి వివాహం ఖాయమైందని తెలిసే ఈ దాడికి పాల్పడినట్టు పేర్కొన్నారు.. ఇక, పూర్తి స్థాయిలో కేసును దర్యాప్తు చేస్తామన్నారు ఎస్పీ.. మహిళలపై దాడులను ఎట్టి పరిస్థితుల్లో క్షమించబోమని వార్నింగ్ ఇచ్చారు అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు.

# ఆందోళన కలిగిస్తున్న సైబర్ నేరాలు

- సమిష్టి కృషితోనే వీటిని అరికట్టగలం
- సిసి కెమెరాలు తప్పనిసరి చేసుకోవాలి
- హోంమంత్రి అనిత



**విజయవాడ,ఫిబ్రవరి15( వెలుతురు ):**
సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ హోంశాఖ మంత్రి అనిత ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారులపై అత్యాచారాలు దురదృష్టకరమని అన్నారు. విజయవాడలో డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పాల్గని ప్రసంగించారు. న్యాయవాదులందరినీ ఒకచోట చేర్చి సదస్సు నిర్వహించడం సంతోషకరమని అన్నారు. న్యాయవ్యవస్థలో మహిళలు ఎక్కువగా ఉండటం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని అన్నారు. దొంగలు చాలా తెలివి మీరిపోయారని చెప్పారు. ప్రతి వ్యక్తి తనకు తాను నిఘా పెట్టుకుని బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు చాలా అవసరమన్నారు. టెక్నాలజీని ఉపయోగించుకుని నేరాలను నియంత్రించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీసు, న్యాయవ్యవస్థ సమన్వయంతో చాలా కేసులు ఛేదించ వచ్చన్నారు. బాధితులకు అండగా నిలిచేందుకు మనమంతా ఏకమవుదాం అని పిలుపునిచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగుదాం అని హోం మంత్రి అనిత పిలుపునిచ్చారు. డిజిటల్ ఎవిడెన్స్‌పై సమన్వయం చేసుకుని పని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు శాఖ, న్యాయ శాఖ మధ్య సమన్వయం ఉండాల్సిన అవసరం ఉందని చెప్పుకొచ్చారు. ఒక గౌరవమైన వృత్తిలో న్యాయ వ్యవస్థ ఉందని.. పోలీసులు, లాయర్లను చూసి ఇప్పుడు గర్వపడుతున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో సైబర్ నేరాలు మరింత ఎక్కువగా జరుగుతాయని తెలిపారు. ప్రస్తుతం దొంగలు.. మన కన్నా షార్ప్ గా ఉన్నారు. డిజిటల్ ఎవిడెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుంది. సైబర్ నేరాలు బాగా పెరుగుతున్నాయి. లాయర్లు, డాక్టర్లు, పోలీసులు కూడా సైబర్ క్రైంలో చిక్కుకున్నారు. ఈజీ మని కోసం జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. డిజిటల్ క్రైం, డిజిటల్ ఎవిడెన్స్‌పై అవగాహన ఉండాలని చెప్పుకొచ్చారు. నిందితులకు శిక్ష పడే విషయంలో కాలయాపన జరుగుతోందన్నారు. ఏదైనా ఒక నేరం జరిగి కేస్ వస్తే లీగల్ టీం పోలీసు డిపాటమెంట్‌కు సపోర్ట్ చేస్తే ఎందుకు శిక్షలు ఆలస్యం అవుతాయని అన్నారు. ఎవిడెన్స్ కలెక్ట్ చేసే విషయంలో జాగ్రత్తలు ముఖ్యమని వెల్లడించారు. న్యాయవ్యవస్థకు గౌరవం ఇవ్వాలంటే పోలీసులకు కూడా న్యాయవాదులు అంతే గౌరవం ఇస్తే న్యాయం త్వరగా జరుగుతుందని అభిప్రాయపడ్డారు. విజయనగరం జిల్లాలో ఆరు నెలల చిన్నారిపై అత్యాచారం జరిగిందని.. మూడు నెలల్లోనే నిందితుడికి 25 సంవత్సరాల జైలు శిక్ష పడిందన్నారు. పోలీస్ న్యాయ వ్యవస్థ సక్రమంగా పని చేయడం వల్ల ఇది సాధ్యం అవుతుందని చెప్పారు. ఇంట్లో టీవీ, ఫ్రిజ్ ఉన్నట్టే సీసీ టీవీ కూడా ఉండాలన్నారు. డ్రోన్ సహాయంతో ట్రాఫిక్ జామ్‌పై దృష్టి పెట్టామని..ట్రాఫిక్ కంట్రోల్‌కు డిజిటల్ టెక్నాలజీ వాడుతున్నామన్నారు. ఏదైనా కష్టం వస్తే పోలీసులు గుర్తొస్తున్నారని అంతవరకు సంతోషమన్నారు. పబ్లిక్‌కు అర్థమయ్యే భాషలో ప్రాసిక్యూటర్లు కూడా మాట్లాడితే కేసు ఏంటి అనేది అర్థం అవుతుందని తెలిపారు. న్యాయవాదులు, పోలీసులు కలిసి పని చేస్తే తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. న్యాయవ్యవస్థకు పోలీసుల సహకారం తప్పకుండా ఉంటుందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.ఇదిలావుంటే వైసీపీ నేత వల్లభనేని వంశీ అరెస్ట్‌పై హోంమంత్రి అనిత స్పందించారు. వంశీ తప్పు చేసినట్లు అన్ని ఆధారాలు ఉన్నాయని.. ఆధారాలతో వంశీని అరెస్టు చేసి పోలీసులు జైలుకు పంపారని తెలిపారు. దళితుడిని భయపెట్టి బెదిరించి వంశీ కిడ్నాప్ చేయించారన్నారు. డీజీపీ ఆఫీసు పక్కనే ఉన్న టీడీపీ ఆఫీసుపై దాడి జరిగితే కనీసం రక్షణ కల్పించలేదని అన్నారు. సీఎంను తిడితే బీపీ పెరిగి దాడి చేశారని నాడు జగన్ చెప్పాడరని.. వంశీ అరెస్టుపై నీతి కబుర్లు సత్య వర్ధన్ బ్రదర్ వచ్చి వంశీని బెదిరించి బలవంతంగా అఫిడవిట్ దాఖలు చేశారని చెప్పారని.. జగన్ తెగ బాధ పడుతున్నారని వ్యాఖ్యలు చేశారు. దయ్యాలు వేదాలు వల్లించినట్లు జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతున్నా రన్నారు. గత 5 ఏళ్లు టీడీపీపై అబద్ధపు కేసులు పెట్టారని, దాడులు చేశారని గుర్తు చేశారు. 'మేము రివేంజ్ తీర్చుకోవాలని అనుకుంటే ఇన్ని నెలలు సమయం తీసుకోమని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లోని వంశీ నివాసాల్లో సోదాలు



**అమరావతి, ఫిబ్రవరి15( వెలుతురు ):**
వైసీపీ నేత వల్లభనేని వంశీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లోని వంశీ నివాసంలో మరోసారి ఏపీ పోలీసులు సోదాలు నిర్వహించారు. రాయదుర్గం పోలీసుల సహకారంతో వంశీ ఇంట్లో తనిఖీలు చేస్తున్నారు పోలీసులు. వంశీ ఇంట్లో ఓ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఎస్ఐ, కానిస్టేబుల్ సోదాల్లో పాల్గొన్నారు. వంశీ మొబైల్ కోసం పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. వంశీ మొబైల్‌లో కీలక ఆధారాలు ఉన్నాయని కాప్స్ భావిస్తున్నారు. వల్లభనేని ఇంట్లో సీసీటీవీ ఫుటేజీని ఓ బృందం సేకరించింది. వంశీ కేసు కోసం ఏపీ సీఐడీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వంశీ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనకు సంబంధించి వంశీ ఫోనులో కీలక ఆధారాలు ఉన్నాయని పోలీసులు భావిస్తున్నారు. వంశీని అరెస్ట్ చేసే సమయంలో ఆయన ఫోన్ మిస్సైంది. దీంతో వంశీ మొబైల్ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. దీని కోసం హైదరాబాద్‌కు రెండు దర్యాప్తు బృందాలు చేరుకున్నాయి. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో 94 మంది నిందితులుగా ఉండగా ఇప్పటి వరకు ఏపీ సీఐడీ 40 మందిని అరెస్ట్ చేసింది. ఈ కేసులో ఏ71గా వంశీ ఉన్నారు. మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక టీం గాలిస్తోంది. అయితే వంశీని అరెస్ట్ చేసే సమయంలో పోలీసుల కళ్లు గప్పి 40 నిమిషాల పాటు వంశీ హైడ్రామా ఆడారు. అదే సమయంలో వంశీ ఫోన్ కనపడకుండా పోయింది. నిన్న కూడా ఏపీ సీఐడీ పోలీసులు వంశీకి ఇంటికి వచ్చారు. ఏపీ సీఐడీ పోలీసులు, రాయదుర్గం పోలీసులు సంయుక్తంగా వంశీ నివాసంలో సోదాలు చేశారు. వంశీ భార్య అందుబాటులో ఉండటంతో ఇంట్లో కొన్ని డాక్యుమెంట్లను పోలీసులు సేకరించారు. అలాగే వంశీ నివాసం వద్ద ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌ను కూడా సేకరించారు. కాగా.. గన్నవరం టీడీపీ కార్యాలయం విధ్వంసం కేసులో ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన కేసులో వల్లభనేని వంశీమోహన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు కీలక ఆధారాలను సేకరించారు. సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన దృశ్యాలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు సేకరించారు. వల్లభనేని వంశీమోహన్‌కు విజయవాడ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో వంశీని పోలీసులు విజయవాడ హనుమాన్ పేటలోని జిల్లా జైలుకు తరలించారు. జిల్లా కారాగారంలో 14 రోజుల పాటు (ఈనెల 27 వరకు) రిమాండ్ ఖైదీగా వంశీ ఉండనున్నారు. మరోవైపు ఈ కేసులో నిందితులుగా ఉన్న 12 మంది కోసం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు.

# దేశంలో నెంబర్‌వన్‌గా ఉండాలన్నదే చంద్రబాబు లక్ష్యం

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**అమరావతి, ఫిబ్రవరి15( వెలుతురు ):**
దేశంలోనే పరిశుభ్రతలో ఏపీ నెంబర్ వన్‌గా ఉండాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని ఏపీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు "స్వచ్ఛ ఆంధ్రా - స్వచ్ఛ దివాస్" నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ప్రతి నెలా మూడో శనివారం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఈ కార్యక్రమం జరగాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని అన్నారు. మన ఇళ్లు, ఇంటి పరిసరాలు, ఊరు పరిశుభ్రంగా ఉంటే దేశం శుభ్రంగా ఉంటుందని తెలిపారు. అధికారులు,



కూటమి పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు కలిసి ప్రజలను జాగృతం చేయాలని సూచించారు. గతంలో ఆత్మకూరు నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు తీసిందని అన్నారు. గడిచిన ఐదేళ్లుగా అభివృద్ధి నిలిచిపోయిందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బలహీనవర్గాల బాలికల గురుకుల పాఠశాలలను 60 మంది పిల్లలతో ప్రారంభించినట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గుర్తుచేశారు. ఎక్కడా లేని సౌకర్యాలు ఈ పాఠశాలల్లో కల్పించామని చెప్పారు. ప్రభుత్వం రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీని మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో మంజూరైన రెండింటిలో ఒకటి ఆత్మకూరుకు వచ్చిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆత్మకూరులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రూ.29కోట్లు నిధులు మంజూరు చేశాయని ప్రకటించారు. ఆత్మకూరులో వందపడకల ఆస్పత్రిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి మంత్రి సత్యకుమార్ అంగీకరించారని అన్నారు. రెండు జాతీయ రహదారులను కలిపే ఆత్మకూరు - సోమశిల రోడ్డు, నెల్లూరుపాళెం - వింజమూరు, సంగం - కలిగిరి రోడ్లని అభివృద్ధి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. రూ.25కోట్లతో ప్రతి పంచాయతీలో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుందని స్పష్టం చేశారు. రూ.85కోట్లతో విద్యుత్తు సరఫరాకు అవసరమైన పనులు జరుగుతున్నాయని తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్ సిస్టంలు పునర్నిర్మాణాలు జరుగుతాయని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి ఏపీలో రూ.10,50,000 కోట్ల అప్పులున్నాయని అన్నారు. జగన్ ప్రభుత్వంలో స్థానిక సంస్థల నిధులు రూ.1200కోట్ల మేర స్వాహా చేశారని విమర్శించారు. ఎంపీటీసీలు, సర్పంచులను కూడా మోసం చేశారని ఆరోపించారు. ఎన్ని లక్షల కోట్ల అప్పులున్నా, మెరుగైన పాలన సాగిస్తామని ఉద్ఘాటించారు. ఫైనాన్స్ నిధులను రాజకీయాలకు అతీతంగా పంచాయతీలకు ఇస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.


# పసుపు మార్కెట్ యార్డులో తీవ్ర ఉద్రిక్తత

## సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్‌పై కార్మికులు దాడి

**నిజామాబాద్,ఫిబ్రవరి15( వెలుతురు ):**
నిజామాబాద్ పసుపు మార్కెట్ యార్డులో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. యార్డుకు చెందిన సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్‌పై కార్మికులు దాడి చేశారు. తమపై పసుపు దొంగతనం ఆరోపణలు చేస్తున్నారంటూ శ్రీనివాస్‌పై కార్మికులు మండిపడ్డారు. ఈ మేరకు వివిధ సంఘాలకు చెందిన పసుపు కార్మికులు యార్డు ఛైర్మన్ కార్యాలయాన్ని ముట్టడించారు. దొంగతనం ఆరోపణలపై ఛైర్మన్‌ను ప్రశ్నించారు. కార్మికులంతా పెద్దఎత్తున ధర్నా చేపట్టడంతో సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన యార్డుకు చేరుకున్నారు. సెక్యూరిటీ అధికారి శ్రీనివాస్‌ను పోలీసులు అక్కడ్నుంచి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే పెద్దఎత్తున గుమిగూడిన కార్మికులు పోలీసుల వాహనాన్ని అడ్డగించారు. కారులోని శ్రీనివాస్‌పై దాడి చేసేందుకు యత్నించారు. అతన్ని బయటకు లాగి కొట్టే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు తమ కారును అక్కడ్నుంచి వేగంగా పోనిచ్చారు. కార్మికుల ధర్నాతో అక్కడంతా గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ధర్నా నేపథ్యంలో పసుపు క్రయవిక్రయాలు ఆగిపోయాయి. పసుపు కాంటాలు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కొనుగొళ్లు ప్రారంభించాలని కోరుతున్నారు. గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో మార్కెట్ యార్డును పోలీసులు భారీగా మోహరించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

## పది పరీక్షల నిర్వహణకు
# పటిష్ఠ భద్రత

- పరీక్షా సెంటర్ల వద్ద 8వేలకు పైగా సీసీ కెమెరాలు
- 40 మంది సిబ్బందితో కమాండ్ సెంటర్



**హైదరాబాద్, ఫిబ్రవరి15 ( వెలుతురు ):**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో వచ్చే నెల 5వ తేదీ నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. అయితే ఈ పరీక్షల్లో పారదర్శకత కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాట్లు చేస్తున్న పరీక్ష కేంద్రాల్లో 8 వేలకిపైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళికి వివరించారు. ఇప్పటికే ప్రారంభమైన ఇంటర్ ప్రయోగ పరీక్షలపై పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందనీ, వాటిని బోర్డులోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా కఠినమైన నిఘా ఉంటుందని వివరించారు. దేశ వ్యాప్తంగా ఉన్న విద్యా వ్యవస్థలకు ఇదొక ఉదాహరణగా నిలుస్తుందని ఆయన వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలలో ఏర్పాటు చేసిన 8 వేలకి పైగా కెమెరాలను పర్యవేక్షించడానికి 40 మంది సిబ్బందితో ఓ కమాండ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్చి 5 నుంచి 25 వరకు జరగనున్న సమయంలో పారదర్శకత, సమగ్రత, భద్రతను నిర్ధారించడం ఈ నిఘా వ్యవస్థ ప్రధాన లక్ష్యం. ఈ మేరకు విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, జ్యోత్స్నారెడ్డి పరీక్ష కేంద్రాల్లో కెమెరా వ్యవస్థ పనితీరును పరిశీలించారు. ఇంటర్ పరీక్షల్లో అవకతవకలకు పాల్పడకుండా లీకేజీలను నివారించడానికి, పరీక్ష మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండేలా ఏకకాలంలో పర్యవేక్షించడానికి వీలు కల్పిస్తుంది. ఎస్ఎస్సీ హిందీ ట్రాన్స్‌లేటర్స్ పేపర్ 1 ఫలితాలు వచ్చేశాయ్.. ఎంత మంది క్వాలిఫై అయ్యారంటే? స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ పరీక్ష ఫలితాలు తాజాగా విడుదలయ్యాయి. ఈ మేరకు కమషన్ ప్రకటనను జారీ చేసింది. కంబైన్డ్ హిందీ ట్రాన్స్‌లేటర్స్ (పేపర్-1) పరీక్ష డిసెంబర్ 9న దేశవ్యాప్తంగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ పరీక్ష ద్వారా మొత్తం 312 ఖాళీలు భర్తీ చేయనున్నారు. పేపర్ 1లో క్వాలిఫై అయిన వారికి పేపర్2 (డిస్క్రిప్టివ్) పరీక్షకు హాజరు కావడానికి అవకాశం ఉంటుంది. పేపర్‌లో మొత్తం 2145 మంది అభ్యర్థులు షార్ట్‌లిస్ట్ చేసినట్లు కమిషన్ వెల్లడించింది.

## ఘనంగా కొనసాగుతున్న సమతా కుంభ్ ఉత్సవాలు



**హైదరాబాద్, ఫిబ్రవరి15( వెలుతురు ):**
ఆధ్యాత్మిక నగరిగా భాసిల్లుతున్న రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లోని శ్రీ రామానుజక్షేత్రంలో సమతా కుంభ్ 2025 ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొంటున్నారు. సమతాకుంభ్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా ఆరో రోజు ఉదయం సుప్రభాత గోష్ఠితో పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. చినజీయర్‌స్వామి మార్గనిర్దేశంలో అందరూ ధ్యాన పద్ధతిని నేర్చుకున్నారు. ఆ తర్వాత అష్టాక్షరీ మంత్రజపంతో పాటు ఆరాధన కార్యక్రమాలు జరిగాయి. సేవాకాలం, శాత్తుముఱై తర్వాత భక్తులందరికీ స్వామివారు తీర్థం అందజేశారు.

## రాష్ట్రంలో ఊపందుకున్న మద్యం అమ్మకాలు

- డిమాండ్ తగ్గట్టుగా బీర్ల ఉత్పత్తి..

**హైదరాబాద్, ఫిబ్రవరి15( వెలుతురు ):**
రాష్ట్రంలో మద్యం అమ్మకాల జోరు ఊపందుకుంది. రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. మరోవైపు పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్.. దీంతో రాష్ట్రంలో బీర్ల అమ్మకాలు పెరిగినట్లు ఎక్సైజ్ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈమేరకు డిమాండ్ కు తగ్గట్లు బీర్ల కంపెనీలు ఉత్పత్తిని పెంచేశాయి. డిమాండ్ కు తగ్గట్లు సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. రాష్ట్రంలో మొత్తం 13 సంస్థలు బీర్లను తయారు చేస్తుండగా.. నాలుగు కంపెనీల్లో మూడు షిఫ్టుల్లోనూ తయారీని వేగవంతం చేశారు. ఒక్కో కంపెనీ రోజుకు 2 లక్షల బీర్లను తయారు చేసి డిపోలకు సరఫరా చేసేలా ప్రణాళికలు వేసుకున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కువశాతం బీర్లు తయారు చేసే కంపెనీ యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్. అయితే ఈ కంపెనీ సహా మొత్తం 13 కంపెనీలు రోజుకు సగటున 1.5 లక్షల నుంచి 2 లక్షల కాటన్ల బీర్లను డిపోలకు సప్లయ్ చేసే విధంగా ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నాయి. సంబంధిత రుసుములు కూడా చెల్లించాయి. సాధారణ రోజుల్లో రోజుకు రెండు షిఫ్టుల్లో మాత్రమే బీర్లను తయారీ చేస్తుంటారు. అయితే ప్రస్తుతం డిమాండ్ పెరిగింది. దీంతో మూడు షిఫ్టుల్లో పనులు నిర్వహిస్తున్నాయి. వీటిలో కింగ్‌ఫిషర్ సహా వివిధ బ్రాండ్లకు చెందిన బీర్లు సప్లయ్ అవుతున్నాయి. ఇలా ఆయా కంపెనీల నుంచి ప్రతి రోజు సగటున లక్షన్నర కాటన్ల బీర్లు 19 డిపోలకు చేరుతున్నాయి. మరోవైపు ఇటీవల బీర్ల ధరలను 15 నుంచి 20శాతానికి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెరిగిన మద్యం ధరలు ఈనెల 11 నుంచే అమల్లోకి వచ్చాయి. ధరల పెంపు వల్ల ఏడాదికి రూ.2వేల కోట్లు ఆదాయం వస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

# ఆసక్తిరేపుతున్న సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటన

- స్థానిక సంస్థల ఎన్నికలు, మంత్రివర్గ విస్తరణపై రాహుల్‌గాంధీతో చర్చలు

**హైదరాబాద్, ఫిబ్రవరి15( వెలుతురు ):**



తెలంగాణ రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ పార్టీ అధినాయకత్వంతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలతో పాటుగా.. మంత్రివర్గ విస్తరణ, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పైనా రేవంత్ పార్టీ ముఖ్య నేత రాహుల్ తో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఆరుగురుకి అవకావం పైనా ప్రతిపాదలు కోరారు. ఇక, టీపీసీసీకి కొత్త ఇంఛార్జ్ రావటంతో.. పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యల పైన నిర్ణయాలు తీసుకున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్ ఢిల్లీ పర్యటన ఆసక్తి కరంగా మారింది. తెలంగాణ కాంగ్రెస్ కు కొత్త ఇంఛార్జ్ ను నియ మిస్తూ ఏఐసీసీ నిర్ణయం తీసుకుంది. తక్కవ కాలంలోనే తెలంగాణ పార్టీ ఇంఛార్జ్ ల మార్పు రాజకీయంగా చర్చకు కారణమవుతోంది. ఇప్పుడు నూతన బాధ్యతలను మీనాక్షి నటరాజన్ కు అప్పగించారు. రాహుల్ టీం లో కీలకంగా ఉన్న మీనాక్షికి తెలంగాణ బాధ్యతలు అప్పగించటం ద్వారా రాష్ట్రంలో వ్యవహారాల పైన పార్టీ హైకమాండ్ మూడ్ ఏంటనేది స్పష్టం అవుతోంది. ఇదే సమయంలో ఢిల్లీ నుంచి వచ్చిన పిలుపు మేరకు సీఎం రేవంత్ పార్టీ అగ్ర నాయకత్వంతో సమావేశం అవుతున్నారు. ఈ భేటీలో కీలక అంశాల పైన చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ వాయిదా పడుతుండగా.. ఇప్పుడు ఆమోదం దిశగా చర్చ జరుగుతోందని సమాచారం. కులగణన పూర్తి చేయటంతో సూర్యాపేటలోనూ.. గద్వాల్ లోనూ ఏప్రిల్ నూ సభలు ఏర్పాటు చేయాలని రేవంత్ భావిస్తున్నారు. ఈ సభలకు రాహుల్‌గాంధీని ఆహ్వానించనున్నారు. ఇక.. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల పూర్తి చేసిన కులగణన, ఎస్సీ వర్గీకరణపై తీసుకున్న నిర్ణయాలను పార్టీ నాయకత్వానికి వివరించనున్నారు. మంత్రివర్గ విస్తరణకు ఈ సారి ఆమోదం లభిస్తుందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. మంత్రివర్గంలో ఎవరికి అవకాశం ఇవ్వాలనే అంశం పైన సామాజిక సమీకరణాల ఆధారంగా తుది జాబితా ఖరారు చేయనున్నారు. అదే విధంగా నామినేటెడ్ పదవుల భర్తీ పైన చర్చించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కు ముందే నామినేటెడ్ పదవులు భర్తీ చేయటం ద్వారా పార్టీలో జోష్ వస్తుందని భావిస్తున్నారు. అందులో భాగంగా ఈ పదవుల ఖరారు పైన నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

# 42 లక్షల మందికి బోర్డు పరీక్షలు.. భారత్‌తో సహా 27 దేశాల్లో షురూ..


**హైదరాబాద్, ఫిబ్రవరి15( వెలుతురు ):**
సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ దేశవ్యాప్తంగా 2024- 25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, 12వ తరగతి పరీక్షలు ఫిబ్రవరి 15న నుంచి ప్రారంభమయ్యాయి. మొత్తం 42 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాస్తున్నారు. భారత్ సహా 27 దేశాల్లో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. పదో తరగతి పరీక్షలు మార్చి 18వ తేదీ వరకు, 12వ తరగతి పరీక్షలు ఏప్రిల్ 4 వరకు జరగనున్నాయి. తొలిరోజు పదో తరగతి ఇంగ్లిష్ సబ్జెక్టు, 12వ తరగతికి ఆంత్రప్రెన్యూర్‌షిప్ సబ్జెక్టుల పరీక్షలు జరిగాయి. నేటి నుంచి ఆయా తేదీల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఇక తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. తెలంగాణ నుంచి పదో తరగతి విద్యార్థులు సుమారు 50 వేల మంది, 12వ తరగతి విద్యార్థులు దాదాపు 10 వేల మంది పరీక్షలకుపైగా విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో 80 శాతం మంది విద్యార్థులు గ్రేటర్ హైదరాబాద్‌లోనే ఉన్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పదో తరగతి విద్యార్థులు దాదాపు 40 వేలు, 12వ తరగతి విద్యార్థులు 12



వేల మంది వరకు ఉన్నారు. కాగా ఇప్పటికే సీబీఎస్ఈప్రాక్టికల్ పరీక్షలు జనవరిలో ముగియగా.. 10వ తరగతి, 12వ తరగతికి సంబంధించిన థియరీ పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి ప్రారంభమయ్యాయి. ప్రాక్టికల్/ప్రాజెక్ట్/ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు సంబంధించి మార్కులను అప్‌లోడ్ చేసేటప్పుడు పాఠశాలలు కొన్నిసార్లు తప్పులు చేస్తున్నాయని, ఈ సారి ఈ విధమైన తప్పులు చోటు చేసుకోకుండా.. ఆయా పాఠశాలలకు ప్రాక్టికల్, ప్రాజెక్ట్, అంతర్గత మూల్యాంకనం, థియరీ పరీక్షలను సజావుగా నిర్వహించడంలో సహాయపడటానికి సబ్జెక్టుల జాబితా సమాచారం వివరాలను కూడా బోర్డు ఇప్పటికే వెల్లడించిన సంగతి తెలిసిందే. కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్టు (సీమ్యాట్) 2025 తుది ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే) విడుదల చేసింది. మొత్తం 74,012 అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 63,145 అంటే 85.32 శాతం మంది పరీక్షకు హాజరయ్యారు. జనవరి 31వ తేదీన ప్రాథమిక కీ విడుదలైంది. జనవరి 2 వరకు అభ్యంతరాలు స్వీకరించింది. పరీక్ష రాసిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నెంబరు, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి స్కోర్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా జనవరి 25న 107 నగరాల్లో రెండు షిఫ్టుల్లో ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే.

## పారిశ్రామికవేత్త జనార్దన్‌రావు హత్య కేసులో కొనసాగుతున్న విచారణ

**హైదరాబాద్, ఫిబ్రవరి15( వెలుతురు ):**
పారిశ్రామికవేత్త వెలమాటి చంద్రశేఖర్ జనార్దన్ రావు హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్న కీర్తి తేజను రెండో రోజు పంజాగుట్ట పోలీసులు విచారిస్తున్నారు. తాత జనార్దన్ రావును 72 సార్లు కత్తితో పొడిచి హత్య చేశాడు నిందితుడు. మొదటిరోజు విచారణలో భాగంగా పోలీసులకు కీర్తి తేజ సహకరించలేదని తెలుస్తోంది. హత్యకు దారి తీసిన పరిస్థితులపై పోలీసులు ఎంత ప్రశ్నించినా నోరు మెదపలేదని సమాచారం. ఈరోజు ఘటనాస్థలికి తీసుకుని వెళ్లి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రెండో రోజు విచారణలో భాగంగా కీలక విషయాలు వెలుగు చూసే అవకాశం ఉన్నట్లు సమాచారం. మొదటి రోజు విచారణలో కీర్తి తేజ పోలీసులకు సహకరించకపోవడం, డొంకతిరుగుడు సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. హత్యకు దారి తీసిన పరిస్థితులపై కీర్తి తేజ నోరువిప్పని పరిస్థితి. ఎక్కడైతే తాత జనార్దన్ రావును అతికిరాతకంగా దాదాపు 72సార్లు కత్తితో పొడిచి హత్య చేశాడో ఆ ప్రాంతంలో నిందితుడు కీర్తి తేజను తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్సన్ చేసే అవకాశం ఉంది. అయితే అమెరికాలో ఉన్న సమయంలో కీర్తి తేజ డ్రగ్స్‌కు బానిసయ్యారని, హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత తల్లి డిఅడిక్షన్ సెంటర్‌కు తీసుకెళ్లి అతడికి కౌన్సిలింగ్ ఇప్పించినప్పటికీ తీరు మారలేదు. అయితే ఇక్కడ కూడా డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడా, మద్యం మత్తులో కిరాతకానికి ఒడిగట్టాడా అనే అంశాలపై పూర్తి స్థాయిలో విచారణ జరపనున్నారు పోలీసులు. ఇప్పటికే కీర్తి తేజకు సంబంధించిన కుటుంబసభ్యుల స్టేట్‌మెంట్‌లను కూడా





రికార్డు చేశారు. వారిచ్చిన ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు. శనివారం సీన్ రీకన్‌స్ట్రక్షన్ తర్వాత మరిన్ని విషయాలు బయటపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా.. ప్రముఖ పారిశ్రామికవేత్త జనార్దన్ రావు.. సొంత మనవడి చేతిలోనే అతి దారుణంగా హత్యకు గురవడం రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. వెల్జాన్ గ్రూపు సంస్థల అధినేత అయిన జనార్దన్ రావును మనవడు కీర్తి తేజ దారుణంగా 72సార్లు కత్తితో పొడిచి హత్య చేశాడు. ఆస్తి గొడవల కారణంగానే హత్య జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఇటీవల కంపెనీలో డైరెక్టర్ పోస్టును ఓ మనవడికి ఇచ్చారు జనార్దన్. తనకు కూడా డైరెక్టర్ పోస్టు కావాలని కీర్తితేజ పట్టుబట్టగా అందుకు ఆయన నిరాకరించాడు. కీర్తి తేజ ఉన్న చెడు వ్యసనాల కారణంగా డైరెక్టర్ పోస్టు ఇచ్చేందుకు జనార్దన్ రావు అంగకీరించలేదు. దీంతో కోపంతో రగిలిపోయిన కీర్తి తేజ తాత అని చూడకుండా జనార్దన్ రావు కత్తితో దాదాపు 72 సార్లు పొడిచాడు.. అంతేకాకుండా అడ్డుగా వచ్చిన తల్లిపై కూడా 12సార్లు కత్తితో దాడి చేశాడు. వెంటనే కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని అప్పటికే తీవ్రంగా గాయపడిన జనార్దన్ రావు మృతిచెందగా.. గాయాలపాలైన తల్లిని ఆస్పత్రికి తరలించారు కుటుంబసభ్యులు. హత్య అనంతరం పారిపోయిన కీర్తి తేజను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.


## వైసిపి నుంచి భారీగా వలసలు

- టిడిపిలో చేరిన పదిమంది తుని కౌన్సిలర్లు
- కండువా కప్పి ఆహ్వానించిన మాజీమంత్రి యనమల

**కాకినాడ,ఫిబ్రవరి15( వెలుతురు ):**
జిల్లాలో వైసీపీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఒక్కొక్కరుగా వైసీపీని వీడుతూ ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి షాక్ ఇస్తున్నారు. ఇప్పటికే తుని పట్టణానికి చెందిన ముగ్గురు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరగా.. అదే పార్టీకి చెందిన మరో 10 మంది కౌన్సిలర్లు తాజాగా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో మొత్తం 13 మంది కౌన్సిలర్లు వైసీపీకి గుడ్ బై చెప్పినట్లయ్యింది. వీరందరికీ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల



రామకృష్ణుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. త్వరలో తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఒక్కసారిగా ఇంత మంది పార్టీని వీడడంపై జిల్లాలో ఇప్పుడు పెద్దఎత్తున చర్చ నడుస్తోంది. జిల్లాకు చెందిన మరికొంతమంది ముఖ్య నేతలు సైతం కూటమిలోని ఏదో ఒక పార్టీలో చేరేందుకు చూస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, గతేడాది జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పాలైన సంగతి తెలిసిందే. అప్పట్నుంచి వైఎస్ జగన్ తాడేపల్లి ప్యాలెస్‌కు పరిమితం అయ్యారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైసీపీ శ్రేణులు కూటమి వైపు చూస్తున్నారు. మరోవైపు ఎన్నికల్లో ఘోర ఓటమి, జగన్ తీరుపైనా నేతలు, కార్యకర్తల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగిపోతోంది. దీంతో చాలా మంది నేతలు ఆయనకు దూరంగా ఉంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఏపీ మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని సైతం టీడీపీలో చేరారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఆళ్ల నానికి టీడీపీ కండువా కప్పిన సీఎం చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించారు. ఏలూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడిగా ఉన్న ఆయన మూడు నెలల క్రితమే వైసీపీకి రాజీనామా చేసి తాజాగా టీడీపీ గూటికి చేరారు.




## రూ.100 కోట్ల బడ్జెట్‌లోకి వెళ్లిన తండేల్

యువసామ్రాట్ అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం తండేల్. ఈ చిత్రానికి బ్లాక్ బస్టర్ డైరెక్టర్ చందూ మొండేటి దర్శకత్వం వహించారు. ఫిబ్రవరి 07 ఈ మూవీ భారీ అంచనాల మధ్య రిలీజ్ అయింది. ప్రస్తుతం పాజిటివ్ టాక్ తో దూసుకెళ్తోంది. విడుదలైన రెండు రోజుల్లోనే దాదాపు రూ.41కోట్లకు పైగా వసూలు చేసి రికార్డు నమోదు చేసింది మూవీ. అయితే తాజాగా 8 రోజుల్లోనే ఈ మూవీ రూ. 95.20 కోట్ల వసూళ్లు రాబట్టి బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్ సొంతం చేసుకుంది. ఈ వీకెండ్ లోనే రూ. 100 కోట్లు కొల్లగొడుతుందని చిత్ర యూనిట్ అంచనా వేస్తోంది. దీంతో చైతూ రూ. 100కోట్ల క్లబ్ లోకి చేరనున్నట్లు సమాచారం అందుతోంది. ఇక ఈ సినిమాను గీత ఆర్ట్స్ బ్యానర్ పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించారు. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. ఇక ఈ మూవీలో డీ గ్లామర్ లుక్ లో చైతూ, సాయి పల్లవి కనిపించారు. చాలా సన్నివేశాల్ని ఎండలో, వానలో, సముద్రంలో 30 రోజులపాటు రాత్రింబవళ్లు కష్టపడి ఈ చిత్రం షూటింగ్ చేశారట. అందుకే సినిమాలో సముద్రం సన్నివేశాలు చాలా అద్భుతంగా వచ్చాయని ఇండస్ట్రీ వర్గాలతోపాటు సినిమా చూసిన ప్రేక్షకులు చెప్తున్నారు. నాగచైతన్య కెరీర్ లోనే అత్యధిక బడ్జెట్ తో ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు సమాచారం. దాదాపు రూ.90 కోట్లతో ఈ సినిమా రూపొందించినట్లు టాక్. అయితే ప్రస్తుతం పాజిటివ్ టాక్ తో సినిమా దూసుకెళ్తోంది. ఈ వారం వీకెంట్ పూర్తయ్యేనాటికి తండేల్ మూవీ రూ.100 కోట్ల క్లబ్ లోకి చేరుకుంటుందని సమాచారం.

## ఓటీటీలో అకట్టుకున్న అమలాపాల్
### టీచర్ పాత్రపై పలువురి ప్రశంసలు

అమలాపాల్ కీలక పాత్రలో వివేక్ దర్శకత్వం వహించిన మలయాళ చిత్రం 'ది టీచర్'. రెండేళ్ల కిందట థియేటర్లలో విడుదలై మిశ్రమ స్పందనకు పరిమితమైంది. ఇందులో అమలాపాల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా కనిపించింది. 2022 డిసెంబర్‌లో థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు మొదట మిశ్రమ స్పందన వచ్చినా తర్వాత పుంజుకుని హిట్ కేటగిరీలో చేరింది. ఇప్పుడు ఓటీటీలో దూసుకుపోతుంది. ఓటీటీ ప్రేక్షకులు ఈ సినిమా విపరీతంగా ఆదరిస్తున్నారు. ఓ టీచర్ తనకు అన్యాయం చేసిన నలుగురు స్టూడెంట్స్ పై ఎలా ప్రతీకారం తీర్చుకుంటుందన్న కథా ఆచఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు వివేక్. పక్కా మలయాళం మార్క్ రివేంజ్ థ్రిల్లర్ మూవీ నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. రెగ్యులర్ రివేంజ్ థ్రిల్లర్ సినిమాలకు భిన్నంగా ఈ చిత్రం ఉంటుంది. ఇందులో దేవిక అనే టీచర్ పాత్ర అమలాపాల్‌కు చక్కని ప్రశంసలు తీసుకొచ్చింది. ఊహకందని క్లైమాక్స్ సినిమాకే హైలెట్ అయ్యింది. థ్రిల్లర్, రివేంజ్ థ్రిల్లర్ జానర్ మూవీస్ ఇష్టపడే వారికి ఈ సినిమా ఎక్కువ నచ్చుతుంది. ఇందులో హకీమ్ షా, చెంబన్ వినోద్ జోష్, మంజు పిళ్లై కీలక పాత్రలు పోషించారు. దేవిక (అమలా పాల్) ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్. ఓ రోజు స్కూల్లో ఈవెంట్ తర్వాత ఆమె తిరిగి ఇంటికి వెళ్తుండగా మరుసటి రోజు తన శరీరంపై ఉన్న గాయాలు చూసి షాకవుతుంది. అసలు ఆరోజు తనకు ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఓ స్టూడెంట్ ఇంటికి వెళ్లగా.. అక్కడ భయంకరమైన నిజం తెలుస్తుంది.

## రష్మికపై కన్నడిల మండిపాటు
### సొంత ఊరు చెప్పుకోవటానికి ఏంటీ సమస్య?

పుష్ప సినిమాతో నేషనల్ క్రష్ మార్క్ తెచ్చుకుంది కన్నడ బ్యూటీ రష్మిక మందన్న. 'పుష్ప-2'తో పాన్ ఇండియా క్రేజ్‌ను దాటుకుపోయింది. ఇప్పుడు సౌత్‌తోపాటు నార్త్‌లోనూ హవా కొనసాగిస్తోంది. శుక్రవారం విడుదలైన 'ఛావా'తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల ముంబయిలో జరిగిన ఓ ఈవెంట్‌లో ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఆ వ్యాఖ్యలకు కన్నడిగులు రష్మికపై మండిపడుతున్నారు. "నేను హైదరాబాద్ నుంచి వచ్చాను. ఇక్కడి ప్రేక్షకులు నాపై చూపిస్తోన్న ప్రేమాభిమానాలు చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంది" అని ఆమె అనడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం కర్ణాటకలో దీనిపై చర్చ నడుస్తోంది.. ఆమె వ్యాఖ్యలను పలువురు కన్నడ వాసులు తప్పుపడుతున్నారు. ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్నారు. 'విరాజ్‌పేట్ రష్మిక సొంతూరు. హైదరాబాద్‌కు ఎప్పుడు వచ్చింది? ఈ విషయం మాకు తెలియలేదు..!', 'వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు సొంతూరు గురించి చెప్పడానికి వచ్చిన సమస్య ఏమిటి?' అంటూ పలువురు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. గతంలో కన్నడిగులు ఆమెపై మండిపడ్డ సందర్భాలున్నాయి. కర్ణాటక, కొడగు జిల్లా విరాజ్‌పేటకు చెందిన రష్మిక 'కిరిక్ పార్టీ'తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు రష్మిక. 'ఛలో'తో టాలీవుడ్‌కి పరిచయమైయ్యారు. ఇక్కడ వరుస విజయాలు అందుకున్న ఆమె స్టార్ హీరోయిన్‌గా జాబితాలో చేరిపోయింది. ఇప్పుడు అగ్ర హీరోల సరసన నటిస్తోంది. అంతే కాదు హిందీ పరిశ్రమలోనూ అవకాశాలు అందుకుంటోంది.




## వరుస హిట్స్ దూసుకుపోతున్న సాయిపల్లవి

సెన్సేషనల్ బ్యూటీగా పేరు తెచ్చుకున్న బ్యూటీ సాయి పల్లవి. మలయాళ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ఈ అమ్మడు తెలుగులో స్టార్ హీరోయిన్ గా రాణిస్తుంది. వరుసగా హిట్స్ అందుకుంటూ దూసుకుపోతుంది. నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు చేస్తూ వరుసగాహిట్స్ అందుకుంటుంది. రీసెంట్ గా అమరన్, తండేల్ సినిమాలతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శివకార్తికేయన్, సాయి పల్లవిగా జంటగా నటించిన అమరన్ సినిమా తమిళ్ లో తెరకెక్కినా కూడా తెలుగులోనూ సూపర్ హిట్ గా నిలిచింది. ఇక నాగ చైతన్య హీరోగా నటించిన తండేల్ సినిమా సంచలన విజయం సాధించింది. ఈ సినిమా ఏకంగా 100కోట్లకు పైగా వసూల్ చేసి ఇప్పటికీ హౌస్ ఫుల్ కలెక్షన్స్ తో దూసుకుపోతుంది. సాయి పల్లవికి ఇండస్ట్రీలో ఎంతో ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఎక్కడా స్కిన్ షో చేయకుండా అద్భుతంగా నటించి మెప్పిస్తుంది. సాయి పల్లవి నటి మాత్రమే కాదు అద్భుతమైన డాన్సర్ కూడా.. సినిమాల్లోకి రాక ముందు సాయి పల్లవి పలు టీవీ షోల్లో డాన్స్ చేసింది. తెలుగులో డాన్స్ షో ఢీలోనూ పాల్గొంది సాయి పల్లవి. ఇక సినిమాల్లో సాయి పల్లవి తన డాన్స్ తో ఆకట్టుకుంటుంది. అయితే సాయి పల్లవి ఓ సాంగ్స్ కు స్వయంగా కొరియోగ్రాఫ్ చేసుకున్న విషయం తెలుసా.? సాయి పల్లవి కొరియోగ్రఫీ చేసుకున్న సాంగ్స్ ఏవో తెలుసా.? సాయి పల్లవి ప్రేమమ్ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఈ సినిమాలో ఓ సీన్ లో హీరోకు అతని ఫ్రెండ్స్ కు సాయి పల్లవి డాన్స్ నేర్పించే సన్నివేశం ఉంటుంది. ఆ సాంగ్ కు సాయి పల్లవి స్వయంగా కొరియోగ్రాఫ్ చేసిందట. అంతే కాదు తెలుగులోనూ సాయి పల్లవి కొన్ని సాంగ్స్ లో స్టెప్స్ ను కొరియోగ్రాఫ్ చేసుకుందట. -లవ్ స్టోరీ- మూవీలో -సారంగ దరియా%-% పాటలో సాయి పల్లవి కొన్ని స్టెప్స్ కంపోజ్ చేసుకుందట. అలాగే నానితో నటించిన శ్యామ్ సింగరాయ్ సినిమాలో ప్రణవాలయ%-% పాటకి కూడా సాయిపల్లవినే కంపోజ్ చేసిందని టాక్. ప్రస్తుతం సాయి పల్లవి హిందీలో రామాయణం సినిమాలో నటిస్తుంది. అలాగే శింబు సినిమాలోనూ సాయి పల్లవి హీరోయిన్ గా నటిస్తుందట.



## ఫస్ట్ సినిమాలో నటించిన హీరోనే పెళ్లి చేసుకున్న హీరోయిన్

తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషలలో వరుస సినిమాల్లో నటించి ఫేమస్ అయ్యింది. పెళ్లి తర్వాత సినిమాలకు పూర్తిగా దూరంగా ఉండిపోయింది. ఒకప్పుడు ఆమె టాలీవుడ్ క్రేజీ హీరోయిన్. అందం, అమాయకత్వం.. అంతకు మించిన అల్లరితనంతో తెలుగులో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. కెరీర్ మంచి ఫాంలో ఉన్నప్పుడే తన ఫస్ట్ మూవీ హీరోను ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. ? ఆ హీరోయిన్ మరెవరో కాదు.. జెనీలియా. 1987 ఆగస్ట్ 5న ముంబైలో జన్మించిన ఈ అమ్మడు తుఝే మేరీ కసమ్ (నువ్వే కావాలి రీమేక్) సినిమాతో కథానాయికగా బాలీవుడ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఈ సినిమాలో బీటౌన్ స్టార్ రితేష్ దేశ్ ముఖ్ హీరోగా నటించాడు. ఈ సినిమా సమయంలోనే ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయం కాస్త ప్రేమగా మారింది. వీరిద్దరు పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో సిద్ధార్థ్ నటించిన బాయ్స్ సినిమాతో సౌత్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా తర్వాత తెలుగు, తమిళంలో వరుస ఆఫర్స్ అందుకుని తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ సొంతం చేసుకుంది. సిద్ధార్థ్ హీరోగా నటించిన బొమ్మరిల్లు సినిమాతో జెనీలియా క్రేజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఇందులో తన అద్భుతమైన నటనతో మెప్పించింది. పెళ్లి తర్వాత చాలా కాలం సినిమాలకు దూరంగా ఉన్న జెనీలియా ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇస్తుంది.



## పెద్దలమాట చద్దిమూట అంటున్న కంగనా రనౌత్

'పెద్దల మాట చద్ది మూట' అనే విషయం ఇప్పుడు తనకు అర్థం అయిందని బాలీవుడ్ ఫైర్‌బ్రాండ్ కంగనా రనౌత్ అన్నారు. సినీ, రాజకీయ రంగాల్లో క్షణం తీరిక లేకుండా ఉన్నారు. అంతే కాదు తాజాగా వ్యాపార రంగంలోకి అడుగు పెట్టారు. హిమాచల్‌లోని మనాలిలో కేఫ్‌ను ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. "నా చిన్ననాటి కల 'ది మౌంటెన్ స్టోరీ' హిమాలయాల నడిబొడ్డున వికసించింది. ఈ కేఫ్ కేవలం భోజనం చేసే ఒక ప్రదేశం కాదు.. నా తల్లి వంట గది సువాసనలకు నిలయం" అని రాశారు. ఈ సందర్భంగా నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన చిన్నతనాన్ని, తన మాతృమూర్తి చెప్పిన మాటల్ని గుర్తు చేసుకున్నారు. 'ఒక మహిళగా ఇంటి పనులకు ఎక్కువ సమయం కేటాయించాలని అమ్మ ఎప్పుడూ చెబుతుండేది. ఊరగాయ, నెయ్యి తయారు చేయడం, కూరగాయలు ఎలా పండించాలో నేర్చుకోమని చెప్పేది. ఆ మాటల్ని పట్టించుకునే దాన్ని కాదు. అమ్మ తెలివితక్కువతనం తో చెబుతుంది అనుకునేదాన్ని. అవి నేర్చుకోవడం వల్ల ఏమీ ఉపయోగం ఉండదనుకున్నాను. దేశంలోనే చిన్న వయసులో ధనవంతురాలైన మహిళల్లో నేను ఒకదాన్ని అని అనుకునేదాన్ని. కానీ, ఆమె మాటలకు అర్థం ఏంటో ఇప్పుడు అర్థమైంది. నేను కేఫ్ ప్రారంభించాను. మా అమ్మ ఈరోజు ఎంతో సంతోషంగా ఉంది. నేను పరిణతి చెందానని, తెలివైనదాన్ని అయ్యానని అమ్మ భావిస్తోంది. పెద్దల మాట చద్ది మూట.. వారు చెప్పింది వినాలి, పాటించాలి అని ఇప్పుడు అర్థమైంది" అని కంగనా అన్నారు. వాలంటైన్స్ డే సందర్భంగా కంగనా ఈ బిజినెస్‌కు శ్రీకారం చుట్టారు.



# పాలనపై ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు

- రేవంత్ పాలనలో ఏ ఒక్క వర్గం సంతోషంగా లేదు
- రిమాండ్‌లో ఉన్న లక్కినేని సురేందర్‌ని పరామర్శించిన కవిత



**ఖమ్మం, ఫిబ్రవరి15( వెలుతురు ):**
సీఎం రేవంత్ పాలనలో ఓ ఒక్క వర్గం సంతోషంగా లేదని, పాలనపై ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఎమ్మెల్యే కవిత విమర్శించారు. ఖమ్మంలో కవిత శనివారం పర్యటించారు. ఖమ్మం సబ్ జైల్లో రిమాండ్‌లో ఉన్న లక్కినేని సురేందర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. లక్కినేని సురేందర్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కట్టడి చేయాలని చూస్తున్నారని కవిత మండిపడ్డారు. రేవంత్‌వి అన్నీ దొంగ మాటలే..బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేస్తే కేసీఆర్‌ను అడ్డుకున్నట్లేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుబంధు, రైతు బీమా , పింఛన్, ఉద్యోగాలు రాలేదని మండిపడ్డారు. రేవంత్‌వి అన్నీ దొంగ మాటలేనని విమర్శించారు. 14 నెలల కాంగ్రెస్ పాలనలో దొంగహామీలే తప్ప చేసింది ఏం లేదని అన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఖచ్చితంగా ప్రశ్నిస్తామని అన్నారు. రేవంత్ ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా తగ్గేదేలే అని హెచ్చరించారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా కల్పించారు. కేసులకు భయపడొద్దు, ప్రజాక్షేత్రంలో పోరాడుతూనే ఉందామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. కాగా అంతకుముందు ఖమ్మం వెళ్తున్న ఎమ్మెల్సీ కవితకు చౌటుప్పల్‌లో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ ప్రాంత ట్రిబుల్ ఆర్ రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని కవిత అన్నారు. ట్రిపుల్ ఆర్ రైతులకు గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా ఉంటానని చెప్పి.. అధికారంలోకి రాగానే రేవంత్ మాట మరిచారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా ట్రిపుల్ ఆర్ రైతుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ట్రిపుల్ ఆర్ బాధితుల విషయంలో చొరవ తీసుకోవాలని ఎమ్మెల్సీ కవిత కోరారు.

# మోసపూరిత కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- ప్రధాని మోదీ వర్గానికి.. కాదు.. ప్రజలందరినీ మనిషి
- ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డా. లక్ష్మణ్



**సిద్దిపేట,ఫిబ్రవరి15( వెలుతురు ):**
కాంగ్రెస్ మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని బీజేపీ రాజ్యసభ సభ్యులు, పార్లమెంటరీ బోర్డ్ మెంబర్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డా. లక్ష్మణ్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కులంపై సీఎం రేవంత్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యులు, పార్లమెంటరీ బోర్డ్ మెంబర్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డా. లక్ష్మణ్ అన్నారు. సిద్దిపేటలో లక్ష్మణ్ పర్యటించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. మోదీ ఒక వర్గానికి, సమాజానికి చెందిన వారు కాదు.. ప్రజలందరి మనిషి. ప్రపంచ ఖ్యాతి కలిగిన వ్యక్తి అని తెలిపారు. మోదీపై గతంలో రాహుల్ గాంధీ కూడా ఇలాగే అవాకులు, చెవాకులు పేలారని అన్నారు. రాహుల్‌కు పట్టిన గతే రేవంత్ కు పట్టడం ఖాయమని హెచ్చరించారు. మోదీని విమర్శిస్తే, పేరు వస్తుందని రేవంత్ అనుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ కుల గణన తప్పుల తడకగా మారిందని విమర్శించారు. మైనారిటీ బుజ్జగింపు రాజకీయాలకు నిదర్శనం మైనార్టీలతో కూడిన బీసీ కుల జాబితా అని చెప్పారు. ముస్లింలను బీసీలో చేర్చి..ఓట్ల కోసం పాకులడుతున్నారని మండిపడ్డారు. మత ప్రాతపదికన రిజర్వేషన్లను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించదని చెప్పారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన గ్యారెంటీలకు తూట్లు పొడిచారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రజలు నిరాశతో ఉన్నారని చెప్పారు. మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీఫైనల్‌గా భావించి ప్రభుత్వానికి కళ్లెం వేయాలని అన్నారు. మేధావులు ఆలోచన చేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని లక్ష్మణ్ అన్నారు. రేవంత్ రెడ్డిను చూసి సమాజం తల దించుకుంటోందని విమర్శించారు. 20 మ్యాచ్ ఆడిన కేసీఆర్‌కు పట్టిన గతే.. రేవంత్‌కూ పడుతుందని మండిపడ్డారు. 15 ఏళ్లల్లో ఢిల్లీలో మూడు సార్లు రాహుల్ డకౌట్ అయ్యారని విమర్శించారు. మోదీ తినే ఆహారాన్ని, వేసుకునే బట్టలను విమర్శిస్తారా అని ప్రశ్నించారు. తెలంగాణకు మోదీ వేల కోట్ల నిధులు ఇస్తున్నా.. ఇన్ని విమర్శలా చేస్తారా అని లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

- సిబ్బంది, నిర్వాహకులు, దాతలకు అభినందనలు

**హైదరాబాద్,ఫిబ్రవరి15( వెలుతురు ):**
సమాజ సేవా రంగంలో ఎన్టీఆర్ ట్రస్ట్ 28 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ట్రస్ట్ సిబ్బందికి, నిర్వాహకులకు, దాతలకు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలియజేశారు. ఆరోగ్య సంరక్షణ, విద్య, విపత్తు నిర్వహణ సాయం, సాధికారత జీవనోపాధి రంగాలలో పేదలకు, ఆపన్నులకు చేయూతనిస్తున్న మీ సేవా స్ఫూర్తి ప్రశంసనీయమన్నారు. ఈ క్రమంలో మహనీయుడు ఎన్టీఆర్ ఆశయాలను నెరవేరుస్తూ... మీ కృషి ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు చంద్రబాబు.

# జయలలిత ఆస్తుల విలువ 4వేల కోట్లకు పైనే

- కళ్లుచెదిరేలా ఆభరణాలు, చెప్పులు, చీరలు



**బెంగళూరు,ఫిబ్రవరి15( వెలుతురు ):**
దివంగత తమిళనాడు సిఎం జయలలిత ఆస్తులు చూస్తే కళ్లు చెదిరి పోవాల్సిందే. బంగారం, వజ్ర వైఢూర్యాలు మొదలు కాళ్లకు వేసుకునే చెప్పుల వరకు అన్నీ ప్రత్యేకమే. ఇప్పుడు ఆ ఆస్తులను జప్తు చేసుకున్న సమయంలో వాటి విలువను 913.14 కోట్లుగా అధికారులు మదింపు వేయగా.. అది నేడు కనీసం రూ.4,000 కోట్లుగా ఉండొచ్చని అనధికారికంగా తెలుస్తోంది. అయితే ఇంతకుమించి ఉంటుందని అంటున్నారు. ఇక పోయెస్ గార్డెన్ గురించి వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుకు సంబంధించి తమిళనాడు దివంగత సీఎం జయలలితకు చెందిన ఆస్తులు, పత్రాలను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి బెంగళూరులోని కోర్టు అధికారులు అప్పగించారు. బెంగళూరు పరప్పన అగ్రహార కారాగారంలో ఇప్పటి వరకు జయలలిత ఆస్తులు, పత్రాలను భద్రపరిచారు. 10,000 చీరలు, 750 జతల పాదరక్షలు, 27 కిలోల బంగారం, వజ్రాభరణాలు, రత్నాలు, 601 కిలోల వెండి వస్తువులు, 1,672 ఎకరాల వ్యవసాయ భూముల పత్రాలు, నివాసాలకు సంబంధించిన దస్తావేజులు, 8,376 పుస్తకాలు తదితరాలను తీసుకు వెళ్లేందుకు భారీ భద్రతతో అధికారులు ఆరు ట్రంకు పెట్టెలు తీసుకువచ్చారు. న్యాయమూర్తి హెచ్ఎన్ మోహన్ సమక్షంలో వాటిని అధికారులకు అప్పగించారు. జయలలిత అక్రమార్జనకు సంబంధించిన కేసు 2004లో తమిళనాడు నుంచి కర్ణాటకకు బదిలీ అయినప్పుడు అక్కడ జప్తు చేసిన ఆస్తులు, పత్రాలను ఇక్కడికి తీసుకువచ్చి భద్రపరిచారు. మరోవైపు తాము జయలలితకు వారసులమని, ఆ ఆస్తులను తమకే అప్పగించాలని జె.దీపక్, జె.దీప అనే వ్యక్తులు వేసుకున్న అర్జీని కర్ణాటక హైకోర్టు ఇదివరకే కొట్టివేసింది. దాన్ని సవాల్ చేస్తూ వారు సర్వోన్నత న్యాయస్థానంలో వేసిన పిటిషన్‌నూ అక్కడి ధర్మాసనం తోసిపుచ్చింది.

# ఏప్రిల్ 1 నుంచి కొత్త పింఛన్ విధానం



**హైదరాబాద్, ఫిబ్రవరి15( వెలుతురు ):**
కేంద్రం ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త పెన్షన్ విధానం అమలుకు కసరత్తు పూర్తి చేసింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదంతో ఇక పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు యూపీఎస్ పథకం అమలు కానుంది. ఈ పథకం ఇప్ప టికే ఎన్పీఎస్ లో ఉన్న ఉద్యోగులకూ వర్తిస్తుంది. ఇది పాత పెన్షన్ పథకం, జాతీయ పెన్షన్ వ్యవస్థ రెండింటి ప్రయోజనాలను కలిపి యూపీఎస్‌గా రూపకల్పన చేసారు. ఇప్పుడు ఉద్యోగులు దీని నుంచి పెన్షన్ పొందుతున్నారు. యూపీఎస్ అనేది ప్రభుత్వ కొత్త పథకం. జనవరి 24న ప్రభుత్వం యూపీఎస్ ను అధికారికంగా నోటిఫై చేసింది. ఎన్పీఎస్ కిందకు వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈ యూపీఎస్ పథకం వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేసారు. వాజ్‌పేయి హయాంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌పీఎస్‌ను ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో పాత పెన్షన్ పథకం, ఎన్పీఎస్ ప్రయోజనాలను కలిపి తాజాగా యూపీఎస్‌గా రూపొందించారు. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు చివరిగా వారు తీసుకున్న జీతంలో 50% పెన్షన్‌గా అందిస్తుంది. అదే విధంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం, కుటుంబ పెన్షన్, ఏకమొత్తం చెల్లింపు వంటి ప్రయోజనాలు అందుతాయి. ఎన్పీఎస్ కింద ఉన్న ఉద్యోగులకు సైతం యూపీఎస్ ఎంచుకునే అవకాశం ఉంటుంది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు కూడా యూపీఎస్ కింద ప్రయోజనాలను అందిస్తారు. యూపీఎస్ కింద ఉద్యోగి మరణించిన తర్వాత, పెన్షన్‌లో 60% అతని కుటుంబానికి కుటుంబ పెన్షన్‌గా ఇస్తారు.

# జీరో గ్రావిటీ నుంచి గ్రావిటీకి సునీత విలియమ్స్

- భూమ్మీదకు వచ్చిన తరవాత అనేక ఆరోగ్య సమస్యలు
- వెల్లడించిన మరో ఆస్ట్రోనాట్ బుచ్ విల్మోర్


**న్యూయర్క్,ఫిబ్రవరి15( వెలుతురు ):**
అనుకోని పరిస్థితుల్లో అంతరిక్ష కేంద్రంలో ఉండిపోవాల్సి వచ్చిన ఇద్దరు నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ భూమ్మీదకు చేరుకున్నాక ప్రత్యేక పరిస్థితుల్లో ఉండాల్సి ఉంటుంది. వారి దేహం సాధారణ స్థితికి రావడానికి కొంత సమయం పడుతుందని నాసా నిపుణులు తెలిపారు. ఇప్పటికే వారి తిరుగు ప్రయాణం దాదాపు ఖరారైంది. ఎనిమిది నెలల ఎదురుచూపుల తర్వాత.. మార్చి 19న వారు భూమి మీదకు బయల్దేరనున్నారు. జీరో గ్రావిటీ నుంచి గురుత్వాకర్షణ కలిగిన భూ వాతావరణంలోకి రానున్న వారికి సమస్యలు తప్పవని అంటున్నారు. వారి దేహం మొత్తం చిక్కి శల్యమైనట్లుగా మారింది. వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఇదేగాకుండా అంతరిక్షంలో ఎక్కువ కాలం ఉండటం కూడా వారి ఆరోగ్య పరిస్థితిపై ప్రభావం చూపుతుంది. ఒక వ్యోమగామి అంతరిక్షంలోకి ప్రవేశించిన వెంటనే శరీరం స్పేస్ ఎనీమియాకు గురవడం మొదలవుతుందని నాసా నివేదిక చెబుతోంది. ఎర్రరక్తకణాలను నాశనం చేయడం ద్వారా మైక్రోగ్రావిటీ పరిస్థితుల్లో శరీరం ఆక్సిజన్ అవసరాలను తగ్గించుకుంటుంది. శరీరంలో సమతుల్యతను కాపాడే క్రమంలో వాటి సంఖ్య తగ్గిపోతూ ఉంటుంది. దాంతో అలసట, నిస్సత్తువ, శారీరక, మానసిక పనితీరు దెబ్బతినడం వంటి లక్షణాలు కనిపించొచ్చు. అలాగే గుండె పనితీరు దెబ్బతినే అవకాశమూ ఉంది. ఎముకల సాంద్రత తగ్గిపోతుంది.అందుకే వారు తిరిగి వచ్చాక పెన్సిల్ లేపినా వర్కౌట్ చేసినట్టే ఉంటుంది. ఈవిషయాన్ని విల్మోర్ మీడియాకు వెల్లడించారు. 'గ్రావిటీలో చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది. భూమిపై పరిస్థితులకు సర్దుకుపోయే క్రమంలో అసౌకర్యంగా ఉంటుంది. శరీరమంతా భారమైన భావన కలుగుతుంది. పెన్సిల్ ఎత్తినా వర్కౌట్‌తో సమానమవుతుందని విల్మోర్ వెల్లడించారు. స్పేస్‌లో తెలియాడుతూ ఉండే వ్యోమగాములు.. భూమి మీదకు వచ్చిన 24 గంటల్లో ఆ ప్రత్యేక అనుభూతికి దూరమవుతూ ఉంటారు. బోయింగ్ క్రూ ఫ్లైట్ టెస్ట్‌లో భాగంగా నాసా గత జూన్‌లో ఈ ప్రయోగాత్మక పరీక్ష చేపట్టింది. అయితే వారంలోగా వ్యోమగాములు భూమి పైకి తిరిగి రావాల్సిఉంది. కానీ, ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ యాత్రలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. వాహక నౌక థ్రస్టర్లలో లోపాలు తలెత్తటంతో పాటు హీలియం లీకేజీ సమస్యగా పరిణమించింది. దీంతో అందులో ప్రయాణించడం సురక్షితం కాదని నాసా తేల్చింది. దాంతో ఎనిమిది నెలలుగా వారు అంతరిక్ష కేంద్రంలోనే ఉండిపోయారు. స్పేస్‌ఎక్స్‌కు చెందిన డ్రాగన్ వ్యోమనౌకలో వారు తిరిగి భూమి మీదకు బయల్దేరనున్నారు. వారు చేరుకున్న తరవాత పరిస్థితులు అధ్యయనం చేస్తారు.




# ఎలాన్ మస్క్ బిడ్డకు జన్మనిచ్చా

- రచయిత్రి ఆష్లీ సెయింట్ క్లెయిర్ సంచలన వ్యాఖ్యలు

**న్యూయర్క్,ఫిబ్రవరి15( వెలుతురు ):**
ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు సంబంధించి రచయిత్రి ఆష్లీ సెయింట్ క్లెయిర్ సంచలన విషయం వెల్లడించారు. తన బిడ్డకు తండ్రి మస్క్ అంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు పెట్టారు. 'ఐదు నెలల క్రితం నేనో బిడ్డకు జన్మనిచ్చాను. నా చిన్నారికి ఎలాన్ మస్క్ తండ్రి. మా బిడ్డ గోప్యత, భద్రతను దృష్టిలోఉంచుకొని ఇంతకుముందు నేను ఈ విషయాన్ని బహిర్గతం చేయలేదు. కానీ కొన్ని మీడియా సంస్థలు మాత్రం ఆ విషయాన్ని బయటపెట్టాలని ప్రయత్నించాయి. అందుకే నేనే వాస్తవాలు వెల్లడిస్తున్నా. మా సంతానం సురక్షిత వాతావరణంలో జీవించాలని నేను కోరుకుంటున్నాను. మా గోప్యతకు ఎవరూ భంగం కలిగించొద్దని విజ్ఞప్తి చేస్తున్నాను' అని తన పోస్టులో కోరారు. అయితే దీనిపై ప్రస్తుతానికి మస్క్ నుంచి ఎలాంటి స్పందన లేదు. మస్క్‌కు 12 మంది సంతానం. మొదటి భార్య జస్టిన్‌కు జన్మించిన తొలిబిడ్డ అనారోగ్య కారణాలతో 10 వారాలకే మృతి చెందింది. తర్వాత ఆ జంట ఐవీఎఫ్ పద్ధతిలో ఐదుగురు పిల్లలకు జన్మనిచ్చింది. 2008లో వారిద్దరూ విడిపోయారు. తర్వాత బ్రిటన్ నటి తాలులాహ్ రిలేను ఈ టెస్లా సీఈఓ వివాహమాడారు. అయితే వారికి సంతానం లేదు. అనంతరం కెనడియన్ గాయని గ్రిమ్స్‌తో సంబంధం నెరిపారు. వారికి ముగ్గురు పిల్లలు. తన ప్రతిష్ఠాత్మక సంస్థ బ్రెయిన్ టెక్నాలజీ స్టార్టప్ న్యూరాలింక్‌లో




పనిచేస్తోన్న ఎగ్జిక్యూటివ్‌తోనూ మరో ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చినట్లు ఇటీవల మస్క్ వెల్లడించారు. ఇదిలాఉంటే.. మస్క్–జస్టిన్ దంపతులకు పుట్టిన జేవియర్ అలెగ్జాండర్ కొంతకాలం క్రితం అమ్మాయిగా మారారు. తన తండ్రితో కలిసి జీవించకపోవడంతో పాటు ఆకారం లేదా ఇతర ఏ రూపంలోనూ ఆయనతో సంబంధం లేకుండా ఉండాలని కోరుకుంటున్నట్లు జేవియర్ వెల్లడించారు. జేవియర్ పేరును జెన్నా విల్సన్‌గా పేరు మార్చుకున్నారు. దీనిపై ఓ సందర్భంలో మస్క్ స్పందించారు.'జెన్నాకు కమ్యూనిస్టు భావాలు ఎక్కువ. డబ్బులున్న వాళ్లందరూ చెడ్డవాళ్లని భావిస్తుంది. ఆమె అలా మారడానికి తను చదువుకున్న స్కూలే కారణం. తిరిగి ఆమెతో సత్సంబంధాలు ఏర్పరచుకోవడానికి చాలాసార్లు ప్రయత్నించి విఫలమయ్యాను. కానీ ఆమె నాతో కాస్త సమయం కూడా గడపడానికి ఇష్టపడటం లేదు. జెన్నాతో విభేదాలు రావడం చాలా బాధాకరం. నా మొదటి కుమార్తె మరణం కంటే జెన్నాతో విభేదాలే నన్ను ఎక్కువ బాధించాయి' అని వ్యాఖ్యానించారు. ఎలాన్ మస్క్ తండ్రి ఎర్రాల్ మస్క్. ఆయన ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. ఎలాన్ మస్క్ మంచి తండ్రి కాదన్నారు. 'ఎలాన్ తొలి సంతానం ఎక్కువ సమయం నానీల సంరక్షణలోనే ఉండేవాడు. కొన్ని వారాలకే ఆ బాబు చనిపోయాడు. నా కుమారుడు ప్రపంచ కుబేరుడు. తన ఒక్కో బిడ్డను ఒక్కో నానీ చూసుకుంటుంది. పిల్లల కోసం మస్క్ పెద్దగా సమయం కేటాయించడని వెల్లడించారు. ఈక్రమంలో రచయిత్రి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు బహిర్గతం కావడంతో సంచలనంగా మారింది..

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com